ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kurnool, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

5-7-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 155 పేజీలు: 8+4 వెల: 8.00


నా వార్తలే చదువుతా: యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ 5లో

ఇరాన్‌లో ఖమేనీ అంతిమయాత్ర ఆరంభం

# అమరావతిని ఎవరూ మార్చలేరు


**అరాచకాలు చేసేవారికి రాష్ట్రంలో చోటు లేదు..**

**రౌడీయిజం చేసే వారిని నడిరోడ్డులో నిలబెడతా**

**ప్రజా సంక్షేమం, శాంతి భద్రతలే ముఖ్యం**

**కుప్పంలో బంగారు గనులు ప్రారంభిస్తాం**

**బహిరంగ సభలో సిఎం చంద్రబాబు**




శనివారం కుప్పం బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

**కుప్పం, జులై 4 ప్రభాతవార్త :** అమరావతి రాజధానికి మద్దతు పలికి ఆపై 2019లో అధికారంలో వచ్చాక మూడురాజధానులంటూ మూడుముక్కలాటలు ఆడారని, ప్రస్తుతం మావిగన్ అంటున్నారని ఎవరొచ్చినా రాజధాని అమరావతిని మార్చలేరని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మూడు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలో 117కోట్లతో నూతన ఆర్టీసీ బస్‌స్టేషన్, డిపో నిర్మాణానికి శ ంకుస్థాపనచేశారు. అనంతరం కుప్పం బస్టాండులో ఏర్పాటుచేసిన బహిరంగసభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో అరాచకాలు చేసేవారికి చోటు లేదని, జనం ఓట్లేయరని వ్యాఖ్యానించారు. రౌడీలు, నేరాలు చేసేవారికి అవకాశం ఇవ్వాలా? అని ప్రశ్నించారు. జగన్ మావిగన్ అంటూ ఏంటి నీ పిచ్చిఆటలు అంటూ ప్రశ్నించారు. రాజధాని అమరావతికి పార్లమెంట్ ఉభయసభల్లో బిల్లు పాస్ అయిందని రాజ్యాంగం ఆమోదం కూడా పొందిందన్నారు. అమరావతి దేవతల, ప్రజా రాజధాని అన్నారు. ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుతం వైఎస్సార్సీ నేతలు పోలీసులపై సైతం దాడులకు దిగుతున్నారన్నారు. తనకు శాంతిభద్రతలు, రాష్ట్రం, ప్రజాసంక్షేమం ఎంతో ముఖ్యం అన్నారు. సంఘ విద్రోహక శక్తులను వదలనని వారి పాలిట సింహస్వప్నంగా మారుతానని పేర్కొన్నారు. రౌడీయిజం చేసేవారిని నడిరోడ్డుపై నిలబెడతానన్నారు. గతంలో జగన్ కోడికత్తి, గులకరాయి డ్రామాలు సానుభూతికోసం చేశారని పేర్కొన్నారు. తనకు రౌడీయిజ ం తెలియదని హత్యలు చేయలేదని సిఎం పేర్కొన్నారు. చాలామంది తనను సౌమ్యుడు అంటారన్నారు. తాను 48 యేళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, ప్రస్తుతం రౌడీలు, నేరస్తులతో రాజకీయం చేయాలి ్స వస్తోందన్నారు.

**తిరుమల పవిత్రతను కాపాడుతున్నాం**

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) పవిత్రతను తాము కాపాడుతున్నామని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో కల్తీనెయ్యి, ప్రసాదాలు పంచి దేవుడ్ని సైతం అప్రతిష్ట పాలు చేశారన్నారు. తప్పులు చేసిన వారిపై చర్యలు >>2

## జూ॥ లాయర్ల స్టైపెండ్ 10 వేలకు పెంపు

**కర్నూలు హైకోర్టు బెంచి త్వరలోనే ఏర్పాటు: మంత్రి ఫరూక్**

**విజయవాడ, జులై4, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని జూనియర్ న్యాయవాదులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. జూనియర్ న్యాయవాదులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.5,000 స్టైఫండ్‌ను రెట్టింపుచేస్తూ రూ.10,000కు పెంచుతున్నట్లు మంత్రి ఫరూక్ ప్రకటించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే జారీ చేస్తామని వెల్లడించారు. రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను త్వరలోనే ఏర్పాటు చేస్తామని, దీనికి సంబంధించి అవసరమైన అన్ని ప్రక్రియలను వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్పష్టం చేశారు. తన రెండేళ్ల పాలన పురోగతిని వివరిస్తూ ఆయన ఈ ప్రకటన చేశారు. బెంచ్ ఏర్పాటుకోసం కర్నూలులో ఇప్పటికే స్థలాన్ని కేటాయించామని, ప్రస్తుతం హైకోర్టుతో సంప్రదింపులు జరుపుతున్నామని మంత్రి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వానికికూడా దీనికి సంబంధించిన ప్రతిపా దనలు పంపామని, అన్ని అనుమతులు పొంది, త్వరలోనే బెంచ్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడిఉందని ఆయన హామీ ఇచ్చారు న్యాయవ్యవస్థ బలోపేతం కోసం >>2

# 'వైట్ గట్'పై అప్రమత్తం

**ప్రభావిత రొయ్యల చెరువులనుంచి నమూనాల సేకరణ**

**నాణ్యమైన సీడ్, ఫీడ్ మాత్రమే ఉపయోగించాలి**

**రైతులకు నష్టం రానివ్వం: మంత్రి అచ్చెన్నాయుడు**



**విజయవాడ, జులై 4 ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని ఆక్వా రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇటీవల రాష్ట్రంలోని పలు ఆక్వా ప్రాంతాల్లో రొయ్యలలో "వైట్ గట్" వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయనే సమాచారం అందిన వెంటనే ప్రభుత్వం అప్రమత్తమై, యుద్ధ ప్రాతిపదికన చర్యలు ప్రారంభించిందన్నారు. పశ్చిమ గోదావరిజిల్లా ఉండి మండలం మహదేవిపట్నంలో రైతు పి. మనోజ్ వర్మ చెరువును మత్స్యశాఖ అధికారులు పరిశీలించి, నీరు, రొయ్యలు, ఫీడ్, మల నమూనాలను సేకరించి పరీక్షల కోసం కైకలూరు ప్రయోగశాలకు పంపారని, నీటినాణ్యత పరీక్షలను భీమవరం ల్యాబ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే విధంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు.

జిల్లా జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లులు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లుగా పనిచేసి ప్రతి ఆక్వా ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని నమోదిత, నమోదుకాని హేచరీలు, ప్రైవేట్ ఆక్వా ల్యాబ్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, నాణ్యతలేని విత్తనం, నాసిరకం ఫీడ్ విక్రయాలు, తప్పుడు ల్యాబ్ నివేదికలు, నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం సహించబోమని మంత్రి స్పష్టం చేశారు. తప్పు చేసిన వారిపై చట్టపరంగా, శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు "1+1" వంటి ఆకర్షణీయ ఆఫర్ల పేరుతో నాణ్యత లేని రొయ్య పిల్లలను కొనుగోలు చేయవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. తప్పనిసరిగా ధృవీకరించిన హేచరీల నుంచే నాణ్యమైన విత్తనాన్ని కొనుగోలు చేయాలని, చెరువు సామర్థ్యానికి అనుగుణంగా మాత్రమే పిల్లలను వదలాలని సూచించారు. కొనుగోలు చేసిన విత్తనం వివరాలను నమోదు చేసి భద్రపరచుకోవాలని చెప్పారు. చెరువుల నిర్వహణలో బయోసెక్యూరిటీకి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. ప్రతి పంట అనంతరం చెరువును పూర్తిగా ఎండబెట్టడం, సిల్ట్ తొలగించడం, సున్నం వేయడం, క్రిమి సంహారక చర్యలు చేపట్టడం ద్వారా వ్యాధికారకాలను పూర్తిగా నిర్మూలించాలని తెలిపారు. సిఐబిఎ సూచించిన ఉత్తమ నిర్వహణ పద్ధతులను తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

ఈ అంశంపై స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ, ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ, నేషనల్ బ్యూరో ఆఫ్ ఫిష్ జెనిటిక్ రిసోర్సెస్ వంటి జాతీయ, రాష్ట్ర స్థాయి సంస్థలతో సమన్వయం చేసి శాస్త్రీయ పర్యవేక్షణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నవీకరించిన ఎస్ఒపిలను రూపొందించి, ఫిషరీస్ యూనివర్సిటీ విద్యార్థుల ద్వారా గ్రామ స్థాయిలో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా >>2

## కొన్ని చోట్ల పిడుగుల వానలు

**మరో మూడు రోజులు భారీ వర్షాలు**



**విజయవాడ,జులై4, ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో వాతావరణ పరిస్థితుల్లో ఆకస్మిక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. బంగాళాఖాతం వాయువ్య ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతోంది. భారీ వర్షాలకు కారణమోతోంది. దీనివల్ల పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉండటంతో పాటు వచ్చే మూడు రోజుల్లో కొన్ని గంటల్లో అకస్మాత్తుగా ఉరుములు, పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. బలమైన ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. తాజాగా వాతావరణ అంచనాల ప్రకారం.. శనివారం అల్పపీడనం ప్రభావంతో అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో ఒకటి, రెండుచోట్ల భారీ వర్షాలు, మిగతా చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీటితో పాటు ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, పల్నాడు జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓమోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. బాపట్ల, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిస్తాయి. అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఆకాశం మేఘావృతమై, తేలికపాటి జల్లులు పడొచ్చు. అకస్మాత్తుగా వర్షం కురిసేటప్పుడు పిడుగుల ముప్పు పొంచి ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

# కొడుకు బూడిద ఇప్పించండి

**లేదంటే నడిరోడ్డుపై పెట్రోలు పోసుకొని చనిపోతా: మేజిస్టీరియల్ విచారణలో సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి హెచ్చరిక**

**విజయవాడ,జులై 4,ప్రభాతవార్తప్రతినిధి:** గాదె సాయికృష్ణ కేసుకు సంబంధించి మెజిస్టీరియల్ విచారణ కొనసాగుతోంది. నూతన భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)చట్ట నిబంధనలకు లోబడి, మానవహక్కుల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ విచారణ జరపాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో విచారణ కొనసాగుతోంది. విజయవాడ కృష్ణలంకకు చెందిన సాయికృష్ణ కస్టోడియల్ డెత్ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కృష్ణలంక సిఐ నాగరాజు, మరికొందరు కలిసి సాయికృష్ణను చిత్ర హింసలు గురిచేసి చంపేశారని మృతుడి తల్లి విజయలక్ష్మి ఆరోపించింది. దీనిపై ప్రభుత్వం వెంటనేస్పందించి సిఐ నాగరాజు సస్పెండ్ చేసింది. ఆ తర్వాత ఈ కేసు త్వరితగతిన పూర్తిచేసేందుకు సిట్‌ను ఏర్పాటు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన సిట్ సిఐ నాగరాజును అరెస్ట్ చేసింది. దీంతో పాటు అతడికి సహకరించిన కానిస్టేబుల్స్ అశోక్, నానితో పాటు కృష్ణలంక క్రైమ్ కానిస్టేబుళ్లు బాబురావు, సాంబయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించింది. ఈ క్రమంలో బిఎన్ఎస్ పరిధిలో జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా జరుగుతున్న మేజిస్టిరియల్ విచారణకు సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి, కుటుంబసభ్యులు వాంగ్మూలం ఇచ్చేందుకు సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా తన అభిప్రాయాలను, అనుమానాలను సబ్ కలెక్టర్ ఎదుట సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి వినిపించారు. పోలీసులే తన బిడ్డను పొట్టన పెట్టుకున్నారని చెప్పారు.

సాయికృష్ణ గురించి అడిగితే ఫోటోకు దండ వేసుకోమన్నారని ఆమె వాంగ్మూలంఇచ్చారు. అనంతరం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కన్నీటి పర్యంతమయ్యారు. తన కుమారుడు బూడిద ఎక్కడుందో ఇప్పించాలని అధికారులను విజయలక్ష్మి ్మ వేడుకున్నారు. లేదంటే నడిరోడ్డుపై పెట్రోల్ పోసుకుని చనిపోతానని హెచ్చరించారు. తన కుమారుడిని సిఐ నాగరాజు అతి దారుణంగా చంపాడని పేర్కొన్నారు కాళ్లపై మేకులు కొట్టి హింసించి చంపాడని ఆరోపించారు. ఈ కేసులో కొందరిని అరెస్ట్ చేశారని, మిగతా వారి సంగతి ఏంటని ప్రశ్నించారు. సబ్ కలెక్టర్ ఎదుట వివరాలు చెప్పానని, మెజిస్టీరియల్ విచారణకు మళ్లీ పిలుస్తామని వారు చెప్పారని తెలిపారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్‌పై ఉన్నాయంటున్న బూడిద, ఎముకలు తన కుమారుడువేనని ఏమిటి నమ్మకమని, ఇలాంటివి వారు ఎన్నో చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.



**సిట్‌కు కీలకాధారాలు**

గాదె సాయికృష్ణ కస్టోడియల్ మృతి కేసులో సిట్‌కు కీలకాధారాలు లభించాయి, విజయవాడలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్ టెర్రస్‌పై ఎముకలు, కాలిన బూడిదను పోలీసులు గుర్తించారు. ఇవి సాయి కృష్ణకు సంబంధించినవిగా సిట్ అధికారులు భావిస్తున్నారు. ఫోరెన్సిక్ పరీక్షలకోసం డిఎన్ఎ శాంపిల్స్ సేకరిస్తున్నారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ టెర్రస్‌పై ఎముకలు, >>2

## మంత్రి లోకేష్ నేటి నుంచి ద.కొరియా పర్యటన

**పెట్టుబడులపై చర్చలు**

**11దాకా అక్కడే**



**విజయవాడ, జులై4, ప్రభాతవార్త ప్రతినిధి:** భారత్ - దక్షిణ కొరియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం చేసేందుకు తమ దేశంలో పర్యటించాల్సిందిగా రిపబ్లిక్ ఆఫ్ కొరియా (దక్షిణ కొరియా) ఎపి విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌ను ఆహ్వానించింది. దక్షిణ కొరియా ఆహ్వానం మేరకు ఈనెల 5 నుంచి 11వతేదీ వరకు ఆరురోజులపాటు మంత్రి లోకేష్ ఆ దేశంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో మంత్రి లోకేష్ కొరియాలో వివిధ మంత్రిత్వశాఖల ప్రతినిధులతో అధికారిక సమావేశాల్లో పాల్గొంటారు. ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ అధికారిక సమావేశాలను నిర్వహిస్తున్నామని దక్షిణ కొరియా కాన్సులేట్ జనరల్ (చెన్నయ్) చాంగ్ న్యాన్ కిమ్ మంత్రి లోకేష్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇరుదేశాల నడుమ మరింత సహకారం, సంబంధాల బలోపేతం ఈ పర్యటన కీలక అడుగు కాగలదని భావిస్తున్నట్లు కిమ్ తెలిపారు. ఈనెల 5వతేదీన దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో ఇండియా దయాస్పోరా ఆత్మీయ సమావేశానికి హాజరై అక్కడి భారతీయులు, తెలుగువారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. 6వతేదీన దక్షిణ కొరియా టెక్ స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంతోపాటు వివిధ సంస్థలతో పెట్టుబడి చర్చల్లో పాల్గొంటారు. అనంతరం హ్యోసంగ్ భారీపరిశ్రమ సంఘం అధ్యక్షుడు టకేషి యొకోటా, సియోల్ సెమికండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ టేహ్యూంగ్ లీతో సమావేశమవుతారు. 7వతేదీన ఎల్జీ కెమ్ గ్లోబల్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్, ఎల్జీ ఓవర్ సీస్ కంపెనీస్ హెడ్ యున్ జు కోహ్ ఎల్జీ టవర్స్‌లో ఏర్పాటుచేసిన విందు సమావేశంలో పాల్గొంటారు. ఎల్జీ అనుబంధ సంస్థలకు చెందిన ఉన్నత >>2



శనివారం జోధ్‌పూర్‌లో కొత్త విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ

## 'ఉడాన్' పథకానికి రూ. 28,840 కోట్లు

**కొత్తగా 100 ఏరోడ్రోమ్‌లు, 200 హెలిప్యాడ్‌ల అభివృద్ధి**

**-రాజస్థాన్‌లో ప్రధాని మోడీ**

**జోద్‌పూర్,జులై 4:** రాజస్థాన్ అభివృద్ధికి కొత్త ప్రాజెక్టులు మరింత వేగాన్ని అందిస్తాయని ప్రధాని మోడీ పేర్కొన్నారు. శనివారం రాష్ట్రంలోని పచ్‌ప్రద ఆయిల్ రిఫైనరీతోపాటు జోద్‌పూర్‌లో కొత్తగా సుమారు రూ.480 కోట్ల వ్యయంతో నిర్మించిన విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని ప్రధాని ప్రారంభించారు. 23 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ భవనం ద్వారా ఏడాదికి 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించవచ్చు. రాజస్థాన్ సంప్రదాయ కళాకృతులు, ఆధునిక సదుపాయాల మేళవింపుగా టెర్మినల్‌ను తీర్చిదిద్దారు. దీనివల్ల మార్వార్ ప్రాంతంలో పర్యటకం,వాణిజ్యం, ఉపాధికి కొత్త అవకాశాలు లభిస్తా >>2



## 20 నుంచి వర్షాకాల పార్లమెంటు

**కీలక బిల్లుల ఆమోదం కోసం ఎన్డీయె కసరత్తు**

**ఆగస్టు 13 దాకా కొనసాగనున్న సమావేశాలు: కేంద్రమంత్రి రిజిజు**

**న్యూఢిల్లీ,జులై 4:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20 నుంచి ఆగస్టు 13 వరకు నిర్వహించనున్నారు. మొత్తం 25 రోజుల వ్యవధిలో 19 రోజులపాటు సభా కార్యకలాపాలు కొనసాగనున్నాయి. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ పార్లమెంట్ ఉభయసభల సమావేశాలకు ఆమోదం తెలిపారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శనివారం ఆ విషయాన్ని వెల్లడించారు. వర్షాకాల సమావేశాల తేదీలను కిరణ్ రిజిజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు >>2

## గోదావరి పుష్కరాలు తొలిదశ పనులకు 580 కోట్లు

**- మంత్రి నారాయణ వెల్లడి**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జులై 4,ప్రభాతవార్త:** గోదావరి మహా పుష్కరాలు-2027ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో తొలి దశ అభివృద్ధి పనుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా రూ.580 కోట్ల నిధులను వివిధ పథకాల ద్వారా విడుదల చేయనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డా. పి. నారాయణ తెలిపారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్‌లో గోదావరి మహా పుష్కరాల నిర్వహణ, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నగర మౌలిక సదుపాయాలపై ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ పి. సంపత్ కుమార్, కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై. మేఘాస్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్‌లతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ గోదావరి మహాపుష్కరాలు ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వివిధ శాఖల పనుల పురోగతిపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించామన్నారు. పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధం, పుష్కరఘాట్లు తదితర మౌలిక సదుపాయా >>2



శనివారం కుప్పం ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

# అమరావతిని ఎవరూ మార్చలేరు

>> చేపట్టామని ప్రస్తుతం భక్తుల మనోభావాలను గౌరవిస్తున్నామన్నారు. ప్రస్తుతం టిటిడి ప్రసాదాలకు డిమాండ్ పెరిగిందన్నారు. సమాజంలో అన్ని మతాలను గౌరవించాలని దాడులు తగవని పేర్కొన్నారు.

**కుప్పంలో బంగారు గనులు ప్రారంభిస్తాం**

కుప్పం సమీపం చిగురుగుంటలో ఉన్న బంగారు గనులను త్వరలోనే ప్రారంభించేలా చర్యలు చేపడతామని సిఎం చంద్రబాబు ప్రకటించారు. అలాగే రాష్ట్రంలో ఉన్న రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. భూవివాదాలు లేని వ్యవస్థకు శ్రీకారం చుడతామన్నారు. బ్లాక్‌చైన్ టెక్నాలజీ, క్యుఆర్ కోడ్‌లతో రైతుల భూరికార్డులు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టామన్నారు. గత ప్రభుత్వంలో రైతుల పాస్ పుస్తకాలపై ఫోటోలు ముద్రిస్తే తమ ప్రభుత్వం రైతులకు రాజముద్రతో పాస్ పుస్తకాలు అందిస్తోందన్నారు. ఈనెలలోనే తల్లికివందనం పథకం అమలు చేస్తామన్నారు.

**ప్రకృతిసేద్యం శ్రీరామరక్ష**

రాష్ట్రానికి ప్రకృతి సేద్యం శ్రీరామరక్ష అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. 20 లక్షలమంది రైతులు ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. ప్రజలు కూడా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలన్నారు. వాతావరణ ంలో మార్పులు సైతం సంభవిస్తున్నాయని గతేడాది వర్షాలు బాగా కురిసి 65శాతం రిజర్వాయర్లకు నీరు చేరిందన్నారు. ఈ యేడాది వర్షాలు లేక ఆల్మట్టి డ్యామ్, కృష్ణా, గోదావరి నదులకు నీరు రాలేదన్నారు. పర్యావరణాన్ని కాపాడితేనే వర్షాలు పడతాయన్నారు. ఇరాన్- అమెరికా యుద్ధంతో పెట్రోల్, డీజిల్, నిత్యాసరాల ధరలు పెరిగాయన్నారు. అంతకుముందు కుప్పం ఏరియా ఆస్పత్రిలో సిఎం చంద్రబాబు 1.70కోట్లతో ఏర్పాటుచేసిన సిటిస్కాన్ సెంటర్‌ను ప్రారంభించారు. కుప్పం టిడిపి కార్యాలయంలో జననాయకుడు సిస్టమ్‌ను పరిశీలించారు. అనంతరం కంగుంది గ్రామంలో 355 మంది రైతులకు 460 ఎకరాల భూపట్టాలను సిఎం చంద్రబాబు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి, ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం , టిడిపి జిల్లా అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్‌రెడ్డి, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కడ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కుప్పం మండల అధ్యక్షుడు రాజగోపాల్ పాల్గొన్నారు.

# కొడుకు బూడిద ఇప్పించండి

>> బూడిద, అనుమానాస్పద మరకలున్న లాఠీ, పాక్షింగా కాలిన ఇనుప హ్యాండ్ గొలుసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు కస్టడీలో పోలీసుల దాడి వల్లే సాయికృష్ణ మరణించాడని సిట్ ఇప్పటికే నిందితుల రిమాండ్ రిపోర్టులో పేర్కొంది. ఈ కేసులో సస్పెండైన సిఐ నాగరాజును కస్టడీకి తీసుకుని మృతదేహాన్ని తరలించిన వివరాలపై విచారణ జరుపుతున్నారు. తన కుమారుడి మృతదేహం లేదా కనీసం అస్థికలు, బూడిదైనా తనకు ఇవ్వాలని సాయికృష్ణతల్లి విజయలక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. విజయవాడ లోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మెజిస్టీరియల్ విచారణకు హాజరైన సందర్భంలోను ఆమె తన వాంగ్మూలాన్ని సమర్పించారు,ఈ కేసులో మరి కొందరు నిందితులన్నట్లు ఆమె ఆరోపిస్తున్నారు.అయితే సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో సిట్ లాకప్ సిసి ఫుటేజీ ధ్వంసం చేసారని అభియోగిస్తుంది.కేసుకు కీలకాధారాలైన మరి కొన్ని సిసి కేమెరాల ఫుటేజీని సిట్ సేకరించిందంటున్నారు. కృష్ణలంక స్టేషన్‌కు సమీపంలోని వీధుల్లోని సిసి కేమోరా పుటేజీ,స్మశానికి వెళ్లే దారిలోని ఫుటేజీని సిట్ సేకరించినట్లు సమాచారం.



శనివారం పాపికొండల విహార యాత్ర అధికారికంగా ప్రారంభం కావడంతో లాంచీలు బయలుదేరిన దృశ్యం

# మన్యానికి మళ్లీ పర్యాటక సందడి

## రెండు వైపులనుండి ప్రారంభమైన పాపికొండల విహార యాత్ర

**చింతూరు, జులై 4, ప్రభాతవార్త:** మన్యానికి మళ్లీ పర్యాటకుల సందడి మొదలైంది. గత 20 రోజులుగా వివిధ కారణాలతో నిలిచిపోయిన పాపికొండల విహార యాత్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేయటంతో శనివారం అధికారికంగా పునః ప్రారంభం అయింది. పోలవరం జిల్లా వరరామచంద్రపురం మండలం పోచవరం మరియు దేవిపట్నం మండలం గండి పోచమ్మ గుడి వద్ద నుండి శనివారం ఉదయం అధికారికంగా విహార యాత్ర లాంచీలు ప్రారంభం అయ్యాయి. గత 20 రోజులుగా లాంచీలు నిలిచిపోవటంతో పర్యాటకుల సందడి లేక మన్యం ప్రాంతాలు వెలవెలబోయాయి.శనివారం పర్యాటకులు కాస్త పలుచగా ఉన్న గోదావరి నదిలో పాపికొండల విహార యాత్ర మొదలైంది అన్న వార్త పత్రికల్లో, సామజిక మధ్యమాల్లో ప్రచారం కావటంతో బుకింగులు మొదలైనాయి. 20 రోజులుగా వెలవెల బోయిన ప్రాంతాల్లో మళ్లీ పర్యాటకులు సందడి చేయనున్నారు.అధికారులు, పోలీసులు, ఇరిగేషన్ అధికారులు వారి వారి పరిధిలో అవసరమైన అనుమతి పత్రాలు, లాంచిల ఫిట్నెస్, పర్యాటకుల రక్షణ చర్యలను పరిశీలించి అన్ని సరిగా ఉంటెనే అనుమతులు మంజూరు చేశారు. పర్యాటకుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు అధికారులు ప్రకటించారు.

# 'ఉడాన్' పథకానికి రూ. 28,840 కోట్లు

>> యని ప్రధాని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రాంతీయ వాయు మార్గాల అనుసంధానాన్ని మరింత మెరుగుపరిచేందుకు సవరించిన ఉడాన్ పథకాన్ని కూడా ప్రధాని ప్రారంభించారు. రాబోయే పదేళ్ల కోసం ఈ పథకం కింద రూ.28,840 కోట్లను కేటాయించారు. కొత్తగా 100 ఎయిరోడ్రోమ్‌లు, 200 హెలిప్యాడ్‌లను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాజస్థాన్ ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికైన సుమారు 54 వేల మందికి నియామక పత్రాలు అందించినట్లు ప్రధాని తెలిపారు. వారికి అభినందనలు తెలియజేశారు. స్వావలంబనతోనే స్వాభిమానాన్ని నిలబెట్టుకోవచ్చని, కొత్త ప్రాజెక్టులతో రాజస్థాన్‌తో పాటు దేశ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. పచ్‌పద్రలో ప్రారంభించిన గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీకమ్‌పెట్రోకెమికల్ కాంప్లెక్స్ దేశ ఇంధన రంగంలో చారిత్రక మైలురాయి అని ప్రధాని అభివర్ణించారు. రాజస్థాన్‌లో ఏర్పాటు చేసిన తొలి రిఫైనరీ కూడా ఇదేనని తెలిపారు. ఈ ప్రాజెక్టు పశ్చిమ రాజస్థాన్ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలను మార్చివేస్తుందని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంతో పాటు రాజస్థాన్ స్వావలంబన సాధించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వాలు కేవలం శంకుస్థాపనలకే పరిమితమయ్యేవని ప్రధాని విమర్శించారు. శిలాఫలకాలు వేసిన తర్వాత ప్రాజెక్టులను యేళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచేవారని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వాల పనితీరు అందుకు పూర్తి భిన్నంగా ఉంటుందని చెప్పారు. ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడంతో బాధ్యత ముగిసిందని భావించకుండా వాటిని సకాలంలో పూర్తి చేసేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తామని తెలిపారు. ఇటీవల రిఫైనరీ ప్రాజెక్టు ప్రాంతంలో జరిగిన ప్రమాదాన్ని ప్రస్తావించిన ప్రధాని, ఆ తర్వాత మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసిన కార్మికులు, అధికారులను అభినందించారు. ఎంత పెద్దసవాలు ఎదురైనా నవభారత్ తన సంకల్పం నుంచి వెనక్కి తగ్గదని వారు నిరూపించారని ప్రశంసించారు. పచ్‌పద్ర కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.1.06 లక్షల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. పెట్రోకెమికల్స్, పట్టణ రవాణా, రైల్వేలు, జాతీయ రహదారులు, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ పంపిణీ తదితర రంగాలకు ఈ ప్రాజెక్టులు సంబంధించినవి. వీటిలో రూ.13 వేల కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న జైపూర్ మెట్రో రైలు ప్రాజెక్టు ఫేజ్2 కీలకంగా ఉంది. ఈ ప్రాజెక్టుకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు.

# జూ॥ లాయర్ల స్టైపెండ్ 10 వేలకు పెంపు

>> ప్రభుత్వం తీసుకుంటున్న ఇతర చర్యలను కూడా ఆయన వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 96 కోర్టులను ఏర్పాటు చేయడంతో పాటు న్యాయవ్యవస్థలో 1770 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కోర్టు భవనాలు, న్యాయమూర్తుల నివాస గృహాలు, అతిథి గృహాల నిర్మాణం, అభివృద్ధి కోసం రూ.216 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.ఇతర కీలక నిర్ణయాలలో భాగంగా, లా ఆఫీసర్ల పదవీ విరమణ వయస్సును 61 ఏళ్లకు పెంచామని, హైకోర్టు జడ్జిల గ్రాట్యుటీ పరిమితిని రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచామని గుర్తు చేశారు. హైకోర్టులోని ఏజీపీల గౌరవ వేతనాన్ని 25 శాతం పెంచగా, స్పెషల్ జ్యుడిషియరీ మేజిస్ట్రేట్‌ల గౌరవ వేతనాన్ని రూ.30,000 నుంచి రూ.45,000కు పెంచి, వారికి అదనంగా నెలకు రూ.5,000 రవాణా ఖర్చులు మంజూరు చేసినట్లు మంత్రి ఫరూక్ వివరించారు.

# ద.కొరియా పర్యటన

>>స్థాయి ప్రతినిధి బృందాలు ఈ సమావేశానికి హాజరుకానున్నాయి. 8వతేదీన కొరియన్ మెరైన్ అక్విప్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. 9వతేదీన కొరియన్ పొలిటికల్ ఎఫైర్స్ డిప్యూటీ మినిస్టర్ మిస్. యుయిహే సిసిలియా చుంగ్‌తో భేటీ అవుతారు. అనంతరం కొరియన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్వెస్టిమెంట్స్ డిప్యూటీ మినిస్టర్ కాంచన్ కాంగ్‌తో సమావేశమవుతారు. 10వతేదీన వివిధ సంస్థల ప్రతినిధులతో పెట్టుబడి చర్చలతోపాటు కొరియా ఆటో ఇండస్ట్రీ కోఆపరేషన్ ఏజన్సీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరవుతారు. అదేరోజు రాత్రి సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్-2026 విజయవంతం చేయాలని కోరుతూ కొరియా కంపెనీల ప్రతినిధులతో రోడ్ షోలో పాల్గొంటారు.

# వీధివ్యాపారుల చట్టం మేరకు నగరపాలికలు, పురపాలికలకు కొత్త మార్గదర్శకాలు జారీ

**విజయవాడ,జులై 4,ప్రభాతవార్తప్రతినిధి:** వీధివ్యాపారుల చట్టం మేరకు నగరపాలికలు, పురపాలికలకు ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. పట్టణ స్థానికసంస్థలు ఇచ్చిన వీధివ్యాపారుల చట్టం మేరకు నగరపాలికలు, పురపాలికలకు కొత్త మార్గదర్శకాలు జారీవీధివ్యాపారుల చట్టం మేరకు నగరపాలికలు, పురపాలికలకు ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. పట్టణ స్థానికసంస్థలు ఇచ్చిన వీధివ్యాపార ప్రణాళికలు ఆమోదిస్తూ నోటిఫికేషన్ ఇచ్చింది. 51 నగరాలు, పట్టణాల్లోని వీధివ్యాపారుల ఉపాధికి ఊతం కలగనుంది. స్థానిక సంస్థలు, వీధివ్యాపార కమిటీల ఏర్పాటుతో సజావుగా వ్యాపారం సాగనుంది. స్థానికంగా ఇబ్బందులు రాకుండా వీధివ్యాపారులకు గుర్తింపు కార్డులు జారీ చేయనుంది. వీధివ్యాపారులకు కేంద్రం నుంచి వచ్చే రుణాల్లో ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోనుంది.

# సివిల్ తగాదాలో ప్రియాంక వదిన సాయిరా వాద్రా

**ఉధమ్‌సింగ్‌నగర్, జులై 4:** ఉత్తరాఖండ్‌లోని ఉధమ్ సింగ్ నగర్‌లో ఉన్న 4 హెక్టార్ల వివాదాస్పద భూమి చుట్టూ సాగుతున్న భూ వివాదం ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది. కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా వదిన సాయిరా వాద్రా మరణించిన భూ యజమాని కుల్సుమ్ ఖాన్ సోదరి, 90 ఏళ్ల వృద్ధురాలు నస్రీన్ సంగాల మధ్య ఈ ఆస్తి తగాదా నడుస్తోంది. కుల్సుమ్ ఖాన్ 2025 డిసెంబర్‌లో అవివాహితగా చనిపోవడంతో, ఆమె ఆ భూమిని విల్లు ద్వారా తనకు రాసిచ్చిందని సాయిరా వాద్రా వాదిస్తుండగా తానే అసలైన వారసురాలినని నస్రీన్ పేర్కొంటున్నారు. ఈ సివిల్ కోర్టు వివాదం పెండింగ్‌లో ఉండగానే, నస్రీన్ తన అనుచరులతో కలిసి ఫామ్‌హౌస్‌లోకి చొరబడి కార్మికులను వెళ్లగొట్టి భూమిని స్వాధీనం చేసుకున్నారని సాయిరా వాద్రా ఆరోపించారు. దీనిపై కిచ్చా కాంగ్రెస్ ఎమ్మెల్యే తిలక్ రాజ్ బెహర్ నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు ఫామ్‌హౌస్ వెలుపల భారీ నిరసనకు దిగారు.

కోర్టు పరిధిలో ఉన్న భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు యంత్రాంగం సహకరిస్తోందని ఆరోపిస్తూ భూమిని సీల్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీ సులు నిరసనకారులను అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణంనెలకొంది. ఈ క్రమంలో అధికార యంత్రాంగం పక్షపాతంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆత్మాహుతి చేసుకుంటానని హెచ్చరించారు. ఈ వివాదం దిల్లీకి చేరడంతో, సాయిరా వాద్రా ద్వారా ప్రియాంక గాంధీ, రాబర్ట్ వాద్రాలు భూకబ్జాకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ జాతీయ ప్రతినిధి ప్రదీప్ భండారీ సంచలన ఆరోపణలు చేశారు. మరోవైపు, ఈ వ్యవహారంపై ఉత్తరాఖండ్ హైకోర్టు తీవ్రంగాస్పందించింది. సివిల్ కోర్టు ఇప్పటికే జూన్ 11న తాత్కాలిక స్టే ఇచ్చినప్పటికీ, మళ్లీ భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్‌ఎస్‌ఎస్) సెక్షన్ 164 కింద సమాంతరంగా ఎగ్జిక్యూటివ్ చర్యలు ప్రారంభించడంపై జస్టిస్ ఆలోక్ మహ్రా నేతృత్వంలోని ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది.

# పంజాబ్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్ గోల్డీథిల్లాన్ స్పెయిన్‌లో అరెస్టు

**న్యూఢిల్లీ,జులై 4:** పంజాబ్ పోలీసుల యాంటీ గ్యాంగ్‌స్టర్ టాస్క్ ఫోర్స్, కేంద్ర నిఘా సంస్థలు, చండీగఢ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ ఆపరేషన్ ఫలితంగా స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో గోల్డీ ధిల్లాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. కొంతకాలంగా అతడి కదలికలపై నిఘా పెట్టిన అధికారులు చివరకు అరెస్ట్ చేయడంలో విజయం సాధించారు. అతడిని భారత్‌కు తీసుకురావడానికి నేరస్తుల అప్పగింత ప్రక్రియను భారత అధికారులు ప్రారంభించారు.గోల్డీ ధిల్లాన్‌పై చండీగఢ్ సెక్టర్11లోని కుమార్ మెడికల్ హాల్ క్యాషియర్ జనకీ దాస్‌ను జూన్ 13న జరిగిన కాల్పుల్లో హత్య చేసిన కేసు నమోదైంది. ఈ ఘటన నగరంలో తీవ్ర కలకలం రేపింది. అలాగే ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే నీనా మిత్తల్‌కు బెదిరింపులు చేసిన కేసుతో పాటు కెనడాలో జరిగిన పలు కాల్పుల ఘటనల్లోనూ అతడి ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి.గోల్డీ రాజ్‌పురా పేరుతో కూడా గుర్తింపు పొందిన ధిల్లాన్, కెనడాలో ఉన్న ఉగ్రవాదిగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ప్రకటించిన గోల్డీ బ్రార్‌కు సన్నిహిత సహచరుడిగా పోలీసులు తెలిపారు. అయితే గోల్డీ బ్రార్, గోల్డీ ధిల్లాన్ ఇద్దరూ వేర్వేరు వ్యక్తులని అధికారులు స్పష్టం చేశారు. చండీగఢ్‌లోని ఓ వ్యాపారిపై జరిగిన ఎక్స్‌టార్షన్, కాల్పుల కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో ఇద్దరి పేర్లూ ఉన్నాయి. 2022లో విదేశాలకు పారిపోయిన ధిల్లాన్, అక్కడి నుంచే పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో తన నేర ముఠాను నిర్వహించినట్లు విచారణలో తేలింది. వసూళ్లు, లక్ష్య హత్యలు, ప్రత్యర్థులపై దాడులు, అక్రమ ఆయుధాలు, మాదకద్రవ్యాల వ్యాపారాన్ని నియంత్రించేందుకు కుట్రలు పన్నినట్లు పోలీసులు తెలిపారు. జాంగీ, సిగ్నల్ వంటి ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్‌ల ద్వారా తన అనుచరులకు ఆదేశాలు జారీచేస్తూ పోలీసులకుచిక్కకుండా కార్యకలాపాలు కొనసాగించినట్లు అధికారులు పేర్కొన్నారు.

# ఓటర్ల జాబితా సమగ్ర పునశ్చరణకు పౌరులంతా సహకరించాలి

## రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వర రావు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై4, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ఓటర్లందరితో కూడిన సమగ్ర జాబితా రూపకల్పనకు పౌరులందరూ స్వచ్ఛందంగా ప్రభుత్వానికి సహకరించి తమ వివరాలను అందజేయాలని ప్రముఖ ప్రవచనకర్త, రాష్ట్ర ప్రభుత్వ 'విద్యార్థుల నైతిక విలువల' సలహాదారు చాగంటి కోటేశ్వర రావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన తన గృహాన్ని సందర్శించిన బూత్ స్థాయి అధికారికి వివరాలు నింపిన తమ కుటుంబ సభ్యుల సర్ ఎన్ రోల్ మెంట్ ఫారాలను అందజేసారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 15వ తేదీన ప్రారంభమైన ఈ ఓటర్ల జాబితాల సమగ్ర పునశ్చరణ మరియు నూతన నమోదు ప్రక్రియ ఈ నెల 14వ తారీకు వరకు కొనసాగుతుందని పౌరులందరూ తమ కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాలన్నింటినీ ఎలాంటి దాపరికం లేకుండా స్పష్టంగా అందజేయాలని కోరారు. దీనివల్ల అర్హులైన ఓటర్లను గుర్తించి, పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయడం అధికారులకు తేలికవుతుందని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా పక్కాగా ఉన్నప్పుడే, రేపటి రోజున ఒక మంచి ప్రభుత్వాన్ని, సరైన ప్రజాప్రతినిధులను ఎంచుకునే అవకాశం ప్రజలకు లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఒక ప్రధానమైన కర్తవ్యంగా భావించి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని చాగంటి కోటేశ్వరరావు కోరారు. అధికారులు అందజేసిన ఎన్రోల్మెంట్ పత్రాలను సత్వరం పూర్తి చేసి తిరిగి ఇవ్వాలని, రేపు, ఎల్లుండి అని నిరక్ష్యం చేస్తూ అధికారులను చుట్టూ తిప్పించకుండా వెంటనే ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

పౌరులు త్వరితగతిన స్పందించి సహకరిస్తేనే, ఎన్నికల సంఘం మరియు అధికారులు ఈ కార్యక్రమాన్ని అనుకున్న సమయానికి విజయవంతంగా పూర్తి చేయగలుగు తారని ఆయన స్పష్టం చేశారు. అందులో భాగంగానే తాను కూడా ఈ రోజు తన కుటుంబ వివరాలన్నింటినీ పత్రంలో నమోదు చేసి అధికారులకు అందజేసినట్లు తెలియజేశారు.

దేశ భవిష్యత్తును నిర్ణయించే ఈ ప్రక్రియలో పౌరులందరూ తమ వంతు బాధ్యతగా ఎన్నికల సంఘానికి, ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# 'వైట్ గట్'పై అప్రమత్తం

>> మత్స్యశాఖ అధికారులు యేడు రోజుల్లోగా తనిఖీలు, నమూనాల సేకరణ, తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించామని మంత్రి తెలిపారు. రైతులకు అవగాహన కల్పించడంలో లేదా ఆదే శాలఅమలులో నిర్లక్ష్యం వహించిన అధికారులపైకూడా క్రమశిక్షణా చర్యలు తప్పవని స్పష్టంచేశారు. రొయ్యల రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.

# తొలిదశ పనులకు 580 కోట్లు

>> లను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనుల కోసం తొలి దశలో రూ.580 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అందులో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.150. కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు..సమీక్ష సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా నగరంలో అమలవుతున్న అభివృద్ధి పనులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.పుష్కరాల నాటికి పూర్తి చేయాల్సిన ప్రాధాన్య పనులపై తమ సూచనలు తెలియజేయగా, అన్ని శాఖలు సమన్వయంతో నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి డా పి నారాయణ మాట్లాడుతూ, పుష్కరాలకు ముందుగానే సమగ్ర ప్రణాళికతో నగరంలో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్య మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్, యాన్యుటీ మోడల్ తదితర పథకాల ద్వారా తొలి దశలో రూ.580 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు, అందులో రాష్ట్ర ప్రభుత్వం 150 కోట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. జూలై 11 వ తేదీన మరోసారి జిల్లా పర్యటన కు రానున్నట్టు వెల్లడించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రాధాన్యతా పనులను గుర్తిస్తే ఈ నెల 11న పరిపాలనా అనుమతులు (సాంక్షన్లు) మంజూరు చేస్తామని తెలిపారు.గోదావరి నది కాలుష్య నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, నగరంలో రూ.140 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయడం ద్వారా నదీ కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని మంత్రి పేర్కొన్నారు. అలాగే ఇరిగేషన్, దేవాదాయ, ఆర్ అండ్ బి శాఖలు పుష్కర పనులను వేగవంతం చేస్తున్నాయని తెలిపారు.ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ గోదావరి పుష్కరాలకు అవసరమైన నిధుల సమీకరణలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు.

# వర్షాకాల పార్లమెంటు

>> మేరకు 2026 పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నిర్వహణకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారని ఈనెల20న ప్రారంభమయ్యే సమావేశాలు ఆగస్టు 13 వరకు కొనసాగుతాయని తెలిపారు. జాతీయ ప్రాధాన్యం కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, సంభాషణలు, నిర్ణయాలకు ఈ సమావేశాలు వేదికగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి పార్లమెంట్ సమావేశాలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారిగా ఉభయసభలు సమావేశం కానున్నాయి. బెంగాల్, అసోం,పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో అధికార భారతీయ జనతా పార్టీ విజయాలు సాధించిన నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాలపై ఆసక్తి నెలకొంది. మారిన రాజకీయ సమీకరణాల ప్రభావం ఉభయసభల కార్యకలాపాలపై కనిపించే అవకాశం ఉంది.

తృణమూల్ కాంగ్రెస్, శివసేన పార్టీల్లో చోటుచేసుకున్న పరిణామాలు సైతం వర్షాకాల సమావేశాల్లో చర్చనీయాంశంగా మారనున్నాయి. తమను ప్రత్యేక గ్రూపులుగా గుర్తించాలని కోరుతూ 20 మంది తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, ఆరుగురు శివసేన (యూబిటి) ఎంపీలు చేసిన విజ్ఞప్తులపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీంతో స్పీకర్ తీసుకునే నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు రాజ్యసభలోనూ రాజకీయ సమీకరణాలు మారాయి. కొత్తగా ఎన్నికైన, తిరిగి ఎన్నికైన ఎంపీలు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అధికార ఎన్డీయేకు సంఖ్యాబలం మరింత అనుకూలంగా మారింది. రాజ్యసభకు చెందిన ముగ్గురు తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీలు రాజీనామా చేయడంతో ఆయా స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. వీటి ఫలితాలతో ఎగువసభలో బిజెపి మరింత బలం పెంచుకునే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

ఈసారి వర్షాకాల సమావేశాల్లో పలు కీలక బిల్లులు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ బిల్లును పరిశీలిస్తున్న జెపిసి జూలై 17న సమావేశమై తన నివేదికను ఆమోదించే అవకాశం ఉంది. ఆ తర్వాత నివేదికను పార్లమెంట్ పరిశీలనకు సమర్పించనున్నారు. తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర లేదా రాష్ట్ర మంత్రులు అరెస్టై వరుసగా 30 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే వారిని పదవి నుంచి స్వయంచాలకంగా తొలగించాలనే ప్రతిపాదన ఈ బిల్లులో ఉన్నట్లు సమాచారం. ఈ నిబంధనపై ఇప్పటికే తీవ్ర రాజకీయ చర్చ జరుగుతోంది. అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను ఒకే విధంగా 50 శాతం పెంచే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ప్రతిపాదనపై దక్షిణాది రాష్ట్రాల రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ అంశం కీలకంగా మారింది. మరోవైపు ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీసేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత సైనికుల ప్రాణనష్టానికి సంబంధించిన అంశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సభను తప్పుదోవ పట్టించారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ వ్యవహారంలో ఆయనపై సభా హక్కుల ఉల్లంఘన చర్యలు చేపట్టాలనే డిమాండ్‌ను వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షం ప్రస్తావించే అవకాశం ఉంది.

## వారం - వర్జ్యం

05-07-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
పంచమి మ.1.27
శతభిష మ.3.09
వర్జ్యం : రా.9.47-రా.11.27
దు.సా.సా.4.55-సా.5.47
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** ప్రముఖులతో చర్చలు సాగిస్తారు. ఇంటిలో శుభకార్యాలు. నూతన ఉద్యోగావకాశాలు లాభిస్తాయి. ఋణాలు తీరుస్తారు.

**వృషభం:** కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు శ్రేయస్కరం. కారణం లేని చికాకు మీకు కొంత ఇబ్బంది కలిగిస్తుంది.

**మిథునం:** ఆర్థిక విషయములలో నిజముగా సహాయపడే వారెవరో మీరు గ్రహించ గలుగుతారు.ఇంటర్వ్యూలకు హాజరవుతారు.

**కర్కాటకం:** జీవిత భాగస్వామితో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించడం చెప్పదగినది. స్థలాలు కొనుగోలు చేస్తారు.

**సింహం:** దూరప్రాంతాలలోని ఆత్మీయుల క్షేమసమాచారం ఆనందం కలిగిస్తుంది. సంబంధ బాంధవ్యాలు పెరుగుతాయి.

**కన్య :** ఓర్పుతో, నేర్పుతో అందరితో కలిసి పనిచేసే ధోరణి వలన విజయాలాదిశగా పయనిస్తారు.బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**తుల :** నూతన ప్రయత్నాలలో పురోగతిని సాధిస్తారు. ప్రముఖులను కలుసుకొని కీలక సమాచారం తెలుసుకుంటారు.

**వృశ్చికం:** తనఖా వస్తువులను విడిపించుకుంటారు. మొండి బాకీలు వసూలవుతాయి. ఇంటర్వ్యూలకు హాజరవుతారు.

**ధనుస్సు:** మాటల చాతుర్యంతో ఎంతటి వారినైనా ఆకట్టుకుంటారు. సన్నిహితుల సహాయంతో ముందుకు సాగుతారు.

**మకరం:** కొత్త పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. నిర్వహిస్తున్న సంస్థలు అభివృద్ధి పథంలో నడుస్తాయి.

**కుంభం:** కోర్టుకేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు.స్పెక్యులేషన్ మధ్యస్థంగా వుంటుంది.

**మీనం:** రాజకీయ అధికార ప్రాప్తి పొందుతారు. నిందారోపణలు రానివ్వకుండా చాకచక్యంగా వ్యవహరిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

### డి.సిఎం పవన్‌ను దూషించిన కేసు
## యూట్యూబర్ జోసెఫ్ రావణ్ మళ్లీ అరెస్ట్

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను దూషించిన కేసులో యూట్యూబర్ జోసెఫ్ రావణ్‌పై రాష్ట్రంలో పలుచోట్ల కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన వరుసగా నాలుగోసారి అరెస్టయ్యారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంకోర్టు శుక్రవారం రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత అతనికి బెయిల్ మంజూరు చేసింది. కొద్దిసేపటికే శనివారం తెల్లవారు జామున అనకాపల్లి జిల్లా పాయకరావుపేట పోలీసులు మచిలీపట్నంలోనే అతన్ని మళ్లీ అదుపులోకి తీసుకున్నారు.జూన్ 30న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హిందుత్వవాది రాధా మనోహర్ దాస్‌లను లక్ష్యంగా చేసుకుని జోసెఫ్ రావణ్ తన యూట్యూబ్ ఛానల్‌లో అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తూ వీడియోలు అప్‌లోడ్ చేశారు. దీనిపై కూటమి శ్రేణులు, జనసేన నేతలు రాష్ట్రవ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. తొలుత పిఠాపురం పోలీసుల ఫిర్యాదుతో గత బుధవారం హైదరాబాద్‌లో అరెస్టయిన రావణ్‌కు అక్కడి కోర్టు బెయిల్ ఇచ్చింది. అయితే, ఆ వెంటనే కాకినాడ జిల్లా సర్పవరం పోలీసులు మరో కేసులో అతన్ని అరెస్ట్ చేశారు. ఆ కేసులోనూ బెయిల్ లభించింది. ఇదే క్రమంలో శుక్రవారం ఉదయం కృష్ణా జిల్లా మచిలీపట్నం పోలీసులు పాత కేసుల ఆధారంగా రావణ్‌ను అదుపులోకి తీసుకుని, ఇనగుదురు పోలీస్ స్టేషన్‌లో విచారించి మచిలీపట్నం మొబైల్ కోర్టు జడ్జి ఎదుట హాజరపర్చగా రావణ్ తరఫు న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ వాదనలు విన్న న్యాయస్థానం అతనికి బెయిల్ మంజూరు చేసింది.ఒంగోలుతో పాటు అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో జనసేన నేతలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఇప్పటికే అక్కడ కేసులు నమోదు కావడంతో మచిలీపట్నం కోర్టు బయట అడుగుపెట్టిన వెంటనే పాయ కరావుపేట పోలీసులు అతన్ని మళ్లీ అరెస్ట్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

**విజయవాడ,జూలై 4,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ పశ్చిమ బైపాస్‌పై రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. ప్రమాద సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారిని రామవరప్పాడుకు చెందిన పురోహితుడు దువ్వూరి హరిప్రసాద్, మార్కాపురం జిల్లాకు చెందిన వీఆర్వో గురవయ్యగా పోలీసులు గుర్తించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పురోహితుడు హరిప్రసాద్ ప్రయాణిస్తున్న కారులో బ్రేక్, ఎక్స్‌లేటర్ మధ్య కొబ్బరి బొండం ఇరుక్కుపోయింది. దీంతో కారు డ్రైవర్ నియంత్రణ కోల్పోయి ముందుగా అదే మార్గంలో వెళ్తున్న వీఆర్వో గురవయ్య బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో పాటు ముందున్న కంటైనర్‌ను కూడా ఢీకొట్టారు. ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో పురోహితుడు దువ్వూరి హరిప్రసాద్, వీఆర్వో గురవయ్య ఇద్దరూ ఘటనాస్థలంలోనే మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

## ముగ్గురు మహిళల బలవన్మరణం

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లాలోని గూడూరు మండలం అనంతపురం తయ్యపేట గ్రామంలో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఒకే ఇంట్లో ముగ్గురు మహిళలు హనుమకొండ రజని కుమారి, మధుబాల, గౌరదేవి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు మహిళల మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన వెనుక కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత సమస్యలు లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలపై గూడూరు పోలీసులు సమగ్ర విచారణ చేపట్టారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల నుంచి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## అల్లూరి సీతారామరాజుకు సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నివాళులు

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ నివాళులర్పించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ అల్లూరి త్యాగం, ధైర్యం, దేశభక్తి భారత జాతికి చిరస్మరణీయమని ముఖ్యమంత్రి కొనియాడారు. అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా ఆ మహావీరుడికి ఘన నివాళులు అర్పిస్తున్నాను అని చంద్రబాబు పోస్ట్ చేశారు.ఇక మన్యం వీరుడి పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యమని, తెలుగుజాతికి, దేశానికి స్ఫూర్తిప్రదాతగా నిలిచిన అల్లూరి సీతారామరాజు సేవలను ఈ సందర్భంగా స్మరించుకుందాం అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

**పింగళి వెంకయ్యకు సీఎం నివాళులు**

పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా సీఎం చంద్రబాబు,మంత్రి నారా లోకేశ్ నివాళులు అర్పించారు. మన జాతీయ పతాకాన్ని రూపొందించిన వెంకయ్య దేశభక్తి అపూర్వమన్నారు.

**మాజీ సీఎం రోశయ్యకు చంద్రబాబు నివాళులు**

మాజీ సీఎం రోశయ్య జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. విలువలతో కూడిన రాజకీయాలు, ఆర్థిక క్రమశిక్షణకు రోశయ్య ప్రతీక అని కొనియాడారు. ప్రజాజీవితంలో రోశయ్య చెరగని ముద్ర వేశారని అన్నారు. రోశయ్య నిబద్ధతతో కూడిన రాజకీయవేత్త అన్నారు.ఆయన ఆర్థిక మంత్రిగానూ పనిచేసి మంచి సేవలు అందించారన్నారు.

**అల్లూరికి డి.సిఎం పవన్ నివాళి**



మన్యం వేదికగా విప్లవ పోరాటాన్ని నిర్వహించిన స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘన నివాళులు అర్పించారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలనను ధైర్యంగా ఎదిరించి, గిరిజన ప్రజల హక్కులు, గౌరవం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు. **వంగవీటి రంగాకు నివాళి:** విజయవాడ తూర్పు నియోజకవర్గ దివంగత శాసనసభ్యుడు వంగవీటి మోహనరావు(రంగా) జయంతి సందర్భంగా ఆయనకు 'ఎక్స్' వేదికగా పవన్ నివాళి అర్పించారు.ఆశయ సాధన కోసం జీవితాన్ని త్యాగంచేసిన మహనీయుడు రంగా అన్నారు. నిరుపేదలు,బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి మరువలేదన్నారు,

# ప్రకాష్‌రాజ్, జోసెఫ్ రావణ్ సంఘ విద్రోహశక్తులు

### సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** చలనచిత్ర నటుడు ప్రకాష్‌రాజ్, యుట్యూబర్ జోసెఫ్ రావణ్ సంఘవిద్రోహ శక్తులుగా మారారని ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆరోపించారు.ప్రకాష్‌రాజ్‌కు జోసెఫ్ రావణ్‌తో ఏమైనా సంబంధం ఉందా? అనే అనుమానాలు వ్యక్తం చేశారు.శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రకాశ్‌రాజ్, బచ్చలకూరి జోసఫ్ వ్యాఖ్యలపై మంత్రి కందుల ఆగ్రహం వ్యక్తం చేశారు. జస్ట్ ఆస్కింగ్ అంటున్న ప్రకాశ్‌రాజ్, జోసఫ్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. అందుకు మా వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. జోసఫ్ ప్రశ్నించగానే జస్ట్ ఆస్కింగ్ అంటూ ప్రకాశ్‌రాజ్ వస్తారు. పవన్ కల్యాణ్ లక్ష్యంగా ఇద్దరూ కలిసి కుట్రలు చేస్తున్నారు. తెర ముందు వీరు ఉంటే, తెర వెనుక ఎవరున్నారో తేలాలి. తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లోనే ఈ కుట్ర సాగుతుంది. కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కుట్రలు చేస్తున్నారు. ఇలాంటి సంఘవిద్రోహ శక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్సీపీ పాలనలో జస్ట్ ఆస్కింగ్ అని ఎందుకు అడగలేకపోయారు? పవన్ కల్యాణ్‌ను ఒక కుల చట్రంలో బంధించేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. ప్రశ్నించడం అంటే బూతులు తిట్టడం, వ్యక్తిగత విమర్శలు చేయడమా అని కందుల దుర్గేష్ ప్రశ్నించారు.

## 9 మంది డిఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతి

**విజయవాడ,జూలై 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 9మంది డీఎస్పీలు అదనపు ఎస్పీలుగా పదోన్నతి పొందారు.ఈ మేరకు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేసారు. పదోన్నతి పొందిన వారిలో ఎం.రాజగోపాల్‌రెడ్డి, పి.శ్రీకాంత్, టి.శ్రీనివాసులు, జి.శివప్రభాకర్ రెడ్డి,డి.సోమన్న, ఎ.ఎస్.చక్రవర్తి, ఎం.అంబికా ప్రసాద్, ఎస్. వాసుదేవ్, ఎ.నరసింహమూర్తి ఉన్నారు.వీరంతా పోలీసు హెడ్‌క్వార్టర్స్ మంగళగిరిలో రిపోర్ట్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## విశాఖలో ఆరుగురు బిఎల్‌ఒల సస్పెన్షన్

### విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై కలెక్టర్ సీరియస్

**విశాఖపట్నం, జూలై 4 ప్రభాతవార్త:** విశాఖ జిల్లాలో ఆరుగురు సర్‌బూత్ లెవెల్ అధికారుల(బిఎల్‌ఓ)పై జిల్లా కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు.ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్రసవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఆరుగురు బూత్ లెవల్ అధికారుల్ని (బీఎల్‌వోలు) సస్పెండ్‌చేస్తూ విశాఖకలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. భీమిలి నియోజకవర్గ పరిధిలో భీమిలి అర్బన్‌కు చెందిన బీఎల్వో సువర్ణ (పోలింగ్ స్టేషన్177), వి. వెంకటసాయి శరణ్ (పీఎస్359), దక్షిణ నియోజకవర్గపరిధిలో ఎం.డి.షాహిద్ (పిఎస్66), బి. లక్ష్మీనిహారిక(పీఎస్220), తూర్పు నియోజకవర్గ పరిధిలో చిట్టిబోయిన గంగాజలం (పీఎస్272), చేపలరామాంజనేయులు(పోఎస్‌లు114, 123)పై ఈ చర్యలు తీసుకున్నారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో తమ విధుల్ని సక్రమంగా నిర్వర్తించకపోవడంతో పాటు, రిప్రెజెంటేషన్ ఆఫ్ దిపీపుల్స్ యాక్ట్1950లోని సెక్షన్32 నిబంధనలకు విరుద్ధంగా వారంతా వ్యవహరించినట్టు గుర్తించిన నేపథ్యంలో కలెక్టర్ ఈకఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. ఓటరుజాబితా సవరణ ప్రక్రియలో విధి నిర్వ హణలో బాధ్య తారాహిత్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కలెక్టర్ హెచ్చరించారు.

## ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అల్లూరి


### టిటిడి ఆధ్వర్యంలో జయంతి



**తిరుమల,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆంధ్రుల ఆత్మ గౌరవానికి ప్రతీక అని, ఆయన త్యాగం, ధైర్యం, దేశభక్తి నేటి యువతకు ఆదర్శమని మన్యం జిల్లా సీతంపేటకు చెందిన సాంఘిక శాస్త్రఉపాధ్యాయుడు ఆర్. మోహన్‌రావు నాయుడు పేర్కొన్నారు. టిటిడి సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో తిరుపతి అన్నమాచార్య కళా మందిరంలో శనివారం అల్లూరి సీతారామరాజు 129వ జయంతి జరుపుకున్నారు. మోహన్ రావు నాయుడు మాట్లాడుతూ బ్రిటిష్ పాలనలో ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులు తీవ్ర దోపిడీ, అణచివేత, అన్యాయాలకు గురయ్యారని తెలిపారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో గిరిజనులకు అండగా నిలిచిన అల్లూరి సీతారామరాజు వారిని ఏకం చేసి, దురలవాట్లకు దూరం చేసి, యుద్ధ విద్యలు, గెరిల్లా పోరాట పద్ధతుల్లో శిక్షణ ఇచ్చి బ్రిటిష్ పాలకులను ధైర్యంగా ఎదుర్కొన్న మహోన్నత నాయకుడని కొనియాడారు. టిటిడి డిప్యూటీ ఇఒ ఆనందరాజు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు తన అసమాన త్యాగం, వీరోచిత పోరాటంతో మన్యానికి చిరస్థాయి కీర్తిని తీసుకువచ్చార న్నారు. ఆయన సేవా స్ఫూర్తిని ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆడిట్ అధికారి వెంకటేశ్వర్లు,అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు టిటిడి సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో అల్లూరి సీతారా మరాజు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అన్నమయ్య విగ్రహానికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు.

## తిరుపతి శివార్లలో చిరుత కలకలం

### ఓ ఇంట్లోకి చొరబడేందుకు యత్నం



**తిరుపతి, జులై 4 ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం అడవులకు ఆనుకునే ఉన్న తిరుపతి నగర శివార్లలోని కరకంబాడి ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి ఓ చిరుతపులి ఏకంగా ఇంట్లోకి జొర బడింది. ఇంటి ఆవరణలో పూర్తిగా సంచరిం చింది. ఆ ఇంటి ఆవరణలో అమర్చిన సిసి కెమెరాల్లో ఈ దృశ్యాలు కనిపించడంతో ఇంటి కుటుంబ సభ్యులు భయంతో వణికిపోయారు. అందరూ కలసి గట్టిగా కేకలు వేయడంతో చిరుతపులి అక్కడ నుండి అడవిలోకి పరుగులు తీసింది. గత కొంతకాలంగా శేషాచలం అట వీప్రాంతం నుండి చిరుతపులులు, ఏనుగులు, ఎలుగు బంట్లు జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. ప్రధానంగా అడవికి ఆనుకునే ఉంటున్న కాలనీల్లోకి యధేచ్చగా జంతువులు సంచరించడం మామూలైంది. తిరుపతి నగర శివార్లలో చిరుత పులుల సంచారం ప్రజలను భయాం దోళనలకు గురిచేస్తోంది. రేణిగుంట మండలం వెంకటాపురం గ్రామంలో నివాసముంటున్న అధ్యాపకుడు బాలాజీ ఇంటికి అర్ధరాత్రి ఓ చిరుత పులి జొరబడింది. ఇంటి సిసి కెమెరాల్లో గమనించిన కుటుంబసభ్యులు గట్టిగా కేకలు వేయడంతో చిరుత దారిమళ్లి అడవిలోకి వెళ్ళిపోయింది. ఆహారంకోసం ఇలా దారితప్పి వచ్చినట్లు అటవీశాఖ వర్గాలు పేర్కొన్నాయి. చిరుతపులి సంచారానికి సంబంధించిన దృశ్యాలు ఇంటి ఆవరణలో ఉన్న సిసి కెమెరాలో రికార్డయ్యాయి. అర్ధరాత్రివేళ చిరుత పిల్లిలా నక్కినక్కి రావడం, ఇంట్లోకి దూరాలని చూడటం ఆ ఫుటేజీలో కనిపించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.అటవీశాఖ అధికారులు గ్రామానికి చేరుకుని పరిశీలించారు. ప్రజలు రాత్రివేళల్లో ఒంటరిగా తిరగవద్దని, అప్రమ త్తంగా ఉండాలనిహెచ్చరించారు. చిరుతను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

## దేవునిపై విశ్వాసంతో కొండకు.. అలిపిరి మెట్లెక్కివచ్చిన 116 యేళ్ల అవ్వ



**తిరుమల,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:** దేవునిపట్ల విశ్వాసం..ఆపై వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలనే పట్టుదల ఆ శతాధిక వృద్ధురాలి వయసు ముందు ఓడిపోయిందనే చెప్పవచ్చు. ఏకంగా అలిపిరి మెట్లదారిలో శతాధిక వృద్ధురాలు అలుపుసొలుపు లేకుండా అమాంతం 3,550 మెట్లు మార్గాన్ని ఎవరి సహాయం తీసుకోకుండా, చేతిలో కేవలం ఒక కర్రను ఆసరాగా పట్టుకుని, గోవిందా. గోవిందా అంటూ ఒక్కో మెట్టు ఎక్కుతూ శనివారం ఉదయం తిరుమల చేరు కున్నారు. ఇప్పుడు ఈ బామ్మ వీడియో యువతలో స్ఫూర్తిని నింపేలా మారింది. ఇంత వృద్ధాప్యంలోనూ లభించిన శారీరక, మానసికశక్తి వేంకటేశ్వరస్వామి అనుగ్రహమేనని తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మరికొందరు మాత్రం ఆమె సంకల్పం, జీవనశైలి, మానసిక దృఢత్వమే కారణంగా భక్తులు చెబుతున్నారు. ఆమె పట్టుదల, ఆత్మవిశ్వాసం, భక్తి చూసిన సహ యాత్రికులు ఆశ్చర్యపోయారు. ఈ ఘటనను చూసిన పలువురు భక్తులు, ఇంత వృద్ధాప్యంలోనూ ఆమెకు లభించిన శారీరక, మానసిక శక్తి వేంకటేశ్వరస్వామి అనుగ్రహమేనని తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఏది ఏమైనా, 116ఏళ్ల వయస్సులో అలిపిరి మెట్ల మార్గంలో తిరుమల చేరిన భీమవ్వ ప్రయాణం ఇప్పుడు వేలాది మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. ఈ వీడియోను చూసిన నెటిజెన్లు అభినందిస్తూ పోస్టింగ్స్ పెడుతున్నారు. ఈమె కర్ణాటకకు చెందిన మహిళగా తెలిసింది. 116 ఏళ్ల బామ్మ తన కుటుంబసభ్యులతో కలిసి తిరుమల మెట్లు ఎక్కుతుండటాన్ని చూసిన మరో భక్తురాలు వీడియో తీశారు.

## రావణ్‌పై ఎపిలో కక్షసాధింపు చర్యలు: ప్రకాశ్‌రాజ్

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** యూట్యూబర్ రావణ్‌పై ఏపీలో కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని " ఎక్స్" మాధ్యమంగా చలనచిత్రనట్టుడు,సామాజిక వేత్త ప్రకాశ్‌రాజ్ ఆరోపించారు. ఏలూరులో పవన్ కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలు వైరల్ అయిన తర్వాత పిఠాపురం పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. కాకినాడ కోర్టు బెయిల్ మంజూరు చేయగా, వెంటనే సర్పవరం పోలీసులు మరో పాత కేసులో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. రావణ్‌పై మొత్తం 30 కేసులు ఉన్నాయని, ఇది స్పష్టమైన ప్రతీకార చర్య అని ప్రకాశ్ రాజ్ ఆరోపించారు. జనసేన కార్యకర్తలు పోలీస్ వాహనాన్ని అడ్డుకున్న ఘటనను కూడా ఆయన ప్రస్తావిస్తూ ప్రశ్నిస్తే చంపేస్తారా? అని ప్రశ్నించారు. జోసెఫ్ విషయంలో అరెస్ట్.. బెయిల్.. మళ్లీ అరెస్ట్. మీరు తప్పు చేస్తున్నారని మీకు కోర్టులు స్పష్టంగా చెప్పడం లేదా? మీ కక్షపూరిత రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు" అంటూ ప్రకాశ్ రాజ్ విమర్శలు గుప్పించారు. ప్రశ్నించే వారిని అధికారాన్ని దుర్వినియోగం చేసి అణచివేయడం ఎంతవరకు సాగుతుంది? కోర్టు బెయిల్ ఇచ్చిన వెంటనే మరో కేసు తెరిచి వేధించడం సిగ్గుచేటు అని మండిపడ్డారు.

## తిరుమల సమాచారం



### వారాంతం రద్దీ: శ్రీవారి దర్శనానికి 24గంటలు

**తిరుమల,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం సెలవులతో తిరుమల శనివారం ఉదయానికి పూర్తిగా నిండిపోయింది. ఉదయం 5గంటలకే వైకుంఠమ్ 2క్యూకాంప్లెక్స్,నారాయణగిరి షెడ్లు నిండి భక్తుల లైన్లు మూడుకిలోమీటర్లు శిలాతోరణం వరకు చేరాయి. దీంతో స్వామివారి దర్శనానికి 24గంటల సమయం నిరీక్షణ తప్పలేదు. ఆదివారం కూడా భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పరిస్థితిని పూర్తిస్థాయిలో అదుపులో ఉంచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. శనివారం ఉదయానికి లక్షమందిపైగా భక్తులు తిరుమలకు చేరారు.శుక్రవారం రాత్రి వరకు 71,668మంది భక్తులకు మహాలఘులో స్వామివారి దర్శనం చేయించారు. శనివారం సాయంత్రం వరకు 43 వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నారు.

## 17న ఆణివార ఆస్థానం, 14న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సాలకట్ల ఆణివార ఆస్థానంపర్వదినం 17వతేదీ శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహిం చనున్నారు.ఆలయం లోపల ఈ వేడుక జరిపిస్తారు.ఈ సందర్భంగా 14వతేదీ మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడతారు. ఆలయ అర్చకులు, అధికారులు మహాయజ్ఞంలా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆలయం అంతటా సుగంధపరిమళ ద్రవ్యంతో శుద్ధిచేయనున్నారు. ఆలయంలోపల బంగారువాకిలి నుండి ఉపఆలయాలు, మహాద్వారం వరకు నీటితో శుభ్రం చేయనున్నారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం,గంధంపొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పరిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా సంప్రోక్షణ చేస్తారు, అష్టదళపాదపద్మారాధన సేవ రద్దయ్యింది. 17వతేదీ ఆలయంలో ఆణివార ఆస్థానం జరగనుంది. ఆ రోజు సాయంత్రం ఉభయదేవేరులతో కలసి మలయప్పస్వామి సువాసనల పుష్పపల్లకిపై ఊరేగుతారు. ఈ రెండు పర్వదినాల సందర్భంగా 13వతేదీ సోమవారం, 16వతేదీ గురువారం దర్శనాలకు ఫార్సు లేఖలు స్వీకరించరు. జూలై 17న కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలను రద్దు చేశారు.



## టిటిడి కపిలేశ్వరస్వామి ఉన్నతపాఠశాల విద్యార్థులకు నగదుతో సన్మానం

**తిరుమల,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ తాటితోపువెంకటపతి నగర్‌లో నిర్వహిస్తున్న కపిలేశ్వరస్వామి ఉన్నత పాఠశాల విద్యార్థులకు నగదు సన్మానం చేశారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు పాఠశాల పూర్వ విద్యార్థులు నగదు వెండి డాలర్లతో సన్మానించారు.ఈ పాఠశాలలో చదివిన 10వ తరగతిలో 562/600 మార్కులు సాధించిన ప్పి. జనని ప్రథమ స్థానంలో నిలిచింది.విద్యార్థినికి పూర్వ విద్యార్థులు 25వేల రూపాయలు నగదు బహుమతి, 10గ్రాముల వెండి డాలరు బహూకరించారు. పాఠశాల పట్ల వారికున్న భక్తిని ఔదార్యాన్ని చాటుకున్నారు. రెండవ ర్యాంక్ సాధించిన 545/600 మార్కులు సాధించిన చిరంజీవి విజయ దుర్గకు 10వేల నగదు,10 గ్రాముల వెండి డాలర్‌తో సత్కరించారు.ఈ పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు పండిట్ నాగేంద్ర నాయక్ ఇద్దరు విద్యార్థులకు 1,500రూపాయలు , వెయ్యి వెయ్యి రూపాయలు నగదుతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు నంబూరి రెడ్డి దినేష్, దొరబాబు,శివ కృష్ణ,దీనా రెడ్డి ,వసంత, అశోక్ పాల్గొన్నారు. మంచిగా చదువుకుంటే అన్ని సమస్యలకు సమాధానమని మన స్థితిగతులను మార్చే శక్తివంతమైన సాధనమని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులందరూ బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని పిలుపునిచ్చారు. రాబోయే విద్యా సంవత్సరంలో 540 మార్కులు పైబడిన విద్యార్థులకు వెండి డాలర్లతో సత్కరిస్తానని హామీ ఇచ్చారు. బాగా చదివే విద్యార్థులకు ఎల్లవేళలా తాము అండగా నిలబడతామని భరోసా ఇస్తూ ప్రస్తుతం పదవ తరగతిలో ఉన్న విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.కృష్ణమూర్తి పూర్వ విద్యార్థుల సహృదయతను, ఔదార్యాన్ని అభినందించి వారిని దుశ్శాలువలతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.టిటిడి యాజమాన్యం కల్పించిన సౌకర్యాలను తల్లిదండ్రులు వారి బిడ్డల కోసం సద్వినియోగం చేసుకొని తమ బిడ్డల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.

## భార్యపై విచక్షణారహితంగా భర్త దాడి

**తిరుపతి,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:** ప్రవర్తన సరిగా లేదని, మాట వినడంలేదని భార్యపై భర్త విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటన తిరుపతి నగరం తూర్పు పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల చేను లో చోటు చేసుకుంది. చింతల చేనుకు చెందిన మహిళకు చిత్తూరుకు చెందిన రాజేష్‌తో కొన్నేళ్ళ క్రిందట వివాహమైంది.వీరికి 14యేళ్ల బాలిక, 12 యేళ్ల బాలుడు ఉన్నారు. వివాహమైన రెండు సంవత్సరాలు అత్తమామల సంపాదనలతో కుటుంబం సాగింది.పది సంవత్సరాల నుండి బలవంతంగా పడుపు వృత్తిలోకి దింపి ధనార్జన చేయిస్తున్నారు. ఆమె కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై ఆ వృత్తిని వదలిపెట్టింది. దీంతో భర్త పెట్టే వేధింపులు తట్టుకోలేక ఆమె పుట్టింటికి చేరింది. భర్త చేసిన తప్పులు బయటపడతాయని మహిళ తమ్ముడుప్రసాద్ తన కూతురిపై అసభ్యంగా ప్రవర్తించాడంటూ మహిళా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులకు ఆశ్చర్యం కలిగించే విషయాలు తెలిశాయి. మామయ్యపై మా నాన్న బలవంతంగా తప్పుగా చెప్పించాడని బాలిక వెల్లడించింది. తనకు సం బంధించిన విషయాలు బయటపెడుతుందని భార్యపై భర్త బంధువులు దాడికి దిగారు. ఆయన స్వప్రయోజనాలకులోను తీసుకొని 50లక్షలతో నిర్మించుకున్న రెండు అంతస్తుల భవనానికి అప్పు తీరే వరకు కాపురానికి రమ్మంటున్నాడని ఆ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. 112కు కాల్ చేసిన బాధితురాలు తనకు ప్రాణహాని ఉందని పోలీసులు రక్షణ కల్పించాలంటూ వాపోయింది.

## వ్యవసాయ భూముల బదలాయింపు సులభతరం

### వారసత్వ భూములకు ఆటో మ్యుటేషన్ విధానం

### రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే రెవెన్యూ రికార్డుల్లో వారసుల పేర్లు

### రూ.10లక్షల లోపు విలువైన భూమికి స్టాంప్ డ్యూటీ కేవలం రూ.100

### వీలునామా లేకపోతే రిజిస్ట్రేషన్ సమయంలో ఎఫ్ఎంసి తప్పనిసరి

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూముల బదలాయింపు ప్రక్రియను ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. ఇప్పటికే నామమాత్రపు స్టాంప్ డ్యూటీతో రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతించింది. ఈ క్రమంలోనే మరో నిర్ణయం అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. వారసత్వ ఆస్తుల పంపకాల దస్తావేజు రిజిస్ట్రేషన్ పూర్తికాగానే, ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ (రెవెన్యూ రికార్డుల్లో పేరు మార్పిడి) జరిగేలా కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ నిర్ణయంతో భూ యజమానులు మ్యుటేషన్ కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలు తప్పనున్నాయి.గతంలో కుటుంబ పెద్ద మరణానంతరం వారసులు తమ పేర్ల మీదకు భూమిని మార్చుకోవాలంటే ఎన్నో ఇబ్బందులు పడేవారు. ముందుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ (ఎఫ్ఎంసీ) కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత రెవెన్యూ అధికారులను ఆశ్రయించి మ్యుటేషన్ చేయించుకోవాల్సి వచ్చేది. ఈ ప్రక్రియ ఆలస్యం కావడంతో పాటు, రైతులకు శ్రమ, ఖర్చుతో కూడుకున్నదిగా ఉండేది.తాజా విధానం ప్రకారం, కుటుంబ సభ్యులు తమ మధ్య ఆస్తులను పంచుకుంటూ రాసుకున్న పంపకాల దస్తావేజును సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించిన వెంటనే, ఆ సమాచారం ఆన్‌లైన్‌లో రెవెన్యూ శాఖకు చేరుతుంది. దీని ఆధారంగా రెవెన్యూ రికార్డుల్లో వారసుల పేర్లను నమోదు చేసే ఆటో మ్యుటేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. దీంతో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఏకకాలంలో జరిగిపోతాయి. వీలునామా లేకపోతే ఎఫ్ఎంసీ తప్పనిసరి అవుతుంది.అయినప్పటికి ఈ ప్రక్రియలో ప్రభుత్వం ఒక ముఖ్యమైన నిబంధనను చేర్చింది. కుటుంబ పెద్ద (తాత, తండ్రి లేదా తల్లి) ఎలాంటి వీలునామా రాయకుండా మరణిస్తే, వారసులు ఆస్తి పంపకాల దస్తావేజును రిజిస్ట్రేషన్ చేసే సమయంలో తప్పని సరిగా ఎఫ్ఎంసీ సమర్పించాల్సి ఉంటుంది. వీలునామా ఉంటే ఈ నిబంధన వర్తించదు.గతంలో ఏపీ ప్రభుత్వం వారసత్వ భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. రూ. 10లక్షల లోపు విలువైన వ్యవసాయ భూమికి కేవలం రూ. 100స్టాంప్ డ్యూటీగా, రూ.10లక్షలు దాటితే రూ. 1,000గా నిర్ణయించింది. ఇప్పుడు రిజిస్ట్రేషన్‌ను మ్యుటేషన్‌తో అనుసంధానించడం వల్ల రైతులకు పూర్తిస్థాయిలో హక్కులు వేగంగా లభిస్తాయి. పట్టాదారు పాస్‌పుస్తకాలు సకాలంలో చేతికి అందడంతోపాటు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు పొందడంకూడా సులభతరమవుతుంది. ఈ సమీకృత విధానం పరిపాలనలో పారద ర్శకతను పెంచడంతో పాటు, రైతులకు భరోసా కల్పిస్తుందని అధికారులు వివరిస్తున్నారు.

## అమరావతి రైతులను మోసగించిన సిఎం: మాజీ మంత్రి పేర్ని నాని

**విజయవాడ.జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రైతులను సీఎం చంద్రబాబు మోసం చేసారని మాజీ మంత్రి పేర్ని నాని ఆరోపించారు. అమరావతిలో కట్టడాలకే వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని, రైతులకు ఎప్పుడు న్యాయం చేస్తారని ప్రశ్నించారు. అమరావతిని అప్పుల కుప్పగా మార్చుతున్నారని, ఎప్పటి లోగా నిర్మాణాలు పూర్తి చేస్తారో చెప్పటం లేదని వ్యాఖ్యానించారు. అసలు అమరావతికి ఎంత ఖర్చు చేస్తున్నారు.. ఎంత అవసరమో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఇప్పటికే రూ 50 వేల కోట్లు రాజధాని పేరుతో అప్పులు చేసారని చెప్పు కొచ్చారు. జగన్ పైన విమర్శలు చేసేందుకు.. తిట్టేందుకు ముందుకు వచ్చే మంత్రులు తమ శాఖల పని తీరు గురించి మాత్రం మాట్లాడరని మండిపడ్డారు. మావిగన్ అంటే మంత్రులు భయ పడుతున్నారని వ్యాఖ్యానించారు.సింగపూర్ తరహా రాజధాని నిర్మాణంచేస్తామని, చివరకు మున్సిపాల్టీ చేస్తున్నారని పేర్ని నాని చెప్పుకొచ్చారు. రాజధానిలో పేదలకు ఇచ్చిన 50 వేల పట్టాలు రద్దు చేసారని గుర్తు చేసారు. రాజధాని పేరుతో దోపిడీ ప్రజలకుకళ్లకు కట్టినట్లుగా కనప డుతోందని చెప్పారు. అమరావతి రైతులను కలి సేందుకు వెళ్తేదాడులుచేస్తారని, ఇదేం రాజకీ యమని ప్రశ్నించారు. రైతుల కష్టాలు చూసేం దుకు మళ్లీ అమరావతి వెళ్తాం, రైతులను కలుస్తామని పేర్ని నాని ప్రకటించారు.

## అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవం: ముళ్లపూడి రేణుక

**విజయవాడ జూలై 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాల్లో వేగంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసహనం, భయంతో కొత్త వివాదాలకు తెరలేపుతున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక విమర్శించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజల దృష్టిని అభివృద్ధి నుంచి మళ్లించేందుకే 'మామిగం' వంటి కొత్త రాజకీయ నాటకాలకు శ్రీకారం చుడుతు న్నారని ఆరోపించారు.

గతంలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టిన జగన్‌కు ప్రజలు ఎన్నికల్లోనే గట్టి తీర్పు ఇచ్చారని ఆమె గుర్తు చేశారు. అయినప్పటికీ అమరావతిపై మళ్లీ రాజకీయాలు చేయడం ఆయన రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. అమరావతి కేవలం ఒక ప్రాంతం కాదని, అది ఐదు కోట్ల మంది ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని రేణుక స్పష్టం చేశారు. పార్లమెంట్ ఆమోదించిన చట్టబద్ధ రాజధానిపై ఇష్టానుసార వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ వ్యవస్థల పట్ల గౌరవం లేకపోవడానికే నిదర్శనమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధాని అమరావతి అయితే, జగన్ శాశ్వత నివాసం మాత్రం బెంగళూరు ప్యాలెస్ అని ఆమె విమర్శించారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు కాలేజీలకు వచ్చి ఖాళీగా కూర్చోవల్సిన పరిస్థితి ఏర్పడింది. కాలేజీలు ప్రారంభమై నెల రోజులు దాటినా ఇప్పటి వరకు తెలుగు మీడియం విద్యార్థులకు పుస్తకాలు అందజేయలేదు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వడంతో వారికి క్లాసులు కొనసాగుతుండగా.. తెలుగు మీడియం విద్యార్థులు మాత్రం ఖాళీగా కూర్చో వల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలోని 436 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండగా వాటిల్లో కొన్నింటికి మాత్రమే తెలుగు మీడియం బుక్స్ అందాయి. రాష్ట్రంలోని 85 శాతానికి పైగా ప్రభుత్వ జూనియర్ కాలేజీవిద్యార్థులకు తెలుగు మీడియం బుక్స్ ఇప్పటికీ చేరలేదు. జూన్1నుంచి కొత్త విద్యాసంవత్సరం2026-27 ప్రారంభమైంది. అప్పటినుంచివిద్యార్థులు కాలేజీలకు వస్తున్నారు. మొదటి సంవత్సరంలో ఇప్పటి వరకు సుమారు 62వేల మంది విద్యార్థులు చేరగా..వారిలో 35వేల మంది వరకు తెలుగు మీడియం విద్యార్థులున్నారు. మిగిలిన వారు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులున్నారు. ఈ ఏడాదిలో సిలబస్ కూడా మారింది. ఈ నేపథ్యంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు కొత్త సిలబస్‌ను ప్రింట్ చేసి ఇస్తేనే క్లాసులు బోధించడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్ల కొరత తీవ్రంగా ఉంది. మంజూరైన పోస్టుల్లో సుమారు 70శాతం పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. వాటిల్లో గెస్ట్ లెక్చరర్లతో పాఠాలు బోధిస్తున్నారు. యూనివర్సిటీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 11 యూనివర్సిటీల్లో 2500కిపైగా అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోనూ సౌకర్యాలతో పాటు, అధ్యాపకుల కొరత ఉంది. కొద్ది రోజులక్రితం నేషనల్ మెడికల్ కౌన్సిల్ ..ప్రభుత్వమెడికల్ కాలేజీల్లో ఉన్న లోపాలను సరిచేసుకోవాలని సూచించింది. ఈనేపథ్యంలో ఈ ఏడాది కూడా విద్యార్థులకు సమస్యలతోనేస్వాగతంపలికింది.

# సమస్యలతో విద్యా సంవత్సరానికి స్వాగతం

**నాగమణీంద్ర పల్లాపు**

తెలంగాణ రాష్ట్రంలో 2026-27 విద్యా సంవత్సరం జూన్ 1 నుంచి ప్రారంభమైంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలు జూన్ 1 నుంచి ప్రారంభం కాగా, జూన్ 8 నుంచి డిగ్రీ, పీజీ కాలేజీలు ప్రారంభమయ్యాయి. జూన్ 15 నుంచి పాఠశాలలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతోపాటు అధ్యాపకుల కొరత కూడా కొనసాగుతోంది. ఈ ఏడాది ప్రత్యేకంగా పాఠశాల స్థాయి నుంచి జూనియర్ కాలేజీల వరకు విద్యార్థులందరికీ ఉదయం బ్రేక్‌పాస్ట్‌ను అందించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15 నుంచి పాఠశాల విద్యార్థులతోపాటు, జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా ఉదయం పూట అల్పాహారం అందిస్తోంది. అయితే ఇది రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి కాకుండా విడతల వారీగా మొదలుపెట్టనుంది. ఇదిలా ఉంటే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాల కొరతతోపాటు టీచర్ల కొరత కూడా ఉంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో లెక్చరర్ల కొరతతోపాటు ఇప్పటి వరకు తెలుగు మీడియం విద్యార్థులకు పుస్తకాలు సైతం అందజేయలేదు. ఇక రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పరిస్థితి కూడా ఇందుకు తీసిపోలేదు. ఉన్నవి 129 డిగ్రీ కాలేజీలే అయినా వాటిలో 70 శాతానికిపైగా అధ్యాపకులు లేరు. ఉన్నత విద్యా సంస్థలైన యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూనివర్సిటీల్లో 80 శాతానికి పైగా అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాకతీయ యూనివర్సిటీతోపాటు మరికొన్ని యూనివర్సిటీల్లో చాలా డిపార్ట్‌మెంట్లకు ప్రొఫెసర్లు లేరు. చివరికి హెచ్‌వోడీలుగా అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వ్యవహారిస్తున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది నుంచి మరో 2250కి పైగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ క్లాసులను ప్రారంభించడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4679 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ క్లాసులను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు 24,562 ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రీ ప్రైమరీ నుంచి హైస్కూల్, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ కోర్సుల వరకు సుమారు కోటి మంది విద్యార్థులు తమ విద్యను కొనసాగిస్తున్నారు. అత్యధికంగా పాఠశాల స్థాయిలో 62లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. సర్కారు స్కూళ్లలో టీచర్ల కొరత అయోమయానికి గురిచేస్తోంది. కేంద్ర విద్యాశాఖ



విడుదల చేసిన సమగ్ర శిక్ష పీఏబీ నివేదిక రాష్ట్ర విద్యా వ్యవస్థలోని ఎన్నో అంశాలను బహిర్గతం చేసింది. రాష్ట్రంలో మొత్తం 30,057 ప్రభుత్వ స్కూల్స్ (69.7 శాతం)ఉండగా, వాటిలో చదువుతున్నది 26.29 లక్షల (35.3 శాతం) స్టూడెంట్స్ మాత్రమే. కానీ రాష్ట్రంలో ఉన్న 12,474 (28.9 శాతం) ప్రైవేటు స్కూళ్లలో 47.52 లక్షల (63.7 శాతం) మంది చదువుతున్నారు. రాష్ట్రంలోని 4,739 ప్రైమరీస్కూళ్లు ఒక్క టీచర్‌తోనే కొనసాగుతున్నాయి. అప్పర్ ప్రైమరీ లెవల్లోనూ సింగిల్ టీచర్ బడుల సంఖ్య 80 నుంచి 93కి పెరిగింది. అప్పర్ ప్రైమరీలో పీపుల్ టీచర్‌రేషియో(పీటీఆర్) 14.8 నుంచి 18.6 శాతానికి పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 11,801 ప్రైమరీ స్కూళ్లలో (60శాతం) 30 కంటే తక్కువ మంది విద్యార్థులే ఉన్నారు. ఒక్క విద్యార్థి కూడా లేని జీరో ఎన్ రోల్‌మెంట్ బడుల సంఖ్య కూడా 1,809 నుంచి 1,997కు పెరిగింది. అప్పర్ ప్రైమరీలోనూ జీరో ఎన్‌రోల్‌మెంట్ బడుల సంఖ్య 39 నుంచి 49కి చేరింది. రాష్ట్ర వ్యా



ప్తంగా 6,791 ప్రైమరీ స్కూళ్లలో 15 మంది కంటే తక్కువ మంది స్టూడెంట్లు ఉన్నారు. రాష్ట్రంలో సెకండరీ స్థాయిలో డ్రాపౌట్ రేటు గతేడాది 8 శాతం ఉండగా, ఇప్పుడు 10.5 శాతానికి పెరిగింది. ఇది జాతీయ సగటు 8.2 శాతం కంటే ఎక్కువ. బడుల్లో త్రాగునీరు, కరెంటు లాంటి సదుపాయాలు 95 శాతానికి పైగా బడుల్లో కల్పించినప్పటికీ నాణ్యమైన విద్య అందించడంలో మాత్రం రాష్ట్రం వెనుకబడే ఉందని నివేదిక ఎత్తిచూపింది. రాష్ట్రంలో ఉన్న 14 డైట్ కాలేజీల్లో మంజూరైన 286 పోస్టుల్లో ఏకంగా 151 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలు ఈ ఏడాది కూడా ఫీజుల భారాన్ని మోయక తప్పడం లేదు. గత మూడు, నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజు నియంత్రణ చట్టం వస్తుందని ఆశతో ఎదురు చూడటం.. తీరా విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి రాకపోవడంతో తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణ చట్టం ఈ ఏడాది 2026-27 కూడా రాలేదు. ఫీజు నియంత్రణ చట్టం ఇప్పటి వరకు రాకపోవడంతో ఈ ఏడాది కూడా రాష్ట్రంలోని సుమారు 12 వేల ప్రైవేటు స్కూల్స్‌లో చదువుతున్న సుమారు 32 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు లక్షల్లో ఫీజులను చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రైవేటు స్కూల్స్‌కి సంబంధించి ఫీజుల వసూలులో హైదరాబాద్ నగరం దేశంలో రెండో స్థానంలో ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ తరువాత ప్రైవేటు స్కూల్స్‌లో అడ్మిషన్లకు లక్షల్లో డొనేషన్లను వసూలు చేస్తుండటమే కాకుండా.. ఏడాది ఫీజు సైతం లక్షల్లో ఉంటుంది. ఇద్దరు పిల్లలను ప్రైవేట్ స్కూల్‌లో చదివించాలంటే ఉద్యోగస్తులు తాము సంపాదిస్తున్న దాంట్లో సగానికిపైగా వారి పిల్లల ఫీజులకే ఖర్చు చేయాల్సి వస్తోంది. రాష్ట్రంలోని ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణ కోసం 2017లో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రొఫెసర్ తిరుపతి రావు ఛైర్మన్‌గా కమిటీని ఏర్పాటుచేసింది. అప్పటి నుంచి ఫీజు నియంత్రణ చట్టం కోసం తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. జూన్ 1 నుంచే ప్రారంభమైన జూనియర్ కాలేజీల్లోనూ సమస్యలు నెలకొన్నాయి. ఇంటర్‌బోర్డు అనుమతి లేకుండానే రాష్ట్రంలోని 1000కి పైగా ప్రైవేటు జూనియర్ కాలేజీలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ఇంటర్ బోర్డు అనుబంధ గుర్తింపు కోసం సుమారు 1424 కాలేజీలు దరఖాస్తు చేసుకోగా వాటిలో శనివారం వరకు కేవలం 358 కాలేజీలకు మాత్రమే ఇంటర్ బోర్డు అనుమతి ఇచ్చింది. ప్రైవేటు జూనియర్ కాలేజీలకు సంబంధించి 2025-26విద్యా సంవత్సరంలో 1405 కాలేజీలకు అనుమతి ఇవ్వగా ఇపుడు 358 కాలేజీలకు మాత్రమే గుర్తింపును ఇచ్చింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో తెలుగు మీడియం బుక్స్ లేవు. ●

# రెండో సమరం!

రాష్ట్రం

తమిళనాడు

**ఎ.వి.వి ప్రసాద్**

మొదటి 50 రోజులు'విజయ్' వంతమయ్యాయి. అదే సమయంలో రెండో యుద్ధంకూడా మొదలయింది. మే10 న సిఎంగా ప్రమాణం చేసే వరకు విజయ్ సాగించిన సమరం మొదటిదైతే, ప్రభుత్వాన్ని కాపాడుకోవడం కోసం చేస్తున్న సమరం రెండోది. అది ఇప్పుడు కీలక దశకు చేరుకొంది. మొదటి యుద్ధానికి విజయ్ 'ఇమేజ్' సహకరిస్తే,రెండో యుద్ధం ఆయనసామర్థ్యానికి పరీక్షగా నిలుస్తోంది. 'ద్రవిడ' రంగు, రుచి, వాసన లేని పార్టీగా విజయ్ 'తమిళ వెట్రి కజగం (టివికె) పేరు తెచ్చుకొన్నా, దాదాపుఆరు దశాబ్దాల ద్రవిడ పార్టీల పాలనకు టివికె స్వస్తి పలికినా ఆ పార్టీలోకి వచ్చి చేరుతున్నవారంతా ద్రవిడ పార్టీల మూలాలున్నవారే అన్నది గమనించాల్సిన విషయం. ప్రభుత్వంలో ఉన్నచిన్న, పెద్ద అధికారులందరు కూడా రెండు ప్రధాన ద్రవిడ పార్టీలలో ఏదో ఒకదానికి మద్దతుదారులే. వారికి రుచించని విజయ్ విధానాలుచాలానే కనిపిస్తున్నాయి. మొదటి సారి ముఖ్యమంత్రి కావడం, తాను ప్రారంభించిన పార్టీని మొదటి సారి అధికారంలోకి తేవడంతో ఆ ప్రత్యేకత కనిపించేలా గత నెలన్నర రోజుల్లో విజయ్‌చాలా పథకాలే ప్రకటించారు. అదే సమయంలోనిత్యం తన ప్రభుత్వాన్ని కాపాడుకోవలసిరావడం కూడా అనివార్యమైంది.ఒక వంక రాష్ట్రంలో పాతుకుపోయిన డిఎంకె, అన్నాడిఎంకెలు విజయ్‌ని సిఎం పదవి నుంచి తప్పించడానికి యధాశక్తి ప్రయత్నిస్తున్నాయి. ఇటీవలి ఎన్నికల్లో డిఎంకె ఓడిపోవడంతో పాటు అధిపతి అయిన స్టాలిన్ కూడా ఓడిపోవడం ఆ పార్టీ నేతలకు ఎంత మాత్రం మింగుడు పడటం లేదు. దానితో విజయ్ వైపు నుంచి ఏ చిన్న అవకాశం దొరికినా దానిని ఉపయోగించుకోవాలని డిఎంకె చూస్తోంది. స్టాలిన్ తదనుగుణమైన వ్యాఖ్యలు పలుమార్లు చేశారు కూడా.విజయ్ ప్రభుత్వానికి నూకలు చెల్లే రోజులు దగ్గర పడుతున్నాయనీ, రాజకీయఅనుభవం లేని విజయ్ సంకీర్ణ ప్రభుత్వాన్ని నడపలేడనీ స్టాలిన్ సందర్భం దొరికినప్పుడల్లా బాహాటంగానే విమర్శిస్తున్నారు. దానికి నిదర్శనమా అన్నట్లు విజయ్ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర ఒకటి గత వారం వెలుగులోకి వచ్చి పెనుసంచలనం సృష్టించింది. టివికె ప్రభుత్వం పడిపోయినట్లే కొన్ని తమిళ పత్రికలు ప్రచారం చేశాయి. గతనాలుగు రోజులుగా తమిళ మీడియా విజయ్‌భవిష్యత్తుపై భిన్న కథనాలను కుప్పతెప్పలుగా వండి వడ్డిస్తున్నాయి. టివికె పార్టీకి చెందిన పదిమంది ఎమ్మెల్యేలకు రూ.35కోట్ల చొప్పున ప్రత్యర్థి వర్గంఎర వేసిందనీ, 'డీల్' దాదాపు ఖరారైన సమయంలో అది బయటపడిందనీ అంటున్నారు. దానితో తమిళరాజకీయం హఠాత్తుగా కొత్త మలుపు తిరిగింది. ఆ పదిమందిలో



ముఖ్యమంత్రి విజయ్

ఏడుగురు గోడదూకడానికి సిద్ధమయ్యారనీ, ప్లాన్ ప్రకారం జరిగి ఉంటే విజయ్ ప్రభుత్వం కూలిపోయి ఉండేదనీ ప్రచారమవుతోంది. ఆఎత్తుగడను ఇంటెలిజెన్స్ వర్గాలు సకాలంలో గుర్తించడం వల్ల బాగోతం బయటపడింది. వెంటనే పోలీసులు అప్రమత్తమై ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేయడంతో పరిణామాలు మరింత ఆసక్తికరంగా మారాయి. అరెస్టయిన ఆయిదుగురు డిఎంకె మాజీమంత్రి సెంథిల్ బాలాజీ అనుచరులని తేలడంతో కుట్ర ఎక్కడినుండి మొదలయిందో అందరికీ అర్థమైంది. ఓ యూట్యూబర్‌ను కూడా అరెస్టు చేసి పోలీసులు 'ఇంటరాగేట్' చేయడంతో ఇంకా చాలా విషయాలు వెలుగులోకి వచ్చాయి. టివికె ఎమ్మెల్యే ఇళయరాజా, మరికొందరు ఎమ్మెల్యేలతో డిఎంకె అధిష్ఠానం నిరంతరం 'టచ్'లో ఉందనీ, అందుకే స్పీకర్‌కు వ్యతిరేకంగా ఓటింగ్‌లో పాల్గొనవలసిందిగా వారిని కోరారనీ తెలుస్తోంది. స్పీకర్ వ్యతిరేక తీర్మానాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వాన్ని కూల్చాలనే విపక్ష సంకల్పం ఆఖరి దశలోబెడిసికొట్టింది. విజయ్ కూడా 'కొనుగోళ్ల' దారిలోనేవెళ్తున్నారనీ, డిఎంకె, మరికొన్ని పార్టీలలోని ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకొనే పనిలో నిమగ్నమయ్యారనీ అంటున్నారు. కొందరు విపక్ష ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి తిరిగి టివికె నుంచి పోటీ చేయించే వ్యూహం రూపొందించారనీ, అందుకు భారీగా ఖర్చుచేయడానికి కూడా సిద్ధమయ్యారనీ చెబుతున్నారు. ఆ విధంగా సొంతంగా పూర్తి మెజారిటీ సాధించే ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది.అయితే ఉన్నత స్థాయి అధికారులలో అధిక శాతం డిఎంకె మద్దతుదారులు కావడంతో వారిని తన దారిలోకి తెచ్చుకోవడం విజయ్‌కి పెద్ద తలనొప్పిగా ఉన్నదని పార్టీవర్గాలు అంటున్నాయి. ముఖ్యమంత్రి, మంత్రులు ఎన్ని ప్రకటనలు చేసినా క్షేత్రస్థాయిలో వాటినిఅమలు చేసేది అధికార వర్గమే గనుక వారిని తనవైపుతిప్పుకొనడానికి విజయ్ చాలా కష్టపడవలసి వస్తోందనే అంటున్నారు. ఇటువంటి సవాళ్లు పెరుగుతుండగా, గత శుక్రవారం విజయ్ ప్రభుత్వానికి గవర్నర్ తో కూడా ఢీకొనే పరిస్థితి ఎదురుకావడం మరో ఆసక్తికర పరిణామం. గవర్నర్ అర్లేకర్ మదురైలో సీనియర్ అధికారులతో సమీక్ష జరపడం ఇప్పుడు తీవ్ర వివాదాస్పదంగా మారింది. దానిపై మంత్రి నిర్మల్ కుమార్ ఘాటుగా స్పందించడం, మరికొందరు మంత్రులువంతపాడడం ఇప్పుడు ప్రభుత్వాన్ని ఓ కుదుపు కుదుపుతోంది. ప్రభుత్వ విభాగాల పనితీరుపై గవర్నర్ సమీక్ష జరపడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. మంత్రి వన్ని అరసు చేసిన విమర్శలు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. సిపిఐ వంటి పార్టీలు కూడా రంగంలోకి దిగడంతో కొత్త వివాదం మరింతగా రాజుకొంటోంది. విజయ్‌కి ఇది నిజంగానే కొత్త తలనొప్పి అనే చెప్పాలి. విజయ్ ప్రభుత్వం ప్రమాణ స్వీకార సమయంలో ముప్పుతిప్పలు పెట్టిన గవర్నర్ ఇప్పుడు కొత్త వివాదానికి కారణమవడం చూస్తే లోక్‌భవన్ నుంచి కూడా విజయ్‌కి ముందుముందు సవాళ్లు ఎదురుకావొచ్చని అర్థమవుతుంది. ఈ రెండో సమరంలో విజయ్ సక్సెస్ కావడం ఆయన వ్యూహరచనపై ఆధారపడి ఉంటుంది. ముందు ముందు సంభవించే పరిణామాలు ఇంకెంత ఆసక్తికరంగా ఉంటాయో దీనిని బట్టే అర్థమవుతోంది. ●

# మాతృభూమికి 'అవామీ' అధినేత!

దేశం

బంగ్లాదేశ్

**గన్ని మోహన్**

రెండేళ్లుగా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్‌మాజీ ప్రధాని షేక్ హసీనా ఎంతో సాహసోపేతమైన నిర్ణయాన్నే తీసుకున్నారు. ఈ ఏడాదే తాను స్వదేశానికి వెళతానని, బంగ్లా ప్రజల శ్రేయస్సుతోపాటు తన సొంతపార్టీ అవామీ లీగ్ కేడర్ సంరక్షణ కూడా తన బాధ్యత అనిచెపుతున్నారు. చావుకు తాను భయపడేదిలేదని, స్వదేశానికి వెళ్లాలన్నదే తమ అభిమతమని ఈ వారంలో ప్రకటించారు. బంగ్లాదేశ్‌లో కాందిశీకుల రిజర్వేషన్ల నుంచి మొదలైన ఉద్యమంతో ముస్లిం ప్రజానీకం ముస్లిమేతరులు, మైనార్టీలపై దాడులకు పూనుకోవడం, ఆస్తులు విధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఎంత కట్టడి చేసినప్పటికీ హసీనా హయాంలో ఈ ఉద్యమం పాక్‌ప్రేరేపిత ఉద్యమంగానే ముద్రపడింది. ప్రత్యేకించి భారత్ నుంచి బంగ్లాదేశ్‌ను వేరుచేసే లక్ష్యంతోనేహసీనా ప్రభుత్వాన్ని కూలదోశారన్నది అక్కడి మైనార్టీల వాదన. అంతేకాకుండా అమెరికా పరోక్షంగా తనను పదవీచ్యుతి చేసేందుకు కుట్రలుచేసిందని పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ వల్లెవేసినమాటలనే హసీనా కూడా చెప్పుకొచ్చారు. ఏదైతేనేమిరెండేళ్ల క్రితం నిర్బంధ రాజీనామాతో ఆమె అత్యవసరంగా దేశాన్ని వీడి భారత్‌లో ఆశ్రయంపొందుతున్న సంగతి తెలిసిందే. తదనంతరం వచ్చిన నోబెల్ పురస్కార గ్రహీత మహ్మద్ యూనస్ నేతృత్వంలోని కేర్‌టేకర్ ప్రభుత్వం ఆమెను, ఆమె పార్టీని ఎంతగా ఇబ్బందులు పాలుచేయాలో అంతగాను చేసింది. ఈ రెండేళ్ల కాలంలో హసీనా పార్టీ కేడర్ నాయకులు నిర్బంధాలకు గురయ్యారు. వందలాది మందిని జైలుపాలు చేసారు. పార్టీ కేడర్ ఛిన్నాభిన్నం అయింది. ఈలోపు అనుకోకుండా వచ్చిన ఎన్నికల్లో ఆమె ప్రత్యర్థి పార్టీ బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ బిఎన్పీ విజయం సాధించడం మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిక్ అన్వర్ లండన్‌లోని తన ప్రవాసం నుంచి వచ్చి ఎన్నికల్లో పోటీచేసి గెలవడం ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం వంటివి చకచకా సాగిపోయాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే హసీనా ఇప్పుడు హఠాత్తుగా తన స్వదేశం వెళతానని తెగేసి ప్రకటించడం వెనుక జరిగిన హఠాత్పరిణామాలేమిటన్న అంశంపైనే ఇప్పుడు ఎక్కువ చర్చలు సాగుతున్నాయి. భారత్ నుంచి ఒత్తిడి పెరుగుతోందా? లేక బంగ్లా ప్రభుత్వం ఆమెను అప్పగించాలని అంతర్జాతీయంగా భారత్‌పై ఒత్తిడిని పెంచుతుందా అన్నది ఒక అంచనా అయితే మరోవైపు అక్కడి స్థానిక ఎన్నికల్లో హసీనా పార్టీ అవామీ లీగ్‌కు పట్టు పెరుగుతున్నదని తెలుస్తోంది.దీనికితోడు నిషేధం ఉన్నప్పటికీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆమె పార్టీ రివ్వున ఎగిసి పడుతోంది. స్థానిక ఎన్నికల్లో మంచి పట్టుకూడా వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా తారిక్ రెహమాన్ ప్రభుత్వం అవామీ లీగ్ పార్టీని స్థానిక ఎన్నికల్లో పోటీకి అనుమతించింది. అయితే వారు పార్టీ గుర్తుపై కాకుండా స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేయాలని షరతులు విధించింది.



షేక్ హసీనా

బంగ్లాదేశ్ ప్రజలకున్న రాజకీయ హక్కులు, దేశంలో ప్రజాస్వామ్య పునరుద్దరణ, శాంతి భద్రతలు, విముక్తి పోరాటం స్ఫూర్తిని కొనసాగించేందుకే తాను బంగ్లాదేశ్‌కు తక్షణమే వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు బాహాటంగానే హసీనావైఖరి ఉత్కంఠ కలిగిస్తోంది. యూనస్ సర్కార్ హయాంలో మానవాళిపై ఆమె పార్టీ ప్రభుత్వం హయాంలో నిర్వహించిన నేరాలకు సంబంధించి ఆమెకు మరణశిక్ష విధించినవైనాన్ని అటు బిఎన్‌పి, ఇటు జమాత్ ఇస్లామి పార్టీలు ఆమెను హెచ్చరిస్తున్నాయి. వీటికితోడు అనేక కేసులు ఆమెపై కోర్టుల్లో విచారణకు సిద్ధంగా ఉన్నాయి. వీటిపై స్పందించిన హసీనా 1975లోనే నా తల్లితండ్రులు, సోదరులు ఇంచుమించు మొత్తం కుటుంబాన్ని పోగొట్టుకున్నానని, తనపై హత్యాయత్నాలు కూడా జరిగాయని ఆమె గుర్తుచేసారు. తనను అంతం చేసేందుకు అనేక కుట్రలు జరిగాయని, ప్రతి కుట్రను భగ్నం చేసామని ఆమె చెపుతున్నారు. బంగ్లాదేశ్ ప్రజలవైపు తాను ఉన్నందువల్లనే వారి ఆశీస్సులే తనను రక్షించాయని చెపుతున్న హసీనా ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో తన పార్టీ కేడర్ పోటీ చేసేవిధంగా వారిలో మరింత నైతిక స్థైర్యం నింపేందుకే బంగ్లాదేశ్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. బిఎన్‌పి సర్కారు, యూనస్ కేర్‌టేకర్ సర్కారుపై ఆమె లెక్కలేనన్ని విమర్శలుచేసారు. ఇన్నీ ఆమె చెప్పేందుకు సజావుగానే ఉన్నప్పటికీ బంగ్లాదేశ్‌లో కాలుపెట్టిన వెంటనే ఆమెను అరెస్టు చేయకుండా ఉంటారా? పెండింగ్ కేసులను విచారణ షురూ చేయకపోతారా అన్నదే ఇప్పుడు ఆమె కేడర్‌లో నలుగుతున్న ప్రధాన చర్చ. అన్నింటికంటే ప్రధానంగా అత్యున్నత న్యాయస్థానం యూనస్ హయాంలో ఆమెకు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఈ కేసు ఇప్పుడు ఎటువెళుతుంది. తారిక్ అన్వర్ ప్రభుత్వం ఈకేసులను కొట్టివేస్తుందా? అంతర్జాతీయ సమాజం తారిక్ సర్కార్‌పై ఒత్తిడి పెంచుతుందా? అన్నదే తేలాల్సి ఉంది. అటు చైనా, ఇటు పాకిస్థాన్‌లవైపే మొగ్గుచూపిస్తున్న తారిక్ అన్వర్ ప్రభుత్వ ధోరణులు చూస్తుంటే చైనా చెప్పినట్లు చేసేందుకు తారిక్ అన్వర్ ప్రభుత్వం తలూపుతు న్నదనే భావన రాజకీయ నిపుణుల్లో వ్యక్తం అవుతోంది. అదే జరిగితే భారత్ ఉపేక్షించే పరిస్థితులు ఎంతమాత్రం ఉండవు. తారిక్ అన్వర్ ప్రభుత్వం అంతర్జాతీయంగా తమపై ఒత్తిడి పెంచేందుకే హసీనా వ్యూహాత్మక జిమ్మికులకు పాల్పడుతున్నట్లు చెప్పుకొచ్చినా హసీనా బంగ్లాదేశ్‌లో తిరిగి కాలుమోపడం మాత్రం ఖాయం అన్నది ఖరారయిపోయింది. అపుడు బంగ్లాదేశ్‌లో అవామీ లీగ్‌పార్టీ నేతలు, కేడర్‌కు కొత్త చైతన్యం వచ్చినట్లవుతుంది. అయితే నిషేధం కొనసాగుతున్న తరుణంలో హసీనా బంగ్లాదేశ్‌కు వెళ్లి ఎలా నెగ్గుకు రాగలరన్నదే ఇప్పుడు అంతుబట్టని ప్రశ్న.అలాగే శిక్షలు పడిన కేసులనుంచి ఆమె ఎలా తప్పించుకోగలరన్నదే మిలియన్‌డాలర్ల ప్రశ్నగా మారుతోంది. ●

# ఐరోపా హీట్ డోమ్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తాజా హెచ్చరిక

**డి జె మోహన రావు**

ఐరోపాను కమ్మేసిన ఈ అసాధారణ వేడి మరో సాధారణ వేసవి కాదు. వాతావరణ మార్పు ఇకపై పర్యావరణ సమస్య మాత్రమే కాదని, అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ వాణిజ్యం, ప్రజారోగ్యం, వలసలు, భద్రతను ఒకేసారి ప్రభావితం చేసే సంక్షోభంగా మారిందని ఈ హీట్‌డోమ్ స్పష్టం చేస్తోంది. ఐరోపా ప్రస్తుతం తన ఆధునిక చరిత్రలోనే అత్యంత తీవ్రమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటోంది. సాధారణంగా ఆహ్లాదకరమైన వేసవులకు పేరుగాంచిన స్పెయిన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, హంగేరీ వంటి దేశాల్లో జూన్, జులై నెలల్లోనే ఉష్ణోగ్రతలు 40నుంచి 45డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. ఈ అసాధారణ పరిస్థితికి కేంద్రబిందువుగా నిలిచింది హీట్ డోమ్ అనే వాతావరణ వ్యవస్థ. శాస్త్రీయంగా చూస్తే హీట్ డోమ్ అనేది ఒక ప్రాంతంపై బలమైన అధిక పీడన వ్యవస్థ చాలా రోజుల పాటు స్థిరంగా కొనసాగడం వల్ల ఏర్పడే పరిస్థితి. ఈ అధిక పీడన మండలం ఒక మూతలా పనిచేసి భూమి నుంచి పైకి వెళ్లే వేడి గాలిని బయటకు వెళ్లనివ్వదు. బదులుగా ఆ గాలిని మళ్లీ కిందికి నొక్కడం వల్ల వేడి నిరంతరం పేరుకుపోయి ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతాయి. అదే సమయంలో మేఘాల అభివృద్ధి, వర్షపాతం కూడా అణచివేయబడతాయి. సహారా ఎడారి నుంచి వచ్చే వేడి గాలులు చేరితే పరిస్థితి మరింత తీవ్రమవుతుంది. ఇలాంటి హీట్ డోమ్‌లు ఏర్పడటానికి ఎగువ వాయుమండలంలో ఏర్పడే ఒమేగా బ్లాక్ అనే స్థిరమైన గాలి ప్రవాహ నమూనా కూడా ప్రధాన కారణాల్లో ఒకటిగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈప్రభావం పగటి పూటకే పరిమితం కావడం లేదు. అనేక ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 20డిగ్రీల సెల్సియస్ కంటే దిగువకు పడిపోకపోవడంతో ట్రాపికల్ నైట్స్ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అంటే సూర్యాస్తమయం తర్వాత కూడా చల్లదనం లేకుండా ఉక్కపోత కొనసాగుతోంది. ప్రపంచ సగటుతో పోలిస్తే ఐరోపా దాదాపు రెండు రెట్లు వేగంగా వేడెక్కుతోంది. అందువల్ల ఇలాంటి తీవ్ర ఉష్ణోగ్రత ఘటనలు మరింత తరచుగా, మరింత తీవ్రంగా నమోదవుతున్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఐరోపాలో ఈపరిస్థితులు మరింత ప్రమాదకరంగా మారడానికి అక్కడి భౌగోళిక పరిస్థితులు, మౌలిక సదుపాయాలే ఒక కారణం. అక్కడి భవనాలు తీవ్రమైన చలిని తట్టుకునేలా నిర్మించబడటంతో వేసవిలో వేడిని బయటకు పంపకుండా లోపలే నిల్వ చేస్తాయి. పగటిపూట రహదారులు, కాంక్రీ టు నిర్మాణాలు, పట్టణ ప్రాంతాలు గ్రహించిన వేడిని రాత్రిపూట కూడా విడుదల చేస్తుంటాయి. ఫలితంగా ప్రజలకు ఉపశమనం లభించడంలేదు. వృద్ధులు, చిన్నపిల్లలు, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్నవారిపై దీని ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. తీవ్ర ఉష్ణోగ్రతలు అదనపు మరణాల ప్రమాదాన్ని గణనీయంగా పెంచుతున్నాయని ప్రజారోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ మార్పుల మరో కీలక ప్రభావం క్లైమేట్ మైగ్రేషన్. ఉత్తర ఆఫ్రికా, మధ్య ప్రాచ్యదేశాల్లో తీవ్రమైన వేడి, నీటి కొరత, వ్యవసాయ సంక్షోభం మరింత పెరిగితే లక్షలాది మంది ఐరోపావైపు వలస వెళ్లేపరిస్థితులు ఏర్పడవచ్చు.ఇది ఇప్పటికే సవాలుగా మారిన వలస సమస్యను మరింత తీవ్రతరం చేయడంతో పాటు రాజకీయ, సామాజిక, భద్రతాపరమైన ఒత్తిడిని పెంచే అవకాశంఉంది. ఆర్థికంగా కూడా ఈ ప్రభావం తీవ్రమైనదే. దీర్ఘకాలం కొనసాగే హీట్‌డోమ్ నిర్మాణ, తయారీ, బహిరంగ పనుల రంగాల్లో ఉత్పాదకతను గణనీయంగా తగ్గిస్తుంది. కరువు పరిస్థితులు ఏర్పడితే రైన్, డాన్యూబ్ వంటి ప్రధాననదుల్లో నీటి మట్టాలు తగ్గి జలరవాణాకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో రవాణా వ్యయాలు పెరిగి పరిశ్రమలపై ప్రభావం పడుతుంది. వ్యవసాయ దిగుబడులు తగ్గి ఆహార భద్రతపై ఒత్తిడి పెరుగుతుంది. శీతలీకరణ అవసరాలు పెరగడంతో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతోంది. కొన్ని



ప్రాంతాల్లో తీవ్ర వేడికి రైల్వేపట్టాలు వంగిపోవడం, అడవుల్లో కార్చిచ్చులు చెలరేగడంవల్ల రవాణా, పర్యాటక రంగాలు కూడా దెబ్బతింటున్నాయి. ఇది ఇక ఐరోపాకు మాత్రమే పరిమితమైన వాతావరణ ఘటన కాదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఇంధన భద్రత, అంతర్జాతీయ వాణిజ్యం, సరఫరా గొలుసులపై ప్రభావం చూపుతున్న ప్రపంచస్థాయి సవాలుగా మారింది. ఐరోపాలో పారిశ్రామిక ఉత్పత్తి మందగిస్తే రసాయనాలు, యంత్రాలు, ఆటోమొబైల్ విడిభాగాల ప్రపంచ సరఫరా దెబ్బతింటుంది. గోధుమలు, ఆలివ్ ఆయిల్, వైన్ వంటి వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడులు తగ్గడం ప్రపంచ ఆహార ధరలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఐరోపా సమాఖ్య భారత్‌కు మూడో అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. 2025లో ఇరుపక్షాల మధ్య వస్తువుల వాణిజ్య విలువ సుమారు12.74 లక్షల కోట్లకు చేరింది. అందువల్ల అక్కడి వాతావరణ సంక్షోభం భారత్‌పై కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఐరోపాలో పారిశ్రామిక ఉత్పత్తి, వినియోగం మందగిస్తే భారతదేశం నుంచి ఎగుమతి అయ్యే వస్త్రాలు ఇంజినీరింగ్ ఉత్పత్తులు, రసాయనాలు, ఆటోమొబైల్ విడి భాగాలు, రత్నాలు, ఆభరణాలకు డిమాండ్ తగ్గవచ్చు.నౌకాశ్రయాలు, అంతర్గత జల మార్గాలు, రైల్వేలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు ఏర్పడితే భారత ఎగుమతులు ఆలస్యమవడంతో పాటు రవాణా వ్యయాలు పెరిగి ఎగుమతిదారుల పోటీతత్వం దెబ్బ తినే అవకాశంఉంది. అయితే ఈ సంక్షోభం కొన్ని అవకాశాలను కూడా సృష్టిస్తుంది. ఐరోపాలో వ్యవసాయ దిగుబడులు తగ్గితే ఆహార దిగుమతుల అవస రం పెరుగుతుంది. దీనిని భారత్ వ్యవసాయ ఉత్పత్తులు, సముద్ర ఆహారం, ప్రాసెస్డ్ ఫుడ్ ఎగుమతులను విస్తరిం చుకునే అవకాశంగా మలుచుకోవచ్చు. అయితే ఇందుకు ఐరోపా నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు, ఆహార భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. మరోవైపు, తక్కువ కార్బన్ ఉద్గారాలతో తయారైన ఉత్పత్తులకు ఐరోపా మరింత ప్రాధాన్యం ఇస్తోంది. ఇందుకోసం కార్బన్‌బోర్డర్ అడ్జస్ట్మెంట్ మెకానిజం అమలు చేస్తోంది. అధిక కార్బన్ ఉద్గారాలతో తయారైన దిగుమతి ఉత్పత్తులపై అదనపు కార్బన్ వ్యయాన్ని విధించే ఈ విధానం వల్ల భారతీయ ఉక్కు, అల్యూమినియం, సిమెంట్ వంటి ఉత్పత్తుల ఎగుమతుల వ్యయం పెరిగే అవకాశంఉంది. అందు వల్ల భారత పరిశ్రమలు గ్రీన్‌టెక్నాలజీ, ఇంధన సామర్థ్యం, తక్కువకార్బన్ ఉత్పత్తి విధానాల వైపు వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. ఈ కోణంలో చూస్తే, ఐరోపా హీట్ డోమ్ భారత్‌కు ఒక హెచ్చరిక మాత్రమే కాదు, గ్రీన్ తయారీ ద్వారా ప్రపంచ మార్కెట్లో కొత్త అవకాశాలను అందిపుచ్చు కునే అవకాశాన్ని కూడా కల్పిస్తోంది. హీట్ డోమ్‌లు సాధారణంగా వాతావరణ ప్రసరణలో మార్పులు వచ్చిన తర్వాతే బలహీనపడతాయి. 2003, 2022, 2023 హీట్‌వేవ్‌ల నుంచి పాఠాలు నేర్చుకున్న ఐరోపా దేశాలు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, కూలింగ్ సెంటర్లు, హీట్ యాక్షన్ ప్లాన్‌లు, ప్రజారోగ్య చర్యలను బలోపేతం చేశాయి. అయినప్పటికీ, గ్లోబల్‌వార్మింగ్ కొనసాగుతున్న నేపథ్యంలో ఇటువంటి తీవ్రమైన ఉష్ణోగ్రత ఘటనలు మరింత తరచుగా, మరింత కాలం కొనసాగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఐరోపాలో కనిపిస్తున్న ఈ హీట్ డోమ్ ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. వాతావరణ మార్పును ఇకపై పర్యావరణ సమస్యగా మాత్రమే చూడలేం. ఇది ప్రపంచ ఆర్థికవ్యవస్థ, ఆహార భద్రత, ఇంధన విధానం, అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడులు, వలసలు, జాతీయ భద్రతలను ఒకేసారి ప్రభావితం చేసే బహుముఖ సంక్షోభంగా మారింది. గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడం, వాతావరణ అనుకూల మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు పెంచడం, దేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం ఇకపై ఒక ఎంపిక కాదు. ప్రపంచ భవిష్యత్తుకు అత్యవసర అవసరం. ●

# సంక్షోభ వేళ.. సరైన నిర్ణయాలు

**• ఇంధన సమస్యలను జాగ్రత్తగా పరిష్కరించాం.. • పశ్చిమాసియా యుద్ధ ప్రభావాన్ని తగ్గించాం: ప్రధాని మోడీ**



**జోద్‌పూర్,జులై 4:** ప్రపంచ ఇంధన సంక్షోభ సమయంలో ఆచరణాత్మక, విధానపరమైన, దౌత్యపరమైన స్థాయిలలో భారతదేశం తీసుకున్న సున్నితమైన, దూరదృష్టితో కూడిన నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతాయని ప్రధాని మోడీ అన్నారు. ఈ చర్యలు దేశాన్ని ఒక పెద్ద సంక్షోభం నుండి కాపాడటంలో కీలక పాత్ర పోషించాయి. భారతదేశం తన ఎల్‌పిజి అవసరాలలో సుమారు 60 శాతాన్ని దిగుమతి చేసుకుంటుంది, మరియు ఈ దిగుమతి చేసుకున్న ఎల్‌పిజిలో అధిక భాగం గల్ఫ్ దేశాల నుండి వస్తుంది. పశ్చిమ ఆసియాలో యుద్ధం సరఫరాలకు అంతరాయం కలిగించే ప్రమాదం ఏర్పడింది, ఇది దేశంలో తీవ్రమైన సంక్షోభానికి దారితీసే అవకాశం ఉంది.

**సంక్షోభ సమయంలో ఎల్‌పిజి ఉత్పత్తిలో పెరుగుదల**

మధ్యప్రాచ్య యుద్ధాన్ని ప్రస్తావిస్తూ, ఏప్రిల్ నుండి జూన్ మధ్య కాలంలో పెట్రోల్, డీజిల్ కంపెనీలు మాత్రమే 75 వేల కోట్ల నష్టాన్ని చవిచూశాయని ప్రధాని మోడీ అన్నారు. రాజస్థాన్‌లోని బలోత్రాలో పచ్‌పద్ర రిఫైనరీని ప్రారంభించిన అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఘనత సాధించినందుకు రాజస్థాన్‌ను అభినందిస్తూ, దేశం దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న ఇంధన సంక్షోభం పరిష్కారం కోసం ఎదురుచూపులు ఇప్పుడు ముగిశాయని ఆయన అన్నారు. దేశానికి అవసరమైన 90 ఎల్‌పిజి హోర్ముజ్ జలసంధి ద్వారా వచ్చేది. అకస్మాత్తుగా, యుద్ధ పరిస్థితులు ఈ సరఫరాను నిలిపివేశాయి.

కానీ, సవాళ్లను ఎదుర్కోవడం రాజస్థాన్ గడ్డ మనకునేర్పింది. సంక్షోభం ప్రారంభమైన వెంటనే మేము రిఫైనరీపై దృష్టి సారించాము. ఈ మొత్తంతో ఒక రిఫైనరీని నడపవచ్చు. ఏడు రోజుల్లోనే ఎల్పీజీ ఉత్పత్తి పెరిగింది. గతంలో ఉత్పత్తి 35వేల మెట్రిక్ టన్నులు ఉండగా, సంక్షోభ సమయంలో అది 54వేల మెట్రిక్ టన్నులకు పెరిగిందని, గతంలో ఎల్పీజీని ఉత్పత్తి చేయని రిఫైనరీలు కూడా ఉత్పత్తిని ప్రారంభించాయని గుర్తుచేసారు. దాదాపు 11 లక్షల ఇళ్లకు పిఎన్‌జీ కనెక్షన్లు కూడా అందించబడ్డాయి. 54 వేల మంది యువతకు నియామక పత్రాలు అందజేశారు.

ఈ సమావేశంలో ఆయన రాజస్థాన్‌కు చెందిన సుమారు 54వేల మంది యువకులకు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను కూడా అందజేశారు. నియామకాలు పొందిన యువకులందరినీ అభినందిస్తూ, ఈ అవకాశం వారి ఉజ్వల భవిష్యత్తుకు కొత్త బలాన్ని ఇస్తుందని, రాష్ట్ర అభివృద్ధిలో వారు కీలక పాత్ర పోషిస్తారని ప్రధానమంత్రి అన్నారు.



# నా వార్తలే చదువుతా..

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, జులై 4:** తాను ఖాళీ సమయాల్లో ఎక్కువగా వార్తాపత్రికలే చదువుతానని, అందులోనూ తన గురించి వచ్చిన కథనాలే చూస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. 'స్టోరీ టైమ్ విత్ సెకండ్ లేడీ' పేరిట అమెరికా ఉపాధ్యక్షుడి సతీమణి ఉషావాన్స్ హోస్ట్ చేసిన పాడ్‌కాస్ట్‌లో అధ్యక్షుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైట్‌హౌస్ హిస్టారికల్ అసోసియేషన్ ప్రచురించిన 'ప్రెసిడెంట్స్ ప్లే!' పుస్తకాన్ని చదివి వినిపించారు. అందులో ప్రస్తావించిన మాజీ అధ్యక్షుల ఆసక్తుల గురించి పేర్కొన్నారు. వైట్‌హౌస్ ప్రాంగణంలో నిర్మిస్తోన్న బాల్‌రూమ్ గురించి మాట్లాడారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం (జులై 4) సందర్భంగా ఈ పాడ్‌కాస్ట్ విడియోను ఉష ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ఈ 'ప్రెసిడెంట్స్ ప్లే!' పుస్తకంలో ఒక అధ్యక్షుడు వైట్‌హౌస్‌లో సూపర్ బౌల్ (యేటా జరిగే ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్) లైవ్ చూసిన ఫొటోను పొందుపర్చారు. ఆదృశ్యాన్ని ట్రంప్ ఈ పాడ్‌కాస్ట్‌లో చూపిస్తూ.. 'ఇది చూస్తే నాకు ఒక ఐడియా వచ్చింది. ఫుట్‌బాల్ చూసేందుకు బరాక్ ఒమాబా, జో బైడెన్, బుష్ కుటుంబాలను ఆహ్వానిస్తే బాగుంటుందేమో. ప్రెసిడెంట్స్ రీయూనియన్ మాదిరిగా ఉంటుంది. అదే జరిగితే ప్రెస్ హోరెత్తుతుందేమో' అని సరదాగా అన్నారు. అమెరికాకు అధ్యక్షులుగా పనిచేసిన వారు ఖాళీ సమయంలో ఏమి చేసేవారో ట్రంప్ వెల్లడించారు. 'మామూలుగా ఒక అధ్యక్షుడు వైట్‌హౌస్‌లో గడిపే సమయం చాలా తక్కువ. ప్రజల కోసం పనిచేస్తాం కాబట్టి అక్కడ ఉండటం ఒక గౌరవం. బిల్‌క్లింటన్ తన కోసం నిర్మించిన ట్రాక్‌పై జాగింగ్ చేసేవారు. ఈ విషయం నాకు ఇటీవలే తెలిసింది. నేనైతే అలా చేయలేను అనుకుంటా. క్లింటన్ మంచి మనిషి ఆయనంటే నాకు ఇష్టమే' అంటూ కొనియాడారు.



# ఎప్పటికీ జరగని పెళ్లికి టికెట్ బుక్‌చేయాలా?

## సియాగోయల్ స్నాప్‌చాట్‌పై పోలీస్ దర్యాప్తు

**పుణె,జులై 4:** పుణే వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసు దర్యాప్తు ముందుకెళుతున్న కొద్దీ విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితురాలు సియా గోయల్‌కు చెందినట్లు చెబుతున్న స్నాప్‌చాట్ చాటింగ్ ఇప్పుడు కీలకంగా మారింది. ఎప్పటికీ జరగని పెళ్లికోసం టికెట్ బుక్ చేయాలంటే నీ ఆధార్ కార్డు పంపు అంటూ సియా తన స్నేహితురాలికి మెసేజ్‌పంపినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఈ చాట్ నిజమైనదేనా? హత్యకు ముందు పక్కాప్రణాళికలో భాగమేనా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు. పెళ్లి ఏర్పాట్లు కొనసాగుతున్నాయనే భావన కల్పించి అనుమానాలు రాకుండా చేసేందుకే విమాన టికెట్లు బుక్ చేయాలని భావించినట్లు అనుమానిస్తున్నారు. అయితే ఈ చాట్ ప్రామాణికత ఇంకా నిర్ధారణ కాలేదని అధికారులు స్పష్టం చేశారు. పోలీసుల దర్యాప్తులో మరో కీలకవిషయం బయట పడింది. సియా గోయల్, చేతన్ చౌదరి తమ ఫోన్లలో కోడ్ భాష, మారుపేర్లతో మాట్లాడినట్లు డిలీట్‌చేసిన డేటా రికవరీలో గుర్తించారు. దర్యాప్తును తప్పుదారి పట్టించేందుకే ఈ పద్ధతి అనుసరించినట్లు భావిస్తున్నారు. ఇద్దరినీ ఎదురెదురుగా కూర్చోబెట్టి విచారించేందుకు మరో మూడు రోజుల పోలీసు కస్టడీ ఇవ్వాలని పోలీసులు కోర్టునుకోరారు. అయితే కోర్టు ఆ అభ్యర్థనను తిరస్కరించింది. దీంతో సియా, చేతన్‌లను 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపింది.

# ఖమేనీ అంతిమయాత్ర ఆరంభం

## ఎర్ర జెండాలతో వేలాదిగా వచ్చిన అభిమానులు

## 'డెత్ ఆఫ్ అమెరికా' అంటూ నినాదాలు



**టెహ్రాన్, జులై 4:** ఇరాన్ దివంగత నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీ అంతిమయాత్ర అధికారికంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఖమేనీతోపాటు మృతి చెందిన కుటుంబసభ్యుల శవపేటికలనూ మద్దతుదారుల సందర్శనార్థం రాజధాని నగరం టెహ్రాన్‌లో ఉంచారు. వాటిల్లో ఆయన 14 నెలల మనవరాలు జహ్రా మొహమ్మదీ శవపేటిక కూడా ఉంది. దాని పక్కనే ఆ చిన్నారి ఫొటో ఫ్రేమ్‌ను ఉంచారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ నిర్వహించిన సంయుక్త దాడుల్లో 86 యేళ్ల ఖమేనీతోపాటు ఆయన కుటుంబసభ్యులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. నాలుగునెలల తర్వాత వీరి అంతిమ సంస్కారాలను నిర్వహిస్తున్నారు. ఇరాన్, ఇరాక్‌లోని ఐదు నగరాల్లో ఏడు రోజులపాటు ఈ అంత్యక్రియలు జరగనున్నాయి. ఖమేనీ పార్థివదేహాన్ని ఆయన సొంత పట్టణం ఇరాన్‌లోని మషహద్‌లో ఈ నెల 9న ఖననం చేయనున్నారు. ఈ రోజు ఆయన భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆయనకు శ్రద్ధాంజలి ఘటించేందుకు వేలాది మంది తరలివచ్చారు. వారంతా ప్రతీకారానికి గుర్తుగా ఎర్ర జెండాలను పట్టుకొని.. 'డెత్ ఆఫ్ అమెరికా' అంటూ నినాదాలు చేసినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. కాగా.. ఖమేనీతో సన్నిహితంగా పనిచేసిన నాయకులు ఉద్వేగానికి గురయ్యారు. విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ ఆయనను గుర్తుచేసుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు.

**ట్రంప్ వ్యాఖ్యలు వివాదాస్పదం..**

ఈ సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. 'ఇరాన్‌ను చిత్తుగా ఓడించాం. దాంతో వారు రాజీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మనం మంచివాళ్లం కాబట్టి.. అంత్యక్రియల కోసం వీకాఫ్ ఇచ్చాం' అని సౌత్ డకోటాలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు.

**కనిపించని మొజ్తాబా ఖమేనీ..**

కాగా అలీ ఖమేనీ అంత్యక్రియల్లో కుమారుడు మొజ్తాబా ఖమేనీ కనిపించక పోవడం చర్చనీయాంశమైంది. యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి బయటి ప్రపంచానికి కనిపించని ఆయన.. ఇప్పుడు తండ్రి అంత్యక్రియలకూ రాకపోవడం గమనార్హం. పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరతలతో భద్రతాపరమైన ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన తండ్రి అంత్యక్రియలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారని సమాచారం.

# వేడి తీవ్రతతో స్వాతంత్ర్య దినోత్సవ పెరేడ్ రద్దు





**వాషింగ్టన్,జులై 4:** అమెరికా తన 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వాషింగ్టన్‌లో నిర్వహించాల్సిన సాంప్రదాయ స్వాతంత్ర్య దిన పరేడ్‌ను తీవ్ర వేడి కారణంగా రద్దు చేశారు. ఈ ఉదయం జరగాల్సిన ఈపరేడ్ అత్యధిక ఉష్ణోగ్రత వల్ల రద్దు అయిందని నిర్వాహకులు ప్రకటించారు. జాతీయ వాతావరణ సంస్థ ప్రకారం, సుమారు 16 కోట్ల అమెరికన్లు తీవ్ర వేడి హెచ్చరికలు ఎదుర్కొంటున్నారు. తూర్పు అమెరికాలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాషింగ్టన్‌లోని నేషనల్ మాల్‌లో జరిగే ఉత్సవాలు కూడా వేడి తీవ్రత కారణంగా మధ్యాహ్న భాగం రద్దు చేయాల్సి వచ్చింది. మరోవైపు, వేడిమికి తట్టుకోలేక అస్వస్థతకు గురైన ఒక యువతిని ఆసుపత్రికి తరలించారు. గ్రేట్ అమెరికన్ స్టేట్ ఫేర్ కార్యక్రమాన్ని కూడా తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. న్యూయార్క్‌లో హీట్ ఇండెక్స్ 105 ఫారెన్‌హీట్ (41 డిగ్రీల సెల్సియస్)కి చేరుకుంది. విద్యుత్ గ్రిడ్లపై భారీ ఒత్తిడి పడుతోంది. వేలాది మందికి విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఈ తీవ్ర వేడి అమెరికా స్వాతంత్ర్య దినోత్సవాలు, ఫిఫా వరల్డ్ కప్ మ్యాచ్‌లు, విద్యుత్ వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఫిఫా ఈ వరల్డ్ కప్ మ్యాచ్‌ల్లో హైడ్రేషన్ బ్రేకులు తప్పనిసరి చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ వేడిని ఎదుర్కోవడానికి కూలింగ్ సెంటర్లు, స్విమ్మింగ్ పూల్స్ సమయం పొడిగించడం వంటి చర్యలు తీసుకుంటోంది. ఈ ఏడాది అమెరికా స్వాతంత్ర్యానికి 250 ఏళ్లు పూర్తవుతున్న విశేష సందర్భం కావడంతో భారీ ఉత్సవాలకు ప్రణాళిక రూపొందించారు. అయితే ప్రకృతి వైపరీత్యాలు ఆ ఉత్సవాలపై పెను ప్రభావం చూపాయి.

# బలూచిస్థాన్‌లో భారీ ఉగ్రదాడి

## 30 మంది భద్రతా సిబ్బంది మృతి



**గ్వదర్,జులై 4:** పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రాంతంలో మరో భారీ దాడి జరిగినట్లు బలూచ్ లిబరేషన్ ఆర్మీ ప్రకటించింది. గ్వదర్ జిల్లాలోని జీవానీ పరిధిలో ఉన్న పన్వాన్ ప్రాంతంలోని పాకిస్థాన్ కోస్ట్ గార్డ్స్ క్యాంపును లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు తెలిపింది. ఈ ఘటనలో 30 మందికిపైగా భద్రతా సిబ్బంది మృతి చెందారని, మరికొందరు గాయపడ్డారని పేర్కొంది. బిఎల్ఎ చేసిన ఈ ప్రకటనపై పాకిస్థాన్ సైన్యం లేదా కోస్ట్ గార్డ్స్ నుంచి అధికారిక ధ్రువీకరణ రాలేదు. బలూచ్ లిబరేషన్ ఆర్మీ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, తమ మజీద్ బ్రిగేడ్‌కు చెందిన సభ్యుడు పేలుడు పదార్థాలతో నింపిన మాజ్దా వాహనాన్ని కోస్ట్ గార్డ్స్ క్యాంపులోకి తీసుకెళ్లి పేల్చినట్లు బిఎల్ఎ పేర్కొంది. ఈ భారీ పేలుడు కారణంగా కోస్ట్ గార్డ్స్ క్యాంపు తీవ్రంగా దెబ్బతిన్నట్లు తెలిపింది. పేలుడు అనంతరం తమ ఫతేహ్ స్క్వాడ్‌కు చెందిన సభ్యులు క్యాంపుపై దాడి చేసినట్లు వెల్లడించింది. పేలుడు నుంచి బయటపడిన భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దాడులు కొనసాగించినట్లు పేర్కొంది.

ఘటనలో 30 మందికిపైగా పాకిస్థాన్ భద్రతా సిబ్బంది మృతి చెందినట్లు బిఎల్ఎ ప్రకటించింది. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారని తెలిపింది. శిథిలాల కింద మరికొంత మంది చిక్కుకుని ఉండవచ్చని, గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నందున మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఘటన జరిగిన వెంటనే పాకిస్థాన్ సైన్యం లేదా కోస్ట్ గార్డ్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ దాడికి పాల్పడిన వ్యక్తి వివరాలను కూడా బిఎల్ఎ తన ప్రకటనలో వెల్లడించింది. అతడిని అత్తావుల్లా బలోచ్ అలియాస్ అజ్మల్‌గా పేర్కొంది.



# ప్రపంచాన్ని తప్పదారి పట్టించేందుకే తెరపైకి సింధుజలాల ఒప్పందం

**న్యూఢిల్లీ,జులై 4:** ఉగ్రవాదానికి పుట్టినిల్లుగా పేరుపడ్డ పాకిస్థాన్, ఇప్పుడు అంతర్జాతీయ సమాజం దృష్టిని మళ్లించేందుకు కొత్త ఎత్తుగడకు తెరలేపింది. తన దేశంలో నెలకొన్న తీవ్ర నీటి సంక్షోభానికి భారత్ కారణమంటూ ఓ కొత్త నాటకాన్ని రక్తికట్టిస్తోంది. దేశంలో భరించలేని ఉష్ణోగ్రతల కారణంగా నీటి కొరత ఏర్పడుతుందన్న భయంతో పాకిస్థాన్ హడావుడిగా ఓ అంతర్జాతీయ సదస్సు నిర్వహించింది.

సింధు జలాల ఒప్పం దాన్ని భారత్ నిలిపివేయడం వల్లే తమకు ఈ దుస్థితి వచ్చిందని ప్రచారం చేయడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. వాస్తవానికి పాకిస్థాన్‌లో పెరుగు తున్న నీటి కష్టాలకు దాని దశాబ్దాల వైఫల్యాలే కారణం. 2025లో పహల్గామ్‌పై జరిగిన ఉగ్రదాడి తర్వాతే భారత్ సింధు జలాల ఒప్పందాన్ని నిలిపి వేసింది. పహల్గామ్ దాడి తర్వాత సహనం నశించి, "రక్తం, నీళ్లు కలిసి ప్రవహించవు" అని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకునే వరకు ఒప్పందాన్ని పునరుద్ధరించేది లేదని భారత్ స్పష్టం చేసింది. ఈ వాస్తవాలను దాచిపెట్టి పాకిస్థాన్ మంత్రులు, బిలావల్ భుట్టో వంటి నేతలు అణుయుద్ధం వస్తుందంటూ బెదిరింపులకు దిగుతున్నారు.

**పాకిస్థాన్ వైఫల్యాలే అసలు కారణం**

పాకిస్థాన్ ఆరోపిస్తున్నట్టుగా ఈ నీటి సంక్షోభం భారత్ వల్ల వచ్చింది కాదు. దశాబ్దాలుగా నీటి యాజమాన్యాన్ని నిర్లక్ష్యం చేయడం, సరైన నిల్వ సామర్థ్యం లేకపోవడం, ప్రావిన్సుల మధ్య అంతర్గత వివాదాలే దీనికి మూల కారణాలు. నీటి ఎద్దడి ఉన్నదేశంలో వరి, చెరకువంటి అధిక నీటిని వినియోగించే పంటలను విరివిగా పండించడం కూడా ఈసంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తోంది.

# 23 మందిని ఉగ్రవాదులుగా ప్రకటించిన కేంద్రం

## వారిలో 17 మంది పాకిస్థానీయులు, ఆరుగురు భారతీయులు

**న్యూఢిల్లీ, జులై 4:** పాకిస్థాన్ గడ్డపైనుంచి ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్న 23 మందిని చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ) కింద ఉగ్రవాదులుగా కేంద్రం ప్రకటించింది. వీరిలో జైష్‌ఎమహ్మద్ (జెఇఎం), లష్కరే తోయిబా (ఎల్‌ఇటి)తో పాటు వాటి అనుబంధ సంస్థలకు చెందిన కీలక నేతలు ఉన్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఉగ్రదాడులు, ఉగ్రవాదుల నియామకం, నిధుల సమీకరణ, ఆయుధాల అక్రమ రవాణా, సరిహద్దు చొరబాట్లు, ఉగ్ర సంస్థలకు సహకారం వంటి కార్యకలాపాల్లో వీరు పాల్గొంటున్నట్లు పేర్కొంది.

ఈ 23 మందిలో 17 మంది పాకిస్థాన్ పౌరులు, ఆరుగురు భారతీయులు ఉన్నారు. ప్రస్తుతం వీరంతా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి ఉగ్ర కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని కేంద్రం తెలిపింది. ఈ జాబితాలో జైష్‌కు చెందిన మసూద్ ఇల్యాస్ కశ్మీరీ, మొహమ్మద్ ముసద్దిక్, ముఫ్తీ మహ్మద్ అస్గర్ ఖాన్, అబ్దుల్లా జెహాదీ వంటి కీలక నేతలు ఉన్నారు. వీరు ఉగ్రవాదుల శిక్షణ, నియామకం, భారత్‌లోకి చొరబాట్లు, దాడుల ప్రణాళికలో కీలక పాత్ర పోషించినట్లు కేంద్రం ఆరోపించింది. 2022 సుంజ్వాన్ దాడి, 2016 నాగ్రోటా ఆర్మీ క్యాంప్‌పై దాడులతోనూ వీరికి సంబంధాలు ఉన్నట్లు పేర్కొంది. లష్కరే తోయిబాకు చెందిన ఫిర్దౌస్ అహ్మద్ భట్, హారూన్ రషీద్ గనాయ్ తో పాటు మరికొందరినీ ఉగ్రవాదుల జాబితాలో చేర్చారు. వీరు ఆయుధాల సరఫరా, యువతను ఉగ్రవాదంలోకి ఆకర్షించడం, దాడులకు అవసరమైన లాజిస్టిక్ సహాయం అందించినట్లు ప్రభుత్వం తెలిపింది.

2019లో యూఏపీఏ సవరణల తర్వాత ఉగ్ర సంస్థలతో పాటు వ్యక్తులను కూడా నేరుగా ఉగ్రవాదులుగా ప్రకటించే అధికారం కేంద్రానికి లభించింది. అదే అధికారాన్ని వినియోగిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# మెసేజింగ్‌యాప్ టెలిగ్రామ్‌కు కేంద్ర ఐటిశాఖ నోటీసులు





**న్యూఢిల్లీ,జులై 4:** పైరసీ కంటెంట్ విషయంలో ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌కు కేంద్ర ప్రభుత్వం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. తమ ప్లాట్‌ఫామ్‌పై చట్టవిరుద్ధంగా చలామణి అవుతున్న పైరేటెడ్ సినిమాలు, ఒటిటి కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని ఆదేశించింది. దీనిపై తీసుకున్న చర్యల గురించి 15 రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నేడు టెలిగ్రామ్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. భారత్‌లో వేగంగా విస్తరిస్తున్న క్రియేటర్ ఎకానమీ, చిత్ర పరిశ్రమ, బ్రాడ్‌కాస్టర్లు, ఒటిటి ప్లాట్‌ఫామ్‌లు, నిర్మాతలు, పంపిణీదారులను డిజిటల్ పైరసీ బారి నుంచి కాపాడే లక్ష్యంతో కేంద్రం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు విడుదలైన కొద్ది గంటల్లోనే టెలిగ్రామ్ ఛానెళ్ల ద్వారా పైరసీకి గురవుతుండటంతో పరిశ్రమ వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం రంగంలోకి దిగింది.

నీట్‌యూజీ 2026 పునఃపరీక్ష సందర్భంగా మోసాలను అరికట్టేందుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ జూన్ 22 వరకు టెలిగ్రామ్‌ను తాత్కాలికంగా బ్లాక్ చేసిన విషయం తెలిసిందే. పరీక్షలో అక్రమాలకు పాల్పడేందుకు కొన్ని ముఠాలు ఈ యాప్‌ను వ్యవస్థీకృతంగా వాడుతున్నాయని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టెలిగ్రామ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ కూడా చుక్కెదురైంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం చట్టప్రకారమే తన అధికారాలను ఉపయోగించిందని, ఈ ఆంక్షలు సమంజసమేనని జస్టిస్ తేజస్ కరియా ధర్మాసనం తీర్పునిచ్చింది. ఒకవైపు టెలిగ్రామ్‌కు పైరసీపై ఆదేశాలు జారీ చేసిన కేంద్రం, మరోవైపు మెటా యాజమాన్యంలోని వాట్సాప్‌పైనా దృష్టి సారించింది. వాట్సాప్ తీసుకురావాలనుకుంటున్న యూజర్‌నేమ్ ఫీచర్‌పై సంప్రదింపులు పూర్తయ్యే వరకు దానిని భారత్‌లో ప్రారంభించవద్దని మెటాను ఆదేశించింది. దీనిపై స్పందించిన వాట్సాప్, ఈ ఫీచర్ ఐచ్ఛికమని, మోసాలు, నకిలీ ఖాతాలను నివారించేందుకు తగిన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వానికి వివరణ ఇచ్చింది.

# సంక్షిప్త వార్తలు

## ఉమర్‌ఖలీద్, షార్జిల్ ఇమామ్‌ల బెయిల్‌పై తీర్పు రిజర్వు



**న్యూఢిల్లీ,జులై 4:** ఢిల్లీలో 2020 నాటిఅల్లర్ల వెనుక కుట్రకు పాల్పడ్డారన్న ఆరోపణలతో అరెస్టయిన ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్ దాఖలు చేసిన తాజా బెయిల్ పిటిషన్లపై ఢిల్లీ కోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. శనివారం ఇరుపక్షాల వాదనలను విన్న అదనపు సెషన్స్ జడ్జి సమీర్ బాజ్‌పాయ్, తీర్పు వెల్లడిని సాయంత్రానికి వాయిదావేశారు. విచారణ ప్రారంభం కాకుండానే తాము సుదీర్ఘ కాలంగా జైలులో ఉన్నామని, ఇది రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమేనని ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్ తమ పిటిషన్లలో పేర్కొన్నారు. మారిన పరిస్థితుల్లో దృష్ట్యా, విచారణలో జాప్యం జరిగితే కఠినమైన చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ) కింద కూడా బెయిల్ మంజూరు చేయవచ్చని సుప్రీంకోర్టు ఇటీవల పలు కేసుల్లో స్పష్టం చేసిన విషయాన్ని వారు ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు.

## టేలర్ స్విఫ్ట్ వివాహవేడుకలో వజ్రాలగిఫ్ట్‌లు!

**న్యూయార్కు,జులై 4:** ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆసక్తి రేపిన పాప్ సింగర్ టేలర్ స్విఫ్ట్, అమెరికన్ ఫుట్‌బాల్ స్టార్ ట్రావిస్ కెల్సీల వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. న్యూయార్క్‌లోని ప్రఖ్యాత మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఈ జంట ఒక్కటైన విషయం తెలిసిందే. అయితే, పెళ్లికి ముందు రోజు జరిగిన రిహార్సల్ డిన్నర్‌లో అతిథులకు వారు ఇచ్చిన ఖరీదైన బహుమతులు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ఈ వేడుకకు హాజరైన ప్రతిఒక్కరికీ వజ్రాలు పొదిగిన షాంపైన్ గ్లాసులు బహుమతిగా ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లోని ఇన్ఫోసిస్ థియేటర్‌లో ఈ రిహార్సల్ డిన్నర్ జరిగింది. సుమారు 100మంది సన్నిహితులు, కుటుంబ సభ్యులు, సెలబ్రిటీలు ఇందులో పాల్గొన్నారు.

## మమతకు మరోషాక్: రాష్ట్ర అధ్యక్షురాలు రాజీనామా

**కోల్‌కతా, జులై 4:** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయ సంక్షోభం మరింత తీవ్ర రూపం దాల్చింది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితురాలిగా గుర్తింపు పొందిన సీనియర్ నాయకురాలు, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు చంద్రిమ భట్టాచార్య తన పదవులన్నింటికీ రాజీనామా చేశారు. శనివారం ఆమె ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కేవలం రాష్ట్ర అధ్యక్షపదవికే కాకుండా, పార్టీ బ్యాంకు ఖాతాల ఆథరైజ్డ్ సిగ్నేచరీగా, ఎన్నికల సంఘం వద్ద పార్టీ ప్రతినిధిగా కూడా తన బాధ్యతల నుంచి ఆమె తప్పుకున్నారు. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టిఎంసి ఘోర పరాజయాన్ని చవిచూసిన విషయం తెలిసిందే. చంద్రిమ రాజీనామాపై మమత బెనర్జీ వర్గం నేతలు స్పందించారు. పార్టీలో కీలక పదవులను అనుభవించి, ఇప్పుడు ఇలా వ్యవహరించడం సరైనది కాదని ఎమ్మెల్యే కునాల్ ఘోష్ అభిప్రాయపడ్డారు. టిఎంసి క్రమంగా తన ప్రాభవాన్ని కోల్పోతోందనడానికి ఇదే నిదర్శనమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య వ్యాఖ్యానించారు.

## ముస్లిం మైనార్టీలే లక్ష్యంగా కూల్చివేతలు

**న్యూఢిల్లీ, జులై 4:** దేశంలోని రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల్లో మసీదులు, దర్గాలు, నివాస ప్రాంతాలపై జరుగుతున్న కూల్చివేతల చర్యలు ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని నిర్వహిస్తున్నవేనని జమాత్‌ఏఇస్లామీ హింద్ ఆరోపించింది. సంస్థ ఉపాధ్యక్షుడు సలీం ఇంజినీర్ మాట్లాడుతూ మతపరమైన నిర్మాణాలపై ఎంపికచేసి చర్యలు తీసుకోవడం అత్యంత ఆందోళనకరమన్నారు. అభివృద్ధి, భద్రతపేరుతో చట్టబద్ధమైన విధానాలను పాటించకుండా కూల్చివేతలు చేపడుతున్నారని, ప్రజల్లో భయం సృష్టించే ప్రయత్నమే జరుగుతోందని విమర్శించారు. అలాగే ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కూడా జమాత్‌ఏఇస్లామీ హింద్ అభ్యంతరం వ్యక్తం చేసింది.

## వైద్యురాలి హత్యకేసులో బీహార్ ఎమ్మెల్యేకు నాలుగేళ్ల జైలు

**పాట్నా,జులై 4:** బీహార్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే రాజు కుమార్ సింగ్‌కు ఢిల్లీ కోర్టు షాకిచ్చింది. మహిళా వైద్యురాలిని చంపిన కేసులో నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. 2018 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జరిగిన సెలబ్రేటరీ ఫైరింగ్‌లో మహిళా వైద్యురాలు డాక్టర్ అర్చనా గుప్తా మృతి చెందిన కేసులో దోషిగా తేల్చిన కోర్టు.. నాలుగేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు ఆయుధ చట్టం ఉల్లంఘన కేసులో మరో రెండు నెలల జైలు శిక్ష విధించింది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గొగ్నే ఈ తీర్పు వెలువరించారు.



శనివారం ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్, ఎస్పీ మహేశ్వర రెడ్డి

## నత్తనడకన పనులపై కలెక్టర్, ఎస్పీ ఆగ్రహం

**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), జూలై 4 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లాలో రణస్థలం మండల కేంద్రం జాతీయ రహదారి పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడక సాగుతుండటంపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ సర్వీసు రోడ్డు నుంచి మళ్లించడం వల్ల ట్రాఫిక్ అంతరాయం, ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతుండటంపై నిర్మాణ పనుల తీరును వారు శనివారం పరిశీలించారు. తొలుత హైవే, పంచాయతీ, రెవెన్యూ అధికారులతో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వారు సమీక్ష నిర్వహించారు. అనంతరం ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల వద్ద స్వయంగా పరిశీలించిన పనులు నత్తనడకన సాగుతుండడంతో హైవే అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ట్రాఫిక్ మళ్లించే సర్వీసు రోడ్డు గుంత గుంతలుగా ఉండటంతో ఆయన హైవే అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ మళ్లించే సర్వీసు రోడ్డు బాగాలేనందునే జీవీఎల అధికంగా ప్రమాదాలు 30 మంది ప్రాణాలు కోల్పోవడం వలనే ప్రజలు భయాందోళన చెంది ఫిర్యాదులు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ట్రాఫిక్ మళ్లించే సర్వీసు రోడ్డును బాగుచేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడటంతో పాటు, ప్రమాదాలను నివారించే దిశగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. అంతేకాకుండా ప్రయాణీకుల భద్రత దృష్ట్యా మండల కేంద్రంలో పాత ఆర్టీసీ కాంప్లెక్స్ స్థలంలో తాత్కాలిక బస్ షెల్టర్, పాత పోస్టాఫీస్ స్థలంలో మరొక బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని హైవే అధికారులకు కలెక్టర్, ఎస్పీ సూచించారు. బ్రిడ్జి నిర్మాణ పనుల్లో జాప్యం చేస్తే సహించేది లేదని, పనుల వేగవంతం చేయాలని హైవే అధికారులకు వారు సూచించారు. ఈ పరిశీలనలో శ్రీకాకుళం డీఎస్పీ సిహెచ్ వివేకానంద, హైవే పీడీ ప్రభాత్ రంజన్, సీఐ అవతారం, హైవే ఎస్‌ఈపీఎల్ రాధాకృష్ణ, తహశీల్దార్ ఎస్.కిరణ్ కుమార్, ఎండీఓ ఎం ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

## కోనలో వైభవంగా నృసింహుని కల్యాణోత్సవం

### రాబడి రూ.5,52,026లు



**రాపూరు (నెల్లూరు), జూలై 4, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెద్ద ఎత్తున శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో శనివారం ఆలయ ప్రాంగణం నిండిపోయింది. పెద్ద ఎత్తున భక్తులు కోనకు చేరుకొని తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొని స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున స్వామి వారి మూల మూర్తికి ప్రత్యేకంగా అభిషేకం,గోపూజ, పూలంగి సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వైభవంగా స్వామి వారి కళ్యాణాన్ని ఆలయఅర్చక స్వాములు, వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం, స్వామి వారికి భక్తులు సమర్పించిన 100 గొడుగులతో, గిరిజన వాయిద్యాల నడుమ వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతి సౌకర్యాలతో పాటు,క్యూలైన్లలో భక్తులకు మంచినీరు,మజ్జిగ పంపిణీ వంటి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్దన్ రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణ నిర్వహించారు. శనివారం స్వామి వారికి భక్తుల ద్వారా రూ.5,52,026 రాబడి వచ్చినట్లు ఆలయ ఉప కమిషనర్ కోవూరు జనార్దన్ రెడ్డి తెలిపారు. స్వామి నిత్య అన్నదానానికి విరాళల రూపేణా రూ. 1,40,681లు, శ్రీవారి అభిషేకం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.22,500 లు, నిత్య కళ్యాణం ద్వారా రూ39,000 లు ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.53,700 లు దేవస్థానం వసతి ద్వారా రూ.24,500 లు, తలనీలలు 1437 మంది సమర్పించగా తద్వారా రూ.57,400లు, లడ్డు ప్రసాదం విక్రయం ద్వారా రూ.1,82,520లు, పులిహోరా విక్రయం ద్వారా రూ.26,420 లు, వడ ప్రసాదం విక్రయం ద్వారా రూ.2,730లు, వాహనాల పూజల ద్వారా రూ. 2,575లు పోస్తున్న మొత్తం రూ.5,52,026 రాబడి వచ్చినట్లు జనార్దన్ రెడ్డితెలిపారు.



అల్లూరి చిత్రంపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తదితరులు


## 'అల్లూరి' ఆశయ సాధనకు కృషి చేయాలి

### భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అల్లూరి నామకరణంతో

### కూటమి ప్రభుత్వం గుర్తింపు: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం, జూలై 4, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ అల్లూరి ఆశయ సాధనకు కృషి చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయం నందు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం, బ్రిటిష్ వారిని తరిమికొట్టడం కోసం మన్యం వీరుడు అల్లూరి ప్రజలను చైతన్యపరిచిన మహనీయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం అల్లూరి కీర్తిని నిత్యం స్మరించుకునే విధంగా భోగాపురం ఎయిర్పోర్ట్‌కు నామకరణం చేయటం జరిగిందన్నారు. సొంత లాభం కొంత మానుకుని పొరుగువాడికి తోడుపడవోయ్" అనే మాటను నిజం చేస్తూ, మన్యం ప్రజల హక్కుల కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం తన రక్తాన్ని ధారపోసిన అల్లూరి సీతారామరాజు అమరత్వం ఎందరికో స్ఫూర్తిదాయకం అన్నారు. ఆయన జయంతి సందర్భంగా ఆ వీరుడి పోరాటాన్ని, త్యాగాన్ని స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. మన్యం ప్రజలను బ్రిటీష్ సైన్యం పెడుతున్న హింసలను చూడలేక, అల్లూరి 1924 మే 7న స్వయంగా తెల్ల దొరలకు లొంగిపోయి ప్రాణాలు త్యాగం చేసిన త్యాగశీలి అల్లూరి అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు కొండపల్లి భాస్కర నాయుడు, రంది చిన్న రాము నాయుడు, ఆకిరి ప్రసాద్, జనసేన నాయకులు మరాపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్కెయు వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన వైస్‌చాన్సలర్



**అనంతపురం, జులై 4 ప్రభాతవార్త బ్యూరో:** శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నూతన అధికారిక వెబ్‌సైట్‌ను వైస్‌చాన్సలర్ ఆచార్య ఎన్.వి.ఆర్. జ్యోతికుమార్ శనివారం విశ్వవిద్యాలయంలో ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయ డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందించాలనే లక్ష్యంతో రూపొందించిన ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తూ ఆయన మాట్లాడారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు, అనుబంధ కళాశాలలు, పూర్వ విద్యార్థులు, ప్రజలకు అవసరమైన సమాచారాన్ని ఒకే వేదికపై వేగంగా, సులభంగా అందుబాటులో ఉంచే విధంగా వెబ్‌సైట్‌ను ఆధునిక సాంకేతికతతో రూపొందించినట్లు వైస్‌చాన్సలర్ తెలిపారు. విశ్వవిద్యాలయ ప్రవేశాలు, పరీక్షలు, అకాడమిక్ కార్యక్రమాలు, పరిశోధన, నోటిఫికేషన్లు, పరిపాలనా సేవలు తదితర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటి కప్పుడు నవీకరిస్తూ అందుబాటులో ఉంచాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ వెబ్సైట్‌లో సోషల్ మీడియా లింక్‌లను ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్, యూట్యూబ్, కూడా పొందుపరిచారు. ఈ సందర్భంగా వెబ్‌సైట్ రూపకల్పనలో కృషి చేసిన సాంకేతిక బృందాన్ని వైస్‌చాన్సలర్ అభినందించారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయ అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆప్కో.. ఓ బలమైన సహకార ఉద్యమం

### రేపు సంస్థ స్వర్ణోత్సవాలు

### చేనేత సంరక్షణలో వేలాది నేతకుటుంబాలకు భరోసా

**విజయవాడ, జూలై 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ చేనేత పారిశ్రామికుల సహకార సంఘం (ఆప్కో) జూలై 6న స్వర్ణోత్సవాన్ని జరుపుకో నుంది. ఇది కేవలం ఒక ప్రభుత్వ సంస్థగా అర్ధ శతాబ్దం వేడుక మాత్రమే కాదు.. రాష్ట్ర చేనేత సంప్రదాయాన్ని కాపాడుతూ, వేలాది నేత కుటుంబాలకు ఉపాధి, ఆర్థిక భరోసా కల్పించిన ఐదు దశాబ్దాల ప్రయాణానికి గుర్తుగా నిలిచే చారిత్రక సం దర్భం.1976 జూలై 6న హైకో ఫ్యాబ్రిక్స్, రాయా ఫ్యాబ్రిక్స్, ఆంధ్ర హ్యాండ్లూమ్స్ అనే మూడు ప్రాంతీయ సంస్థలను విలీనం చేసి ఆప్కోను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక చేనేత సహకార సంఘాల ద్వారా తయారయ్యే ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం, నేతలకు నిరంతర ఉపాధి కల్పించడం, వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం, సంప్రదాయ చేనేత కళను పరిరక్షించడం ప్రధాన లక్ష్యంగా ఆప్కో కొనసాగుతోంది.ఐదు దశాబ్దాల కాలంలో ఆప్కో దేశంలోనే ప్రముఖ చేనేత మార్కెటింగ్ సంస్థగా ఎదిగింది. ప్రస్తుతం రాష్ట్రంలోని వెయ్యికి పైగా ప్రాథమిక చేనేత సహకార సంఘాల ఉత్పత్తులను సేకరించి దేశవ్యాప్తంగా సుమారు 80 విక్రయకేంద్రాల ద్వారా వినియోగదారులకు అందిస్తోంది. కాలానుగుణంగా ఈకామర్స్, డిజిటల్ మార్కెటింగ్‌నుకూడా అందిపుచ్చుకుని ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు చేరువయ్యింది.

**చంద్రబాబు నాయకత్వంలో చేనేతకు కొత్త ప్రోత్సాహం:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి కొత్త ఊపునిస్తోంది. నేతన్నల ఆదాయం పెంచడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, సంప్రదాయ చేనేతకు మార్కెట్ విస్తరించడం లక్ష్యంగా పలు నిర్ణయాలు తీసుకుంది. ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించింది. 2025లో ఆప్కో బ్లీచింగ్, డైయింగ్ చార్జీలను గణనీయంగా పెంచింది. బెడ్‌షీట్లు, టవళ్లను నేసే చేనేత కార్మికుల రోజువారీ కూలీలను కూడా పెంచింది. ఈ మార్పుల వల్ల ఒక్కో నేతకు రోజుకు సగటున రూ.108 అదనపు ఆదాయం లభిస్తోంది. ఐదు దశాబ్దాలుగా వేలాది నేత కుటుంబాలకు అండగా నిలుస్తూ, సంప్రదాయాన్ని సజీవంగా ఉంచుతూ, చేనేతకు మార్కెట్ కల్పిస్తూ సాగుతున్న ఆప్కో ప్రయాణం ఆంధ్రప్రదేశ్ చేనేతచరిత్రలో ఒక స్ఫూర్తిదాయక అధ్యాయంగా నిలిచిపోయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సహకార సంఘం (ఆప్కో) స్వర్ణోత్సవ వేడుకలు సోమవారం సాయంత్రం 4 గంటలకు గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని ఎర్రబాలెంలోని ఆప్కో సముదాయంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, హెచ్‌ఆర్‌డీ, ఎలక్ట్రానిక్స్ రియల్ టైమ్‌గవర్నెన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక ముఖ్యఅతిథిగా, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ముఖ్య అతిథిగా హాజరవుతారు. రాష్ట్ర ప్రభుత్వ చేనేత-హస్తకళల అభివృద్ధి గౌరవ సలహాదారు డాక్టర్ సుచిత్ర ఎల్లా, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. సిసోడియా, చేనేత జౌళిశాఖ కమిషనర్ జి. రేఖారాణి, సంస్థ వైస్‌చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కె. కన్నబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

# అక్రమ లేఅవుట్‌లకు గ్రావెల్ తరలింపు: ఆర్ఐ ఆకస్మిక తనిఖీ

### మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతులు లేవన్న ఆర్ఐ



**అనుమసముద్రంపేట (నెల్లూరు), జులై 4, ప్రభాతవార్త :** ఏఎస్‌పేట మండలంలోని సర్వే నెంబర్లు 144/38, 144/3సి, 145/1ఎ, 145/2లో జరుగుతున్న లే అవుట్ అభివృద్ధి పనులకు ఎలాంటి రెవెన్యూ, మైనింగ్ శాఖల అనుమతులు లేకుండానే భారీ ఎత్తున గ్రావెల్ తరలిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.ఈ నేపథ్యంలో శనివారం మైన్స్ శాఖ ఆర్ఐ సి.హెచ్.స్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు.స్థానిక విఆర్ఒ కృష్ణప్రసాద్‌ను వెంట తీసుకొని లే అవుట్ ప్రాంతాన్ని పరిశీలించిన ఆర్ఐ అక్కడ సుమారు 35 టిప్పర్ల మేర చదును చేయకుండా నిల్వ ఉంచిన గ్రావెల్‌ను పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా ఇదే లే అవుట్‌కు గతంలో నక్కలవాగు, అనంతరం ప్రవేటు వ్యవసాయ భూముల నుంచి మట్టి గ్రావెల్ తరలింపుపై ఫిరానయదులు రావడంతో అధికారులు తనిఖీలు నిర్వహించి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆ తర్వాత నాలుగురోజులపాటు రవాణా నిలిచిపోయినప్పటికీ గత మూడు రోజులుగా మళ్ళీ భారీ టిప్పర్లతో గ్రావెల్ తరలింపు కొనసాగుతుండడంతో మైన్స్ శాఖ ఈ ఆకస్మిక తనిఖీ చేపట్టింది. గ్రావెల్ తరలింపుదారులు ఎఎంఆర్ సంస్థ నుంచి అనుమతి తీసుకున్నామని చెబుతున్నప్పటికీ మైనింగ్ శాఖ, రెవెన్యూ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని మైన్స్ ఆర్ఐ సి.హెచ్.స్వామి స్పష్టం చేశారు. అలాగే ఈ లే అవుట్ అభివృద్ధి పనులకు సంబంధిత శాఖల అనుమతులున్నాయా లేదా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సర్వే నెంబర్లు 144/3బి, 144/3సి, 145/1ఎ, 145/2లో జరుగుతున్న లే అవుట్ అభివృద్ధి పనులకు సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని కూడా అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. భారీ టిప్పర్లు ఏఎస్‌పేట ప్రధాన బజార్ మీదుగా జనావాసాల మధ్య నిరంతరం రాకపోకలు సాగిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు స్థానికులు పోలీసుల సహకారంతోనే టిప్పర్లు వెళుతున్నారని ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై పోలీసు శాఖ నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. ఈ వ్యవహారంలో స్థానికంగా రాజకీయ ప్రత్యర్థులుగా భావించే టిడిపి , వైసిపి నాయకులు ఈ లేఅవుట్ లో ఇరు పార్టీలకు చెందిన కొందరు నాయకులు, భాగస్వాములుగా ఉన్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. మైన్స్ ఆర్ఐ నిర్వహించిన తాజా తనిఖీతో ఈ వ్యవహారం మరోసారి ప్రాధాన్యత సంతరిం చుకుంది. తనిఖీ అనంతరం మైనింగ్ శాఖ, రెవెన్యూ శాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటా యనే అంశంపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, మైనింగ్, రెవెన్యూ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ శాఖలు సమగ్ర విచారణ చేపట్టి, లే అవుట్ అనుమతులు, గ్రావెల్ తవ్వకం, రవాణాకు సంబంధించిన అనుమతుల వివరాలను బహిర్గతం చేసి నిబంధనల ఉల్లంఘనలు జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# పునాది వేసేటప్పుడు లేని ఆక్రోశం ఇప్పుడెందుకు?



**విజయనగరం, జూలై 4 ప్రభాతవార్త:** ప్రత్యక్షంగా ప్రైవేటు స్థలంలో పాగా వేస్తున్నారని తెలిసి ఉదాసీనతలో ఉండి అధికారం వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన తరువాత ఆ భవనం ఉన్న స్థలంమాది అని అశోక్ గజపతిరాజు తీరిగ్గా కోర్టును ఆశ్రయించడంతో విజయనగరంలో హాట్ టాక్‌గా మారింది. ఈ వివాదం సీఎం చంద్రబాబు నాయుడు వరకు వెళ్లింది. అయిన రోజురోజుకి వైసిపి టిడిపి వాగ్వివాదం జఠిలంగా మారుతుంది. జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీల మధ్య దశాబ్దాల తరబడి అవగాహన రాజకీయాలు నడుస్తున్నాయని ఓ పెద్ద ఆరోపణ ఎప్పటి నుంచో రాజ్యమేలుతోంది. ఆ తరహా అవగాహన రాజకీయం తాజాగా బెడిసి కొట్టిందేమోనని సామాన్యుల మధ్య గుసగుసలు జోరందుకోవడం గమనార్హం. వైసీపీ అధినేత జగన్ దగ్గర నుంచి చోటా మోటా నాయకులు వరకు ప్రతీ రోజూ కూటమి ప్రభుత్వాన్ని ఏకి పారేస్తుంటే. కూటమి పాలకులు, ఆ పార్టీల శ్రేణులు చేష్టలుడిగి చూస్తున్నారే తప్ప వైసీపీ దూకుడుకు ఎందుకు కళ్లెం వేయలేకపోతున్నారన్నది వేయిమిలియన్ల ప్రశ్న. టీడీపీలో ఒకప్పుడు రాజాధిరాజు స్థాయిలోనే మెలిగిన అశోక్‌కు భూమి కష్టాలు వస్తే ప్రభుత్వం స్పందన అంత పేలవంగా ఉండడానికి కారణం ఏమిటి? అవినీతి కార్యాలపాలకు ఆమడ దూరంలో ఉండే అశోక్ చట్ట నిబంధనలకు పక్కాగా కట్టుబడి ఉంటారన్నది ప్రతీతి. పైగా రాజ్యాంగ బద్ధమైన రాష్ట్ర గవర్నర్ హోదాలో ప్రస్తుతం కొనసాగుతున్నారు. అలాంటి కీలక వ్యక్తి ఓ సామాన్య వ్యక్తి మాదిరిగా తన హక్కు భుక్తమైన భూమి కోసం ఇంత దీనంగా పోరాటం చేయడం వెనుక కిటుకు, మతలబు ఏమిటి? ఈ హక్కు ను అశోక్ సకాలంలో గుర్తించలేకపో యారా? అధికారులు మీనమేషాలు లెక్కించారా? పెద్దా యన దృష్టిలో నేరుగా ఈ అంశాన్ని తీసుకెళ్ల లేదా?తీసుకెళ్లితే ఎటువంటి శషబిషలు లేకుండా చట్టపరమైన స్పష్టమైన ఆదేశాలు ఎందుకు వెలువడలేదు? ఈ స్టార్ వార్‌కి ఎలా ముగింపు పలుకుతారు.

**కోర్టు ఆదేశాల కోసం వదిలేస్తారా:** విజయనగరం రాజుల ఆస్తులు ఆస్తులు ఎన్నో అన్యాక్రాంతమైన ఒక చిన్న స్థలం గురించి పెద్దాయన ఆగ్రహంతో ఊగిసలాడుతున్నారు. అది పక్కాగా ఆయన ఆస్తి కాకపోతే చిరు ఆస్తికోసం పెదవి విప్పరనే ఆలోచన లేకపోలేదు. ఇంత జరిగిన వైయస్సార్సీపి వేసిన పాగాను ఇట్టే తొలగించే అధికారం ఉన్న గత ప్రభుత్వం ప్రజా భవనాన్ని గూర్చి ప్రజల ఆగ్రహానికి గురై ఆ నిందతో వైయస్సార్ ప్రభుత్వం కూలిపోయింది. ఉన్నత ఆలోచనతో చట్టపరంగా తన ఆస్తి తనకు వచ్చేవరకు పోరాటం సాగిస్తున్నారన్నది సత్యం.

## ఎపి సంచార విముక్త జాతుల రాష్ట్ర కన్వీనర్‌గా తాళ్ళూరి ఏకగ్రీవ ఎన్నిక



**జగ్గయ్యపేట, జూలై 4, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రాంత సీనియర్ బిసి నేత, చిల్లకల్లు గ్రామానికి చెందిన తాళ్ళూరి వెంకటేశ్వర్లు ఆంధ్రప్రదేశ్ సంచార విముక్త జాతుల (డిఎన్‌టి) రాష్ట్ర కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. అమరావతి రాజధానిలోని ఉండవల్లి అంబేద్కర్ భవన్‌లో జాతీయ డిఎన్‌టి కన్వీనర్ ఎం సుబ్బారావు అధ్యక్షతన ఇటీవల జరిగిన ఏపిలోని 32 సంచార విముక్త జాతుల ప్రతినిధుల సమావేశంలో ఈమేరకు తీర్మానిస్తూ తాళ్ళూరి ఎన్నికతోపాటు 11 సంచార విముక్త జాతులకు చెందిన నాయకులను కో-కన్వీనర్లుగా నియమిస్తూ ప్రకటించారు. ఈసందర్భంగా తాళ్ళూరి మాట్లాడుతూ శక్తివంచన లేకుండా తన వంతు కర్తవ్యాన్ని ఆదర్శవంతంగా అందిస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. కాగా పలువురు సంచార విముక్త జాతుల నాయకులు తాళ్ళూరిని అభినందించారు.

# రేపటి నుంచి ప్రధాని 3దేశాల పర్యటన

### ఆస్ట్రేలియా వస్తే చంపేస్తామంటూ బెదరింపులు: నిఘా సంస్థలు వెల్లడి



**న్యూఢిల్లీ,జులై 4:** ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో పర్యటించనున్నారు.ఈ 3 దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా మోడీ ఈ పర్యటన చేయనున్నారని విదేశాంగ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ మొదట ఇండోనేషియాను సందర్శిస్తారు. ఆ తర్వాత ఆస్ట్రేలియాకు ప్రయాణమవుతారు. అక్కడ ఆయన ప్రధాన అధికారిక కార్యక్రమాలు మెల్‌బోర్న్‌లో జరుగుతాయి. అనంతరం న్యూజిలాండ్ పర్యటనతో మోడీ తన విదేశీ పర్యటనలను ముగిస్తారని ఎంఈఏ కార్యదర్శి రుద్రేంద్ర టాండన్ తెలిపారు. దాదాపు 40 సంవత్సరాల తర్వాత ఒక భారత ప్రధాన మంత్రి ఆ దేశంలో పర్యటించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. వచ్చేవారం ప్రధాని మోడీ న్యూజిలాండ్ లో తన మొదటి అధికారిక పర్యటన చేయనున్నట్లు ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ శనివారం అధికారికంగా ప్రకటించారు. "భారత ప్రధాని నరేంద్ర మోడీ వచ్చే వారం న్యూజిలాండ్‌లో తన మొదటి అధికారిక పర్యటన చేయనున్నారని ప్రకటించడానికి నేను ఎంతో సంతోషిస్తున్నాను" అని లక్సన్ తన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అయితే ఈ పర్యటన గురించి కచ్చితమైన తేదీలను ఆయన వెల్లడించలేదు.ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశం ఒకటి అని కొనియాడిన లక్సన్ , న్యూజిలాండ్ ఆర్థిక శ్రేయస్సుకు భారత్ ఎంతో కీలకమైనదని స్పష్టం చేశారు. ఏప్రిల్‌లో కుదిరిన న్యూజిలాండ్ ఇండియా ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ ద్వారా ఇరుదేశాల మధ్య సంబంధాలను మేము తదుపరి స్థాయికి తీసుకెళ్తున్నాం. ఇది న్యూజిలాండ్ కు మరిన్ని ఉద్యోగాలను, అధిక ఎగుమతులను, బలమైన ఆర్థిక వృద్ధిని అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఒప్పందం కొత్త అవకాశాలను తెరుస్తుందని, న్యూజిలాండ్ వస్తు, సేవలకు 1.4 బిలియన్ల (140 కోట్ల) జనాభా కలిగిన భారీ మార్కెట్ ను అందుబాటులోకి తెస్తుందని లక్సన్ అన్నారు. ఇది కివీస్ సమాజంలోకి మరింత ఆదాయాన్ని తీసుకువస్తుందని,కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని, వేతనాలను పెంచుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, న్యూజిలాండ్ ల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంపొందించడానికి, పెట్టుబడులను ప్రోత్సహించడానికి ఈ సంవత్సరం ప్రారంభంలోనే భారత్, న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై సంతకాలు చేశాయి. ఇండోనేషియా పర్యటన నివేదికల ప్రకారం, భారతదేశంలో ప్రజల జీవితాలను, జీవనోపాధిని మార్చడంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) సాధించిన విజయాన్ని చూసి, ఆ రంగంలో భారత్ తో భాగస్వామ్యం పట్ల ఇండోనేషియా చాలా ఆసక్తి కనబరుస్తోంది. ఇందులో భాగంగానే, 2026 జూన్ 7న ఢిల్లీలో 8వ ఇండియాఇండోనేషియా జాయింట్ కమిషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి భారత విదేశాంగ మంత్రి (ఈఏఎం) ఎస్.జైశంకర్, ఇండోనేషియా విదేశాంగ మంత్రి సుగియోనో సంయుక్తంగా అధ్యక్షత వహించారు.

**ఆస్ట్రేలియా పర్యటన:** ఇక మోదీ తన ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా, ఇరుదేశాల మధ్య ఉన్న సన్నిహిత వ్యూహాత్మక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ తో ప్రధాని మోడీ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఇటీవలే గతనెల 26న ఢిల్లీలో జరిగిన ఫారిన్ మినిస్టర్స్ ఫ్రేమ్ వర్క్ డైలాగ్ సందర్భంగా విదేశాంగ మంత్రి జైశంకర్ తన ఆస్ట్రేలియా కౌంటర్ పార్ట్ పెన్నీ వాంగ్ తో సమావేశం కావడం గమనార్హం. ఈ పర్యటనలో అత్యంత ముఖ్యమైన ఘట్టంగా ఈనెల 9న మెల్ బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరగనున్న మెల్‌బోర్న్ మీట్స్ మోడీ అనే భారీ కమ్యూనిటీ ఈవెంట్‌లో ప్రధాని ప్రసంగించనున్నారు. ఆస్ట్రేలియా ఇండియా ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం, విక్టోరియా రాష్ట్ర చరిత్రలోనే భారత్ ఆస్ట్రేలియా కమ్యూనిటీల మధ్య జరిగిన అతిపెద్ద సమ్మేళనాలలో ఒకటిగా నిలుస్తుందని అంచనా.


**ఆస్ట్రేలియా వస్తే చంపేస్తామంటూ మోడీకి బెదరింపులు:** ఇదిలా ఉంటే మోడీ విదేశీ పర్యటనకు ముందే ఆయనకు బెదిరింపులు ఎదురయ్యాయి. ఫేస్‌బుక్ పోస్టులో బెదిరింపులు వచ్చినట్లు దర్యాప్తు ఏజెన్సీలు నిర్ధారించాయి. ఆస్ట్రేలియా వస్తే చంపేస్తామంటూ ప్రధానిమోడీకి బెదిరింపులు వచ్చినట్లు దర్యాప్తు ఏజెన్సీలకు సమాచారం అందడంతో వెంటనే అలర్ట్ అయ్యాయి. ప్రధాని మోడీ ఆస్ట్రేలియా పర్యటనకు ముందు బెదిరింపులు తీవ్ర కలకలం రేపుతున్నాయి. మోడీని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో హత్య బెదిరింపు రావడంతో ఆస్ట్రేలియా అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బెదిరింపు సందేశం పోస్టు చేసిన వ్యక్తికి సంబంధించిన ఐపీ అడ్రస్‌ను గుర్తించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ప్రధాని మోడీ జూలై 8 నుంచి 10 వరకు మెల్‌బోర్న్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు.

**ఫేస్‌బుక్‌లో బెదిరింపు సందేశం:** స్థానిక మీడియా కథనం ప్రకారం జూలై 9న మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరగనున్న మెల్‌బోర్న్ మీట్స్ మోడీ కార్యక్రమానికి సంబంధించిన ఫేస్‌బుక్ పోస్టు కింద అబు ముస్తఫా పేరుతో ఉన్న ఖాతా నుంచి బెదిరింపు వ్యాఖ్య పోస్ట్ చేశారు. ఈ వ్యాఖ్యలో కార్యక్రమం జరిగే సమయంలో స్టేడియం పైకప్పు మూసి ఉంచడం మంచిది. లేకపోతే ఆయన ఆస్ట్రేలియాకు తన మరణం కోసం వస్తారు. అంటూ హెచ్చరిక చేశారు. ఈ బెదిరింపు పోస్టుకు సంబంధించిన ఐపీ అడ్రస్‌ను పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఇది క్రిమినల్ నేరం కిందకు వస్తుందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేసినట్లు ఆస్ట్రేలియన్ ఫెడరల్ పోలీస్ అధికారికంగా ప్రకటించలేదు. దర్యాప్తు కొనసాగుతున్నందున మరిన్ని వివరాలను వెల్లడించలేమని పేర్కొంది.

## వేదాద్రి శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయం

# ప్రసాదాల తయారీ పోటులో కునారిల్లుతున్న పారిశుద్ధ్యం

**జగ్గయ్యపేట, జూలై 4, ప్రభాతవార్త :** పంచనారసింహ క్షేత్రాల్లో విశిష్టమైన, కృతయుగం నుండి కూడా భక్తులకు దర్శనం అందించే అతి ప్రాచీన శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రసాదాల తయారీలో నెలకున్న నిర్లక్ష్యం పట్ల భక్తులు మండిపడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండల పరిధిలోని వేదాద్రి గ్రామంలో పవిత్ర కృష్ణానది తీరంలో అలరారుతున్న శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం అత్యంత విశిష్టమైనది. మంత్రులుగాని, జడ్జీలతోపాటు ప్రభుత్వంలోని పలుశాఖల ఉన్నతాధికారులు గాని, వివిపిలుగా తప్పనిసరిగా వేదాద్రి క్షేత్రాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుని వెళ్తుంటారు. ఈక్షేత్రానికి వంశపారంపర్య ధర్మకర్తలుగా పూర్వ ముక్త్యాల జమిందారి పాలకులు, నేటి కెసిపి సిమెంట్స్ అధినేతలు భక్తి ప్రపత్తులతో ఆలయ ఉత్సవాలు వేడుకల్లో భాగస్వాములవుతుంటారు. అయితే లడ్డూ ప్రసాదాల తయారీకి ఉపయోగించాల్సిన గ్రేడ్-1 వస్తువులకు బదులు నాశిరకం వస్తువులే మనకు ఇక్కడ దర్శనమిస్తున్నాయి. లడ్డూ ప్రసాదాల తయారీ ప్రాంతంలో పరిశుభ్రత లోపించటమే కాకుండా కనీస నిబంధనలు కూడా పాటించకుండా చేతులకు గ్లౌజులు, తలకు పాలిథిన్ క్యాప్స్ వంటివి





లడ్డూలు తయారుచేసే పోటు గదుల్లోని దుస్థితి. పరిశుభ్రత లేని గదులు.

వినియోనించకపోవటం భక్తులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. తయారయిన లడ్డూలను ఫ్లోర్‌పైనే కుప్పలుగా పోసి ఆరబోస్తుండటం, ఈగలు, చీమలు చేరుతున్న దృశ్యాలు వికారాన్ని కలిగిస్తున్నాయని భక్తులు అంటున్నారు. పోటు వంశశాలలోకి వెళ్ళటంతోనే భరించలేని దుర్గంధం ఇరిటేషన్ కలిగిసు ్తందని భక్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. స్వామివారి ఆలయ ప్రాంగణంలోని అద్దెదుకాణాల ద్వారా, భక్తుల ద్వారా భారీ మొత్తంలో ఆదాయం లభిస్తున్నప్పటికీ నాణ్యత, సరైన తూకం, పరిశుభ్రత పాటించని లడ్డూలను స్వామివారికి నివేదించటం, భక్తులకు లడ్డూ రూ.15ల వంతున అమ్మకాలు చేయటం ఇక్కడ కొనసాగుతోంది. జరుగుతున్న నిర్లక్ష్యం, వచ్చిన ఆరోపణల గురించి స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)కు కూడా ఫిర్యాదులు అందాయి. రాజగోపాల్ మీడియాతో మాట్లాడుతూ స్వామివారి ఆలయంలో ఇలాంటి నిర్లక్ష్య ధోరణి సరికాదని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. ఆడిట్ నివేదికలను పరిశీలించటంతోపాటు ఆలయ ఆదాయ, వ్యయాలపై కూడా విజిలెన్స్, ఏసిబి వంటి సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో విచారణ జరిపించాలని భక్తులు కోరుతున్నారు. ఆలయ ప్రతిష్టను భంగపరుస్తున్న వారిపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారపార్టీ సహకారం, సామాజిక వర్గాల సపోర్టు వంటి బలాల ధీమాతోనే సంబంధిత యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలకు బలం చేకూరుతోంది.

# దేశ ఆర్థిక క్రమశిక్షణకు రోశయ్య ప్రణాళికలే ఆదర్శం

### రోశయ్య 93వ జయంతి వేడుకలో తెలంగాణ కార్మిక మంత్రి గడ్డం వివేక్

### రోశయ్య జీవితం తెరిచిన పుస్తకం : తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జులై 4, ప్రభాతవార్త :** కొణిజేటి రోశయ్య సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థికశాఖ మంత్రిగా అత్యధికసార్లు బడ్జెట్ రూపకల్పన చేసి రాష్ట్ర ఆర్థిక క్రమశిక్షణతో వ్యవస్థను విజయవంతంగా నడిపించి దేశానికి ఆదర్శంగా నిలిచారని తెలంగాణ రాష్ట్ర కార్మిక ఉపాధి శిక్షణ గనులశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో రోశయ్య 93వ జయంతి సభ అధికారికంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జి.వివేక్ ఇతర అతిథులతో కలిసి రోశయ్య చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతిప్రకాసనంచేసి ఘననివాళులర్పించి, ప్రముఖ ప్రవచనకర్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత, ఆధ్యాత్మికవేత్త డా. గరికిపాటి నరసింహారావు దంపతులను ఘనంగా సత్కరించి ప్రసంగించారు. విలువలతో కూడిన రాజకీయవేత్తగా ఎన్నో పదవులు హుందాగా నిర్వహించిన రోశయ్య




గరికిపాటి నరసింహారావు దంపతులను ఘనంగా సత్కరిస్తున్న వివేక్, ప్రభాకర్, మహేష్‌కుమార్‌గౌడ్, టి.జి.వెంకటేష్, దామోదర్‌గుప్తా, శ్రీనివాసగుప్తా, దైవజ్ఞశర్మ, ఎ.నరసింహారెడ్డి, లక్ష్మీనారాయణ, వాణీప్రసాద్ తదితరులు

రాజకీయ నాయకులందరికీ రోల్‌మోడల్ అన్నారు. తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు రోశయ్య ప్రతిపక్ష నాయకుడుగా బడ్జెట్‌లో ఉన్న అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన ప్రశ్నలు, సలహాలు అందించేవారని చెప్పారు. రాష్ట్ర ఆర్థికమంత్రిగా రాష్ట్రాన్ని అభ్యుదయమార్గంలో పయనింపజేస్తూ అవసరమైన సంక్షేమపథకాలను సక్రమంగా అందిస్తూ ముందుకు నడిపించారన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం గురించి కొట్లాడినప్పుడు ఇరురాష్ట్రాల భవిష్యత్తు ఆలోచించడమని ఉద్బోధించే వారని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారం, ఉపయోగం కోసం అర్ధరాత్రి కూడా సెక్రటేరియట్‌లో ఉండి ఫైల్స్ క్లియర్ చేసేవారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర రోడ్లు,రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థి రాజకీయాల్లో ఎన్ఎస్‌యుఐ నాయకుడిగా ఉన్ననాటి నుండి యువకుడిగా ఆయనతో సన్నిహితంగా అనేక సందర్భాల్లో ఎన్నో విషయాలు చర్చించే విషయంలో, రాజకీయ అవగాహన చేసుకోవడంలో కొణిజేటి రోశయ్యకు ఏకలవ్య శిష్యుడుగా నేర్చుకున్నానని, అలాగే ఆర్థికంగా క్రమశిక్షణ ఉంటే కుటుంబానికి, వ్యక్తులకే కాదు రాష్ట్రానికి, దేశంలో ఆర్థికశాఖ మంత్రులకు, ఆర్థిక వ్యవహారాలు చూసే ప్రతీ ఒక్కరికీ రోశయ్య జీవితం ఒక తెరిచిన పుస్తకం, మార్గదర్శకత్వమని స్పష్టం చేశారు.

అనంతరం రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు కోలేటి దామోదర్‌గుప్తా ప్రసంగించారు. ఉప్పల శ్రీనివాసగుప్తా మాట్లాడుతూ 14సార్లు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టి ఆర్థిక వ్యవస్థకే వన్నెతీసుకొచ్చి దేశంలోనే ఎన్నో ముఖ్యరాజకీయ పదవులు అలంకరించి ఏమంత్రి చేయలేని పనిని రోశయ్య చేశారన్నారు. ఎదిగేకొద్దీ ఒదిగుండాలని తదితర ఆశయాలు కొనసాగిస్తే అత్యున్నతస్థాయికి చేరుకుంటామని స్పష్టం చేశారు. అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ రోశయ్య జయంతి వర్ధంతులను అధికారికంగా జరుపుతున్నా మనవంతుగా తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో కెఎస్ఆర్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్‌ను ఈ సంవత్సరమే ఏర్పాటు చేశామని, దానిద్వారా ప్రతీ సంవత్సరం మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని నిర్ణయిచుకోగా ఈ సంవత్సరం 200మంది విద్యార్థులకు ఈరోజు ఇదే వేదిక నుండి అందజేస్తున్నట్లు ప్రకటించారు. చివరిగా మంత్రులు జి.వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్‌లు, బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే వినోద్, ఎ.వాణీప్రసాద్, కెవిపి.రామచందర్‌రావు, టి.జి.వెంకటేష్, కోలేటి దామోదర్‌గుప్తా, అమరవాది లక్ష్మీనారాయణ, కాల్వ సుజాత, గణేష్‌గుప్తా, కె.మల్లికార్జున్, కొణిజేటి శివసుబ్బారావు, డా. ఏనుగు నరసింహారెడ్డి, దైవజ్ఞశర్మ తదితరులు కెఎస్ఆర్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ లోగోను ఆవిష్కరించి, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు.



# వీహెచ్‌ను పరామర్శించిన మాజీ గవర్నర్ దత్తాత్రేయ

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** సోమాజిగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీనియర్ కాం గ్రెస్ నేత, రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమ శాఖ సలహా దారులు వి.హనుమంత రావును శనివారం మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శించినారు. ఆస్పత్రిలోని వైద్యనిపుణులతో మాట్లాడి విహెచ్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకొన్నారు. దత్తాత్రేయ విహెచ్‌తో మాట్లాడుతూ త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు.

# దోస్త్ ద్వారా 1,17,658 మంది డిగ్రీలో చేరిక

### నాన్‌దోస్త్ కాలేజీల్లో చేరిన 21,034 మంది

### డిగ్రీ మొదటి సంవత్సరంలో 1,38,692 మంది

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2026 ద్వారా మూడో విడత ముగిసేనాటికి 1,17,658 మంది కాలేజీల్లో చేరారు. ఇప్పటికే రెండు విడతల్లో కేటాయింపులు చేయగా.. జూన్ 25న మూడో విడత కేటాయింపు చేశారు. మూడో విడత కేటాయింపు సందర్భంగా కాలేజీల్లో చేరడానికి ఈ నెల 4(శనివారం) వరకు అవకాశం కల్పించారు. గత రెండు విడతల్లో సీటు పొందిన విద్యార్థులు కూడా ఈ నెల 4లోపుగా కాలేజీల్లో చేరాలని దోస్త్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం వరకు రాష్ట్రంలో దోస్త్ ద్వారా 1,17,658 మంది కాలేజీల్లో చేరినట్టు తెలిసింది. నాన్ దోస్త్ కాలేజీల్లో 21,034 మంది చేరారు. మొత్తంగా 2026- 27 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో 1,38,692 మంది చేరారు.

# పోలీసు ఉద్యోగాల భర్తీల్లో టిజిఎస్‌పికి మొండి చెయ్యి

### తొలిసారిగా ఒక్క కానిస్టేబుల్ పోస్టు కూడా భర్తీకాని వైనం

### సివిల్, ఎఆర్ విభాగాల్లో గ్రేటర్ పరిధిలోని కమిషనరేట్లకే ప్రాధాన్యత

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఐదు వేల పోలీసు ఉద్యోగాల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌లో తెలంగాణ స్పెషల్ పోలీసు విభాగా నికి కానిస్టేబుళ్ల కేటగిరిలో మొండి చెయ్యి ఎదుర య్యింది. మొత్తం ఐదు వేల పోస్టుల భర్తీలో అధికారుల కేడర్‌లో సివిల్ ఎస్ఐలు 148, సాయుధ బలగం ఎస్ఐలు 14, టిజిఎస్‌పి ఎస్ఐలు 12, అంబర్‌పేట్‌లోని ప్రత్యేక సాయుధ బలగం సెంట్రల్ పోలీసు లైన్స్ (సిపిఎల్ ) ఎస్ఐలు మూడు వుండగా ఫింగర్ ప్రింట్ బ్యూరోలో 23 ఏఎస్ఐ పోస్టులు వున్నాయి. ఇక క్షేత్రస్థాయిలో కీలకంగా వుండే కానిస్టేబుల్ పోస్టుల్లో సివిల్ విభాగంలో 3697 వుండగా సాయుధ బలగంలో 1052 వున్నాయి. దీని తరువాత సిపిఎల్‌లో 24, పోలీసు రవాణా శాఖలో డ్రైవ ర్ పోస్టులు 20, మెకానిక్ పోస్టులు ఏడు వున్నాయి. పోలీసు శాఖలో ఎప్పుడు భర్తీలు జరిగినా కానిస్టేబుల్ కేటగిరిలో 40 శాతం అంతకు పై గా టిజిఎస్‌పికి కేటాయించడం ఆనవాయితీగా వస్తోంది. దీని తరువాత సివిల్ విభాగం ఆ తరువాత సాయుధ బలగం విభాగాలకు కేటాయిం పులు వుండేవి. స్పెషల్ పోలీసు బెటాలియన్లలో కానిస్టేబుళ్ల కొరత తీవ్రంగా వుండడం గమనార్హం. ఈ విభాగంలో గల అన్ని బెటాలియన్లలో క లిపి మూడు వేలకు పైగా పోస్టులు ఖాళీగా వున్నాయని తెలిసింది. అయితే తాజా నోటిఫికేషన్‌లో ఈ విభాగానికి ఎస్ఐ కేడర్‌లో 12 పోస్టులు మాత్రం కేటాయించి కానిస్టేబుల్ పోస్టుల్లో ఎలాంటి కేటాయింపులు చేయలేదు. ఇలా ఎందుకు జరిగిందనే దానిపై అధికారుల నుంచి స్పష్టత కొరవడింది. టిజిఎస్‌పి నుంచి ఖాళీలకు సంబంధించి నివేదిక పోలీసు నియామక మండలితో పాటు సర్కారు వద్ద వుండడం గమనార్హం.


అయి నప్పటికీ కేటాయింపుల్లో కానిస్టేబుల్ పోస్టుల విషయంలో ప్రాధాన్యత ఇవ్వలేదు. ఇలా జరగడం ఇదే తొలిసారిగా టిజిఎస్‌పి విభాగం అధికా రులు చెబుతున్నారు. ఇక సివిల్ కానిస్టేబుళ్ల పోస్టుల విషయానికి వస్తే ఖాళీల సంఖ్య 15 వేలకు పైగా వుండగా భర్తీలు 3697 మాత్రమే చే బడుతున్నారు. మిగతా పోస్టుల భర్తీ ఎప్పుడన్నదీ తెలియరావడం లేదు. ఈ భర్తీల్లో రెండు వేల పోస్టులు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లకు కేటాయించనున్నట్లు తెలిసింది. హైదరాబాద్‌లో కానిస్టేబుల్ పోస్టులు మూడు వేలకు పై గా ఖాళీగా వుండగా మిగతా మూడు కమిషనరేట్లలో 1500 పైగా వున్నట్లు సమాచారం.

అంటే ఈ నాలుగు కమిషనరేట్లలో కూడా పూర్తిస్థా యిలో భర్తీలు జరగడం లేదన్న మాట. ఇక సాయుధ బలగంలో భర్తీ కానున్న 1052 పోస్టుల్లోనూ 700 పైబడి పోస్టులు హైదరాబాద్, సైబ రాబాద్, మల్కా జిగిరి, కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లకు కేటాయించనున్నటు సమాచారం. ఈ లెక్కన అటు సివిల్, ఇటు సాయుధ బలగంలో జరగనున్న భర్తీలలో రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు అరకొరగానే వుండనున్నాయని చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జి ల్లాలలో వున్న ఖాళీలను 70 శాతం భర్తీ చేయాలంటే 20 వేల పోస్టులయినా రిక్రూట్ చేయాలని అధికారులు చెబుతున్నారు. నిరుద్యోగ ులు కూడా దీనినే డిమాండ్ చేస్తున్నారు. అయితే పోలీసు శాఖ మలివిడత భర్తీ చేబట్టాలని భావిస్తు న్నట్లు తెలిసింది. ఈ భర్తీల్లో 15 వేలకు పైగా పోస్టులను రిక్రూట్ చేసే వీలుందని సమాచారం.

# పెట్రోల్‌లో ఇథనాల్.. డీజిల్‌లో ఐసోబ్యుటనాల్

### 15 శాతం మిశ్రమానికి కేంద్రం నిర్ణయం

**న్యూఢిల్లీ, జులై 4:** దేశంలో ఈ20 పెట్రోల్‌పై చర్చ జరుగుతుంటే కేంద్రం మరో నిర్ణయాన్ని ప్రకటించింది. డీజిల్‌లో 15 శాతం ఐసోబ్యూటనాల్ కలిపేందుకు సిద్ధమైంది. ఈ విషయాన్ని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శనివారం వెల్లడించారు. పెట్రోల్, డీజిల్ వంటి శిలాజ ఇంధనాల్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడాన్ని తగ్గించాలని, ఆధునిక స్వచ్ఛమైన చమురును వాడాలనే కేంద్ర లక్ష్యంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు గడ్కరీ వెల్లడించారు. చమురు దిగుమతుల్ని తగ్గించేందుకు కేంద్రం ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటికే పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలని కేంద్రం నిర్ణయించింది. పెట్రోల్‌లో కలిపినట్లుగా ఇథనాల్‌ను డీజిల్‌లో నేరుగా కలపడానికి వీలుకాదు. అందువల్ల ఇథనాల్ నుంచి ఐసోబ్యూటనాల్‌ను ఉత్పత్తి చేస్తారు. దీన్ని డీజిల్‌లో కలుపుతారు. త్వరలో డీజిల్‌లో ఐసోబ్యూట నాల్‌ను 15 శాతం కలపబోతున్నారు. ఇకపై పూర్తి డీజిల్ కాకుండా 85 శాతం డీజిల్, 15 శాతం ఐసోబ్యూటనాల్ కలిపిన చమురు అందుబాటులోకి వస్తుంది. ఐసోబ్యూటనాల్‌ను డీజిల్‌కు పూర్తి ప్రత్యామ్నాయంగా కూడా వాడుకోవచ్చని గడ్కరీ అన్నారు. ప్రస్తుతం ఐసోబ్యూటనాల్ మిక్సింగ్ ప్రక్రియ కొనసాగుతోందని, దేశీయ చమురు భద్రతలో ఇదొక ముందడుగు అని గడ్కరీ అన్నారు. పైలట్ ప్రాజెక్టుగా ప్రస్తుతం దీన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే రెండు జనరేటర్లను ఇలా




విజయవంతంగా వాడినట్లు చెప్పారు. డీజిల్‌లో ఐసోబ్యూటనాల్ కలపడం వల్ల డీజిల్ వినియోగం తగ్గుతుందని, దీనివల్ల విదేశాల నుంచి క్రూడాయిల్ దిగుమతులు తగ్గుతాయన్నారు. ఇటీవలి కాలంలో పెట్రోల్‌లో ఇథనాల్ కలుపుతూ కేంద్రం చేపట్టిన చర్యల వల్ల రూ.1.9 లక్షల కోట్ల విదేశీ మారక నిధులు మిగిలాయిన నితిన్ గడ్కరీ వెల్లడించారు. దీనివల్ల కర్బన ఉద్గారాలు కూడా తగ్గుతాయన్నారు. కేంద్ర నిర్ణయంపై ప్రజల నుంచి, నిపుణుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ పెట్రోల్ వల్ల వాహనాల మైలేజ్ తగ్గుతుందని, త్వరగా పాడయ్యే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో కేంద్రం నుంచి ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

# 12న మెగా జాబ్‌మేళా

**విజయవాడ, జులై 4, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధిసంస్థ, బిజినెస్ నెట్‌వర్క్(బిఎన్ఐ) ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12వతేదీ విజయవాడ మొగల్రాజపురంలోని పిబి.సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్‌లో యెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎన్టిఆర్‌జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, బిఎన్ఐ ప్రతినిధులు జేహెచ్. దేశాయ్, ఆచంట మేఘనలు తెలిపారు. బిఎన్ఐ సంస్థ పదవ వార్షికోత్సవం సందర్బంగా 100 కంపెనీలతో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 10వతరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బి.టెక్, పోస్ట్‌గ్రాడ్యుయేషన్, ఫార్మసీ పూర్తిచేసిన 18 నుండి 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు ఈజాబ్‌మేళాలో పాల్గొనటానికి అర్హులుగా తెలిపారు. ఎంపికయిన వారికి రూ.12వేల నుండి రూ.50వేల వరకు నెలసరి వేతనంలభిస్తుందన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలని రెజ్యూమ్, ఆధార్, పాన్‌కార్డు, ఆధార్‌కు లింక్‌అయిన ఫోన్, సర్టిఫికెట్‌లతో హాజరుకావాలని,పూర్తివివరాలకు కళ్యాణ్- 8333908080,నరేష్-9032633548, కిషోర్-9985759304లోస ంప్రదించాలని మేఘన

# ఇన్నర్‌వీల్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**విజయవాడ, జులై 4, ప్రభాతవార్త :** ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ 302 డిస్ట్రిక్ట్ 2026-27 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడ గుణదలలోని రోటరీ హాల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో అధ్యక్షులుగా జి.శ్యామల, కార్యదర్శిగా వి.ఎల్.సరోజల తోపాటు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమానికి డాక్టర్ ఉష పంతుల ముఖ్యఅతిథిగా హాజరై నూతన కార్యవర్గం మంచి కార్యక్రమాలతో ముందుకు సాగాలని సూచించారు.

ఈకార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ ఏ.రాణి రత్నకుమారి, ఐపిపి ఎల్. శ్రీగంగ, జి.రశ్మి, సునంద, అజయజైన్, పి.వాణి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్బంగా కొత్తగా చేయబోయే సేవాకార్యక్రమాలపై చర్చించారు.

# దేవస్థాన ఆస్తుల పరిరక్షణే ధ్యేయం: ఇఓ శీనా నాయక్

### దుర్గమ్మకు రు.3లక్షల16వేల విలువైన బంగారు నెక్లెస్



బంగారునెక్లెస్ అందించిన దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, జూలై 4, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయానికి సంబంధించిన ఆస్తుల పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తామని ఇఓ వికె శీనా నాయక్ త్వరితంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో దేవస్థాన ఇంజనీరింగ్ అధికారులు



పాతపాడు సోలార్ ప్లాంట్ పరిశీలిస్తున్న ఇఓ శీనా నాయక్

తెలిపారు. శనివారం ఆయన ఆలయానికి సంబంధించిన సోలార్ ప్లాంట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గూఢవల్లి జాతీయరహదారి వద్ద వున్న ఆలయ భూములను పరిశీలించి అక్కడ ముళ్లకంపలు తొలగించాలని, దేవస్థాన భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఇంద్రకీలాద్రికి సంబంధించిన భూముల వివరాలను పట్టికగా దేవస్థానంలో భక్తుల సమాచారం కోసం ప్రదర్శనగా వుంచాలని ఆదేశించారు. పాతపాడు సోలార్ ప్లాంట్‌ను సందర్శించిన ఆయన లక్ష్యానికి మించి 1.20 లక్షల యూనిట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని అధికారులు తెలపగా, ఇంద్రకీలాద్రి వినియోగం 1లక్ష యూనిట్లు పోను మిగిలిన 20వేల యూనిట్ల విద్యుత్‌పై ఏపి సిపిడిసిఎల్ నెట్‌మీటరింగ్ పనులపై సమీక్షించారు. విద్యుత్‌శాఖాధికారులతో సమీక్షించుకుంటూ పనులు పాల్గొన్నారు.

**దుర్గమ్మవారి బంగారు నెక్లెస్:** దుర్గమ్మవారికి రు.3లక్షల 16వేల విలువైన 21 గ్రాముల బంగారు నెక్లెస్‌ను తాడేపల్లికి చెందిన టి శ్రీధర్ శనివారం అందించారు. దాతలకు శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, అధికారులు దాతలకు అమ్మవారి చిత్రపటం ప్రసాదము అందచేశారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానములో నిర్వహించే నిత్యాన్నదాన పథకమునకు ఖమ్మంకు చెందిన అల్లరి దుర్గారావు, శివదీక్షిత దంపతులు రూ.1,11,111లు విరాళమును ఆలయ అధికారులకు అందచేయగా దాతలకు శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, అధికారులు దాతలకు అమ్మవారి చిత్రపటం ప్రసాదము అందచేశారు.

# స్టెరాయిడ్స్ ఇంజక్షన్ల అమ్మకాలపై బి2బి సంస్థకు తెలంగాణ పోలీసుల తాఖీదులు

### కొరియర్ కంపెనీల పాత్రపై విచారణ

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో వెలుగు చూసిన స్టెరా యిడ్స్ ఇంజక్షన్ల అక్రమ విక్రయాలపై పోలీసు శాఖ తీవ్రంగా స్పందించింది. వైద్యుల సిఫార్సుల మేరకు దీర్ఘకాలిక రోగులకు ఇవ్వాల్సిన వీటిని జింలలో ఫిట్‌నెస్ కోసం వచ్చే యువతకు ఇష్టానుసారం కొంద రు అమ్ముతున్న ఉదంతాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేయడం సంచలనం రేపింది. హైదరాబాద్‌లో పట్టుబడ్డ స్టెరాయిడ్స్ ఇంజక్షన్లు యు పి, పంజాబ్‌ల నుంచి దిగుమతి అయినట్లు గుర్తించిన పోలీసులు ఇందుకుగానూ ప్రముఖ ఆన్‌లైన్ బిజినెస్ సంస్థ బి2బికి నోటీసులు జారీ చేశారు. దేశ వ్యాప్తంగా ఆన్‌లైన్ వ్యాపారంలో పేరొందిన బి2బి (బిజినెస్ 2 బిజినెస్) సంస్థ ద్వారా జింల నిర్వాహకులు స్టెరాయిడ్స్ ఇంజక్షన్లను ఆర్డర్ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆర్డర్ చేసే క్రమంలో అడ్డగోలు పత్రాలను, నకిలీ వైద్యుల సిఫార్సుల లేఖలను జింల నిర్వాహ కులు ఉపయోగించినట్లు పోలీసులు తేల్చారు. ఈ విషయంలో అన్ని అంశాలను పరిగణలోకి తీసుకోవా ల్సిన బి2బి సంస్థ నాంకే వాస్తేగా వ్య వహరించిందని పోలీసుల విచారణలో తేలింది. దీంతో బి2బి నుంచి వివరణ తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారు. భవిష్యత్తులో స్టెరాయిడ్స్ ఇంజక్ష న్లను రవాణా చేయవద్దని పోలీసులు ఆదేశించారు. మరోవైపు స్టెరాయిడ్స్ ఇంజక్షన్ల స్మగ్లింగ్‌లో కొరియర్ కంపెనీల పాత్ర కూడా వుండ డంతో వాటిపైనా చర్యలు తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారు. స్టెరాయిడ్స్ ఇంజక్షన్లను యుపి, పంజాబ్ నుంచి హైదరాబాద్‌కు రావడంలో ఏ ఏ కొరియర్ కంపెనీల పాత్ర వుందనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇందులో అనుమానా స్పదంగా వున్న కొన్ని కంపెనీలకు పోలీసు లు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఇందులో కొరియర్ కంపెనీలు కాసులకు కక్కుర్తిపడి నేరం చేసినట్లయితే వాటిపై చర్యలు తీసుకోవాల ని పోలీసులు నిర్ణయించారని సమాచారం.

# ఉల్లి కొనుగోలు ధర 13 శాతం పెంపు

### క్వింటాల్ రూ.2,125కు చేరిన రేటు

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త :** ధర తక్కువగా ఉండటంతో నష్టాల్లో ఉన్న ఉల్లి రైతులకు కేంద్రం శుభవార్తను అందించింది. మార్కెట్లో ఉల్లి ధరల స్థిరీకరణ, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా, కేంద్ర బఫర్ స్టాక్ సేకరణ కోసం ఉల్లి కొనుగోలు ధరను ఏకంగా 13 శాతం పెంచుతూ శనివారం కీలక నిర్ణయం తీసుకుంది. తాజా సవరణతో ఉల్లి కనీస కొనుగోలు ధర ఇప్పుడు క్వింటాలుకు రూ.2,125 కు చేరింది. గతంలో కేంద్ర ప్రభుత్వం క్వింటాల్ ఉల్లికి రూ.1,875 మద్దతు ధరగా చెల్లించేది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, రైతుల పెట్టుబడి వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ధరకు అదనంగా రూ.250 పెంచింది.

ఈ ప్రస్తుత మార్కె టింగ్ సీజన్లో కేంద్ర ప్రభుత్వం ఉల్లి కొనుగోలు ధరలను పెంచడం ఇది ఐదో సారి కావడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన నాఫెడ్, ఎన్సీసీఎఫ్ ద్వారా రైతుల నుంచి నేరుగా ఈ పెంచిన ధరలకే బఫర్ స్టాక్ సేకరించనున్నారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల బహిరంగ మార్కెట్లో మధ్యవర్తుల దోపిడీ తగ్గి, ఉల్లి రైతులకు భారీగా ఆర్థిక ప్రయోజనం చేకూరనుందని కేంద్ర అధికారవర్గాలు వెల్లడించాయి.

ఆట

## యూనివర్సల్ బేబీ బాస్ ఆగయా
# వస్తూనే సచిన్ రికార్డు బ్రేక్





**మాంచెస్టర్, జులై 4:** క్రికెట్ బుడ్డోడు, వరల్డ్ బేబీ బాస్ వైభవ్ సూర్యవంశీ ఎట్టకేలకు టీమిండియా తుది జట్టులోకి అరంగేట్రం చేశాడు. వస్తూ వస్తూనే రికార్డుతో ఎంట్రీ ఇచ్చాడు. క్రికెట్ గాడ్ సచిన్ తెండూల్కర్ రికార్డును బ్రేక్ చేశాడు. కేవలం 15 ఏళ్ల 99 రోజుల వయస్సులోనే టీమిండియాకు ఆడిన అతిపిన్న క్రికెటర్‌గా వైభవ్ అరుదైన ఘనత అందుకున్నాడు.

ఇంతకు ముందు ఈ రికార్డు సచిన్ పేరిట ఉండేది. బ్యాటింగ్ మాస్ట్రో 16 ఏళ్ల 205రోజుల వయసులో టీమ్ ఇండియా తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడగా.. అతనికంటే ఏడాదిన్నరముందే వైభవ్ సూర్యవంశీ తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడేశాడు.

**ఎలాంటి బెరుకు లేకుండా...**

ఇక తొలి అంతర్జాతీయ మ్యాచ్ అంటే ఓ రకమైన బెరుకు, ఒత్తిడి. వైభవ్ టెంపర్‌మెంట్ చూస్తే మరో మ్యాచ్ అన్నంతగా తేలికగా తీసుకున్నాడు. ఎక్కడా భయం, ఒత్తిడి కనిపించలేదు. తాను ఎదుర్కొన్న తొలిబంతి నుంచే ఎదురుదాడికిప్రయత్నించాడు. అయితే మూడో బంతికి సింగిల్‌తో పరుగుల ఖాతా తెరిచిన బుడ్డోడు...అర్చర్ వేసిన తొలి బంతినే ఫైన్‌లెగ్ మీదుగా భారీ సిక్స్ బాదేశాడు. ఒక టాంగ్‌వేసిన మరో ఓవర్ తొలి బంతిని కూడా మిడ్ వికెట్ మీదుగా స్టాండ్స్‌లోకి పంపాడు. ఇక స్పిన్నర్ విల్ జాక్స్ ఓవర్‌లో భారీ షాట్ ఆడేందుకు స్టెప్ అవుట్ కాగా, కీపర్ స్టంప్ చేశాడు. పది బంతుల్లో రెండు సిక్స్‌లతో చేసింది 14 పరుగులైనా... తొలి వికెట్‌కు 50 పరుగుల శుభారంభం అందించాడు. అంతర్జాయ మ్యాచ్‌లు ఆడే సత్తా తనకుందని వైభవ్ చాటిచెప్పాడు.

# మెస్సీ రికార్డుల మ్యాజిక్



**మియామి, జులై 4:** ఫుట్‌బాల్ దిగ్గజం, అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ రికార్డుల మోత మోగించాడు. అటు గోల్స్‌తో పాటు ఆడిన మ్యాచ్‌ల పరంగా సరికొత్త మైలురాళ్లను అందుకున్నాడు. రెండు వేర్వేరు ఫిఫా వరల్డ్ కప్ ఎడిషన్లలో ఏడు చొప్పున గోల్స్ సాధించిన తొలి ఫుట్‌బాలర్‌గా మెస్సీ నిలిచాడు. 2022 ఖతార్ వరల్డ్ కప్‌లో 7 గోల్స్ చేసిన అర్జెంటీనాను ఛాంపియన్‌గా నిలబెట్టిన మెస్సీ..ఇప్పుడు ఈ టోర్నీలోనూ అదే జోరును ప్రదర్శిస్తున్నాడు.

కాబో వెర్దేతో మ్యాచ్‌తో ఫిఫా టోర్నమెంట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా మెస్సీ నిలిచాడు. ప్రపంచకప్‌లో అతనికి ఇది 30వ మ్యాచ్. ఫిఫా వరల్డ్ కప్ చరిత్రలో వరుసగా 8 మ్యాచ్‌లలో గోల్స్ చేసిన మొదటి ఆటగాడిగా మెస్సీ మరో చరిత్ర సృష్టించాడు. 29వ నిమిషంలో మెస్సీ చేసిన గోల్‌తో ఈ అరుదైన ఫీట్‌ను అందుకున్నాడు. ఈ తాజా గోల్‌తో ఫిఫా వరల్డ్ కప్ చరిత్రలో మెస్సీ ఖాతాలో మొత్తం 20 గోల్స్ చేరాయి. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాకు వరుసగా రెండోసారి ఫిఫా కప్ అందించే దిశగా జట్టును మెస్సీ ముందుండి నడిపిస్తున్నాడు. అలాగే గోల్డెన్ బూట్ రేసులో మెస్సీ ఏడు గోల్స్‌తో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఫ్రాన్స్ స్టార్ ఎంబాపే 6 గోల్స్‌తో రెండో స్థానంలో ఉన్నాడు. ఇక 2018లో అర్జెంటీనా మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన స్కలోనీ.. కోచ్‌గా 100వ అంతర్జాతీయ మ్యాచ్ మైలురాయిని చేరుకున్నారు. స్కలోనీ మార్గదర్శకత్వంలోనే అర్జెంటీనా జట్టు కోపా అమెరికా, ఫిఫా ప్రపంచకప్ వంటి ప్రతిష్టాత్మక టోర్నీలను గెలుచుకుంది.

# భారత్‌ను ఓడించిన బెతెల్
## రెండో టి20లో ఇంగ్లాండ్ 4 వికెట్ల విజయం




మాంచెస్టర్, జులై 4: అయిదు టీ ట్వంటీ సిరీస్ లోభాగంగా మాంచెస్టర్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో టీమిండియా పరాజయం పొందింది. జాకబ్ బెతెల్(46 బంతుల్లో 76 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఒంటిచేత్తో ఇంగ్లాండ్‌కు 4 వికెట్ల విజయాన్ని అందించాడు. మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 190 పరుగులు చేయగా, ఈ లక్ష్యాన్ని ఇంగ్లాండ్ మరో ఓవర్ ఉండగానే 6 వికెట్లు కోల్పోయి అందుకుంది.

టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ చేసిన భారత్‌కు ఓపెనర్లు వైభవ్(14), అభిషేక్ (24 బంతుల్లో 43) 50 పరుగుల మెరుపు ఆరంభం ఇచ్చారు. అయితే 15 రన్స్ తేడాతో ఓపెనర్లను కోల్పోయి కష్టాల్లో పడ్డ టీమిండియాను ఇషాన్ కిషన్(40 బంతుల్లో 49), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(22 బంతుల్లో 37) ఆదుకున్నారు. 13ఓవర్లలో 130 పరుగులకు చేర్చారు. డాసన్, కుర్రాన్ దెబ్బతీయడంతో చివర్లో వేగంగా పరుగులు సాధించలేకపోయింది. తిలక్ వర్మ 11 బంతుల్లో 2 సిక్స్‌లతో 24 పరుగులు చేయడంతో భారత్ 190 పరుగులకు చేరింది.

**దెబ్బతీసిన అర్ష్‌దీప్**

191 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్‌ను తొలి ఓవర్లోనే అర్షదీప్ దెబ్బతీశాడు. ఓపెనర్లు ఫిల్ సాల్ట్, జాస్ బట్లర్‌లను డకౌట్‌గా పెవిలియన్‌చేర్చాడు. కెప్టెన్ హ్యారీబ్రూక్(15బంతుల్లో 39) క్రీజ్‌లో ఉన్నంత సేపు మెరుపులు మెరిపించాడు. బ్రూక్స్ అవుటైన తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన టామ్ బాంటన్(32బంతుల్లో 39) అండగా జాకబ్ బెతెల్(76నాటౌట్)చెలరేగాడు. నాలుగో వికెట్‌కు 67రన్స్ జోడించి ఆదుకున్నాడు. అర్ధ సెంచరీ తర్వఆత బౌలర్లపై సిక్స్‌లు, ఫోర్లతో మరింతగా బెతెల్ విరుచుకుపడ్డాడు. భారత్ గెలుపు ఆశలపై నీళ్లుచల్లాడు. టీమిండియా నుంచి గెలుపును లాక్కొని వెళ్లాడు. దీంతో 19 ఓవర్ల లోనే ఇంగ్లాండ్ లక్ష్యాన్ని అందుకుంది. భారత బౌలర్లలో అర్షదీప్ మూడు వికెట్లు... హర్షిత్ రాణా, అక్షర్ పటేల్, వరుణ్ తలా ఓ వికెట్ పడగొట్టారు. కెప్టెన్‌గా శ్రేయాస్ మూడో పరాజయాన్ని ఖాతాలో వేసుకున్నాడు.

# సెల్ఫ్ గోల్‌తో కాబో వెర్దే ఔట్ - ప్రిక్వార్టర్స్‌కు అర్జెంటీనా
## ముగిసిన రౌండ్-36 * ప్రిక్వార్టర్ సేజ్‌కు చేరిన సాకర్ వరల్డ్ కప్ * నేడు బ్రెజిల్, నార్వే మ్యాచ్

*సాకర్ వరల్డ్ కప్ ప్రి క్వార్టర్ ఫైనల్ స్టేజ్‌కు చేరుకుంది. శనివారంతో ముగిసిన రౌండ్-36 స్టేజ్‌లో అర్జెంటీనా, ఈజిప్ట్, కొలంబియా విజయాలతో ముందంజ వేశాయి. ప్రి క్వార్టర్ ఫైనల్‌కు హాట్ ఫేవరెట్లు అర్జెంటీనా, పోర్చుగల్, బ్రెజిల్, ఫ్రాన్స్‌తో పాటు కెనడా, మొరాకో, పరాగ్వే, నార్వే, మెక్సికో, ఇంగ్లాండ్, స్పెయిన్, అమెరికా, బెల్జియం, ఈజిప్ట్, స్విట్జర్లాండ్, కొలంబియా జట్లు చేరుకున్నాయి. ప్రిక్వార్టర్ ఫైనల్లో తొలి మ్యాచ్ లో కెనడా, మొరాకో తలపడుతుండగా, మిగతా రెండు మ్యాచ్‌ల్లో పరాగ్వేతో ఫ్రాన్స్, బ్రెజిల్‌తో నార్వే ఆడతాయి. ఫిఫా ప్రపంచకప్‌కు అతిథ్యమిస్తు మూడు దేశాలు అమెరికా, కెనడా, మెక్సికో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరడం విశేషం.*



తొలి సాకర్ ప్రపంచకప్‌లోనే అద్భుత ఆటతీరుతో ఆకట్టుకున్న కాబో వెర్దే జట్టు ఆటగాళ్లు

**మియామి, జులై 4:** సాకర్ వరల్డ్ కప్‌లో ఎంట్రీ ఇచ్చిన తొలిసారే సంచలన ఆటతీరుతో నాకౌట్ స్టేజ్‌కు చేరుకున్న చిన్న దేశం కాబో వెర్దే పెద్ద ఆటే కనబరిచింది. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాకు చుక్కలు చూపించింది. ప్రపంచ ఛాంపియన్లను 120 నిమిషాలకు పైగా ఉక్కిరిబిక్కిరి చేసింది. చివరకు సెల్ఫ్ గోల్‌తో ఫిఫా కప్ నుంచి నిష్క్రమించింది. కెప్టెన్ లియోనెల్ మెస్సితో పాటు అనుభవం కలిగిన అర్జెంటీనా చివరకు 3-2తేడాతో కాబో వెర్దేపై అతికష్టంగా విజయం సాధించి ప్రిక్వార్టర్స్‌కు చేరుకుంది. లియోనెల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా ఈ మ్యాచ్‌లో మూడుసార్లు ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. పట్టుదలగా ఆడిన కేప్ వెర్దే జట్టు మొదటి రెండు సార్లు గోల్స్ చేసి స్కోరును సమం చేసినప్పటికీ, మూడో గోల్ మాత్రం చేయలేకపోయింది. మ్యాచ్ అనంతరం కాబో వెర్దే పోరాటానికి ప్రేక్షకులు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు.

**మెస్సీ మెరుపుగోల్**

మొదటి అర్ధభాగంల 29వ నిమిషంలో అర్జెంటీనా తరఫున లియోనెల్ మెస్సీ తొలిగోల్ చేయగా, ఆట మొదలైన గంటకు కేప్ వెర్దే తర ఫున డెరోయ్ దువార్టే అర్హతగా గోల్ చేసి స్కోరును సమంచేశాడు. నిర్ణీత సమయం ముగిసేసరికి ఆట 1-1తో సమంగా ఉండటంతో, రిఫరీ అదనంగా మరో 30 నిమిషాల ఎక్స్‌ట్రా టైమ్ కేటాయించారు. ఎక్స్‌ట్రా టైమ్ తొలి భాగం ఆరంభంలో లిసాండ్రో మార్టినెజ్ గోల్ చేసి అర్జెంటీనాను 2-1 లీడ్‌లోకి తీసుకెళ్లాడు. కొద్ది సేపటికే కాబ్రాల్.. టాప్ కార్నర్‌లోకి రాకెట్ లాంటి అద్భుతమైన షాట్‌ను సంధించి స్కోరును 2-2తో సమం చేశాడు. ప్రస్తుత ఫిఫా కప్‌లో ఇదిఅత్యుత్తమ గోల్‌గా నిలిచింది. ఇక పెనాల్టీ షూటౌట్ తప్పదనుకుంటున్న దశలో అర్జెంటీనాకు గోల్ లభించింది. మెస్సీ పంపిన క్రాస్‌ను రొమెరో హెడర్‌తో గోల్‌గా ప్రయత్నం చేయగా, ఆ బంతి డైనీ బోర్జెస్‌కు తగిలి ఓన్ గోల్‌గా మారింది. దీంతో అర్జెంటీనా ప్రిక్వార్టర్‌కు చేరి ఊపిరిపీల్చుకుంది. గ్రూప్ దశలో స్పెయిన్, ఉరుగ్వే, సౌదీ అరేబియాలను నిలువరిస్తూ డ్రాలతో కాబో వెర్దే నాకౌట్‌కు వచ్చి అందర్నీ ఆశ్చర్యపరిచింది.

**పెనాల్టీ షూటౌట్‌లో...**

ప్రపంచ కప్ ప్రిక్వార్టర్స్‌లోకి ఈజిప్ట్ అడుగు పెట్టింది. ఆస్ట్రేలియాపై పెనాల్టీ షూటౌట్‌లో 4-2తో విజయం సాధించింది. ఆట ఆరంభంలోనే ఇమామ్ ఆషోర్ (11వ నిమిషం) గోల్ చేసి ఈజిప్ట్‌కు ఆధిక్యం ఇచ్చాడు. అయితే, రెండో అర్ధభాగం తర్వాత ఆస్ట్రేలియా తరఫున మహమ్మద్ హానీ (55వ నిమిషం) గోల్ చేసి స్కోర్లను సమం చేశాడు. అనంతరం నిర్ణీత సమయంలోగా ఇరు జట్లూ గోల్స్‌ను సాధించలేదు. 1-1గోల్స్‌తో సమంగా నిలిచాయి. పెనాల్టీ షూటౌట్‌లో ఈజిప్ట్ 4-2 తేడాతో ఆసీస్‌ను ఓడించి తదుపరి రౌండ్‌కు చేరుకుంది. 92 ఏళ్ల తర్వాత ఈజిప్ట్ ప్రిక్వార్టర్స్‌లోకి అడుగు పెట్టింది. అర్జెంటీనాతో జులై 7న ఈజిప్ట్ తలపడనుంది.

**ఘనాపై కొలంబియా**

ప్రి క్వార్టర్‌ఫైనల్లోఅడుగు పెట్టిన చివరి జట్టుగా కొలంబియా నిలిచింది. ఘనాపై ఏకైక గోల్‌తో నెగ్గింది. 14వ నిమిషంలోనే కొలంబియా ప్లేయర్ జాన్ అరియాస్ గోల్ కొట్టాడు. ఆ తర్వాత ఇరు జట్లూ గోల్ పోస్టుల వైపు గురిపెట్టినా ఫలితం రాలేదు. రెండుజట్లు గోల్స్ చేయడంలో విఫల మయ్యాయి. దీంతో ఘనాపై 1-0 గోల్స్‌తో కొలంబియానే విజయం వరించింది. జులై 8న స్విట్జర్లాండ్‌తో ప్రిక్వార్టర్స్‌లో కొలంబియా జట్టు తలపడనుంది.

## ఆరు బిలియన్ డాలర్లు క్షీణించిన
# భారత్ ఫారెక్స్ ఖజానా

వాణిజ్యం



**న్యూఢిల్లీ, జులై 4:** భారత విదేశీ మారక నిల్వలు మరోసారి తగ్గాయి. జూన్ 26తో ముగిసిన వారానికి దేశ విదేశీ మారక నిల్వలు 5.654 బిలియన్ అమెరికన్ డాలర్లు తగ్గి 666.933 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని భారతీయ రిజర్వు బ్యాంక్ వెల్లడించింది. అంతకుముందు వారంలో విదేశీ మారక నిల్వలు 963 మిలియన్ డాలర్లు పెరిగి 672.587 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో దేశ విదేశీ మారక నిల్వలు చరిత్రాత్మక గరిష్ఠ స్థాయి అంటే 728.494 బిలియన్ డాలర్లను నమోదు చేశాయి. అనంతరం పశ్చిమాసియా ఉద్రిక్తతలు, రూపాయిపై ఒత్తిడి పెరగడంతో ఆర్‌బీఐ డాలర్ల విక్రయాల ద్వారా మార్కెట్లో జోక్యం చేసుకోవాల్సి రావడంతో నిల్వలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి.

ఇదిలా ఉండగా, విదేశీ మారక నిల్వలను పరిరక్షించే దిశగా విదేశీ పర్యటనలను తగ్గించుకోవాలని, ఇంధన వినియోగాన్ని పరిమితం చేయాలని, ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను తగ్గించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మే 11 నుంచి పలుమార్లు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం, విదేశీ మారక నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీకరెన్సీ ఆస్తులు 150 మిలియన్ డాలర్లు తగ్గి 541.067 బిలియన్ డాలర్లకు చేరాయి. డాలర్‌తో పాటు యూరో, పౌండ్, యెన్ వంటి ఇతర విదేశీ కరెన్సీల విలువల్లో చోటుచేసుకున్న మార్పుల ప్రభావం కూడా ఈ ఆస్తులపై ప్రతిబింబిస్తుంది. అదే సమయంలో బంగారం నిల్వల విలువ 5.394 బిలియన్ డాలర్లు తగ్గి 102.536 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు (ఎస్‌డీఆర్‌లు) 89 మిలియన్ డాలర్లు తగ్గి 18.558 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అలాగే అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత రిజర్వు స్థానం కూడా 21 మిలియన్ డాల ర్లు తగ్గి 4.772 బిలియన్ డాలర్లకు చేరిందని ఆర్‌బీఐ వెల్లడించింది.

# 500మిలియన్ డాలర్ల విదేశీ నిధుల సేకరణలో ఐసిఐసిఐ




**ముంబయి, జులై 4:** ఐసీఐసీఐ బ్యాంక్ విదేశీ కరెన్సీ బాండ్ల ద్వారా సుమారు 500 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించేందుకు కసరత్తులు చేస్తోంది. ఈ నెల మూడో వారంలో ఏప్రిల్‌జూన్ త్రైమాసిక ఫలితాల ప్రకటన అనంతరం అధికారికంగా నిధుల సమీకరణ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ బాండ్ జారీతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రవేశపెట్టిన ప్రత్యేక విదేశీ కరెన్సీ స్వాప్ సౌకర్యాన్ని వినియోగించుకునే నాలుగో వాణిజ్య బ్యాంకుగా ఐసీఐసీఐ బ్యాంక్ నిలవనుంది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలు ఇప్పటికే ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని విదేశీ మార్కెట్లలో బాండ్లు జారీ చేశాయి. రిజర్వ్ బ్యాంక్ గత నెల ప్రవేశపెట్టిన ఈ స్వాప్ విండో వల్ల విదేశీ కరెన్సీ బాండ్ జారీలకు హెడ్జింగ్ వ్యయం తగ్గుతోంది. దీంతో బ్యాంకులకు తక్కువ వ్యయంతో డాలర్లలో నిధులు సమీకరించే అవకాశం లభిస్తోంది. ఐసీఐసీఐ బ్యాంక్ చివరిసారిగా 2017లో 500 మిలియన్ డాలర్ల విలువైన అమెరికన్ డాలర్ బాండ్లను జారీ చేసింది.

దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత మరోసారి అంతర్జాతీయ బాండ్ మార్కెట్‌ను ఆశ్రయించేందుకు సిద్ధమవుతోంది. భారత బ్యాంకులు వరుసగా విదేశీ మార్కెట్లలో నిధులు సమీకరిస్తుండటంతో అంతర్జాతీయ ఇన్వెస్టర్లు అధిక ప్రీమియంను డిమాండ్ చేస్తున్నారు. గత వారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఐదేళ్ల కాలపరిమితితో 750 మిలియన్ డాలర్ల బాండ్లను అమెరికా ట్రెజరీ దిగుబడిపై 90 బేసిస్ పాయింట్ల స్ప్రెడ్‌తో జారీ చేసింది. అనంతరం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ 300 మిలియన్ డాలర్లను 105 బేసిస్ పాయింట్ల స్ప్రెడ్‌తో సమీకరించగా, యాక్సిస్ బ్యాంక్ 300 మిలియన్ డాలర్లను 110 బేసిస్ పాయింట్ల స్ప్రెడ్‌తో సమీకరించింది.

మరోవైపు ఎస్‌బీఐ కూడా 300 మిలియన్ డాలర్ల ఫ్లోటింగ్ రేట్ నోట్లను విజయవంతంగా జారీ చేసింది. రూపాయి మారకపు విలువకు మద్దతు ఇవ్వడం, విదేశీ మూలధనాన్ని ఆకర్షించడం, అలాగే రుణాల వృద్ధి డిపాజిట్ల కంటే అధికంగా ఉన్న నేపథ్యంలో బ్యాంకుల నిధుల సమీకరణ వ్యయాన్ని తగ్గించడమే ఈ స్వాప్ విండో ప్రధాన ఉద్దేశమని ఆర్బీఐ తెలిపింది. ఈ పథకం ప్రకారం కనీసం మూడు సంవత్సరాల కాలపరిమితి ఉన్న విదేశీ కరెన్సీ రుణాలకు ఆర్బీఐ ఏడాదికి 1.5 శాతం స్థిర స్వాప్ రేటుతో సౌకర్యాన్ని అందిస్తోంది.




## కోటక్ మహీంద్రా బ్యాంక్ రుణాలు
# డిపాజిట్లలో రెండంకెల వృద్ధి

**ముంబయి, జులై 4:** ప్రైవేట్ రంగంలోని కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో రుణాలు, డిపాజిట్లలో బలమైన వృద్ధిని నమోదు చేసింది. శనివారం విడుదల చేసిన తాత్కాలిక గణాంకాల ప్రకారం, బ్యాంకు నికర అడ్వాన్సులు (రుణాలు) వార్షిక ప్రాతిపదికన 15 శాతం పెరిగి రూ.4.94 లక్షల కోట్లకు చేరాయి. గత త్రైమాసికంతో పోలిస్తే ఇవి 2.7 శాతం పెరిగాయి. బ్యాంకు మొత్తం డిపాజిట్లు కూడా ఏడాది క్రితం నమోదైన రూ.4.92 లక్షల కోట్ల నుంచి 13.6శాతం పెరిగి రూ.5.58 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గత త్రైమాసికంలోని రూ.5.38 లక్షల కోట్లతో పోలిస్తే 3.38 శాతం వృద్ధి నమోదైంది. కరెంట్ అకౌంట్, సేవింగ్స్ అకౌంట్ (కాసా) డిపాజిట్లు కూడా 13 శాతం పెరిగి రూ.2.17 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో ఇవి రూ.1.92 లక్షల కోట్లుగా ఉండగా, గత త్రైమాసికంతో పోలిస్తే కూడా 2.4 శాతం పెరుగుదల కనిపించింది. సగటు నికర రుణాలు, సగటు కాసా డిపాజిట్లు, సగటు మొత్తం డిపాజిట్లలో కూడా బ్యాంకు వృద్ధిని నమోదు చేసినట్లు వెల్లడించింది.

2025-26 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (జనవరి-మార్చి)లో కోటక్ మహీంద్రా బ్యాంక్ ఏకీకృత నికర లాభం 13శాతం పెరిగి రూ.4,027 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.3,552 కోట్లుగా నమోదైంది. బ్యాంకు నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 8 శాతం పెరిగి 7వేల 875 కోట్లకు చేరగా, నిర్వహణ లాభం 7 శాతం పెరిగి రూ.5,855 కోట్లుగా నమోదైంది. నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) నిష్పత్తి కూడా మెరుగుపడింది. స్థూల ఎన్‌పీఏ 1.20 శాతానికి, నికర ఎన్‌పీఏ 0.25 శాతానికి తగ్గింది. ఇవి మార్కెట్ అంచనాల కంటే మెరుగ్గా ఉండటంతో బ్యాంకు పనితీరుపై విశ్వాసం పెరిగింది. 2025-26ఆర్థిక సంవత్సరానికి డివిడెండ్‌ను ప్రకటించిన బ్యాంకు వాటాదారుల ఆమోదం పొందాల్సి ఉంది.

## బ్యాంక్ ఆఫ్ బరోడాపై 63.6 లక్షలు, జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌పై 3.10 లక్షలు
# ఆర్బీఐ జరిమానా




**ముంబయి, జులై 4:** నియంత్రణ నిబంధనలను ఉల్లంఘించినందుకు ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడాపై రూ.63.60 లక్షల జరిమానాను విధించినట్లు భారతీయ రిజర్వు బ్యాంకు ప్రకటించింది. రుణదాతల కోసం అమల్లో ఉన్న ఫెయిర్ ప్రాక్టీసెస్ కోడ్‌తో పాటు నో యువర్ కస్టమర్ (కేవైసీ) నిబంధనలను పాటించడంలో బ్యాంకు విఫలమైనట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. కేవైసీ మార్గదర్శకాలను ఉల్లంఘించినందుకు జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌పై రూ.3.10 లక్షల జరిమానా కూడా విధించింది.

ఆర్‌బీఐ తెలిపిన వివరాల ప్రకారం, 2025 మార్చి 31 నాటికి బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్థిక పరిస్థితిపై నిర్వహించిన చట్టబద్ధ తనిఖీల అనంతరం బ్యాంకుకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. బ్యాంకు ఇచ్చిన వివరణను పరిశీలించిన తర్వాత కొన్ని రుణ ఖాతాల్లో ఒప్పందంలో పేర్కొన్న వడ్డీ రేటుకంటే అధిక వడ్డీని వసూలు చేసినట్లు గుర్తించింది.

కొంతమంది ఖాతాదారుల కేవైసీ వివరాలను నిర్దేశిత గడువులోగా సెంట్రల్ కేవైసీ రికార్డ్స్ రిజిస్ట్రీలో నమోదు చేయడంలో కూడా బ్యాంకు విఫలమైనట్లు ఆర్‌బీఐ పేర్కొంది.

మరోవైపు, జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌పై జాతీయ గృహ బ్యాంకు 2025 మార్చి 31 నాటి ఆర్థిక పరిస్థితిని ఆధారంగా చేసుకుని తనిఖీలు నిర్వహించింది. అనంతరం సంస్థకు కూడా షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. సంస్థ తనఖాతాల రిస్క్ వర్గీకరణను కనీసం ఆరు నెలలకు ఒకసారి సమీక్షించే విధానాన్ని అమలుచేయడంలో విఫలమైనందున రూ.3.10 లక్షల జరిమానా విధించినట్లు తెలిపింది. ఈ రెండు సంస్థలపై విధించిన జరిమానాలు కేవలం నియంత్రణ నిబంధనల ఉల్లంఘనలకే సంబంధించినవని, ఖాతాదారులతో సంస్థలు కుదుర్చుకున్న లావాదేవీలు లేదా ఒప్పందాల చెల్లుబాటుపై ఎలాంటి ప్రభావం ఉండదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రుణాలు, డిపాజిట్లలో రెండంకెల వృద్ధి




**ముంబయి, జులై 4:** దేశంలో అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తొలి త్రైమాసికంలో రుణాలు, డిపాజిట్లలో బలమైన వృద్ధిని నమోదు చేసింది. జూన్ 30తో ముగిసిన త్రైమాసికానికి సంబంధించిన తాత్కాలిక వ్యాపార గణాంకాలను బ్యాంక్ విడుదల చేసింది. బ్యాంక్ మొత్తం స్థూల అడ్వాన్సులు ఏడాది క్రితం ఇదే కాలంతో పోలిస్తే 15.4 శాతం పెరిగి 30 లక్షల 61 వేల కోట్ల రూపాయలకు చేరాయి. ప్రస్తుతం ఇచ్చిన అడ్వాన్సులు అంటే ఇంటర్‌బ్యాంక్ మొత్తం 31 లక్షల 27 వేల కోట్ల రూపాయలకు చేరింది. ఇది వార్షిక ప్రాతిపదికన 12.4 శాతం వృద్ధిని నమోదు చేసింది. డిపాజిట్ల పరంగాకూడా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బలమైనవృద్ధిని నమోదు చేసింది.

జూన్ చివరి నాటికి మొత్తం డిపాజిట్లు 14.7 శాతం పెరిగి 31 లక్షల 71 వేల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. త్రైమాసిక ప్రాతిపదికన డిపాజిట్లు 2.1 శాతం పెరిగాయి. కరెంట్ అకౌంట్, సేవింగ్స్ అకౌంట్‌లను కలిపిన కాసా డిపాజిట్లు 9.4 శాతం పెరిగి 10 లక్షల 26వేల కోట్ల రూపాయలకు చేరాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్ల వంటి టైమ్ డిపాజిట్లు వార్షిక ప్రాతిపదికన 17.4శాతం పెరిగి 21 లక్షల 45 వేల కోట్ల రూపాయలకు చేరాయి. గత త్రైమాసికంతో పోలిస్తే ఇవి దాదాపు 5 శాతం వృద్ధి నమోదు చేశాయి. దేశవ్యాప్తంగా బ్యాంకుల రుణాలు 17.7 శాతం పెరగగా డిపాజిట్లు 12 శాతం మాత్రమే పెరిగాయి. దీంతో రుణాల వృద్ధి డిపాజిట్ల వృద్ధికంటే 570 బేసిస్ పాయింట్లు అధికంగా ఉందని ఆర్‌బీఐ వెల్లడించింది.

## తొలి త్రైమాసికంలో
# వేదాంత భారీ వృద్ధి

**ముంబయి, జులై 4:** గనులు, లోహాల రంగ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కీలకవిభాగాల్లో ఉత్పత్తి వృద్ధిని నమోదు చేసింది. జింక్ ఇండియా విభాగంలో ఇప్పటివరకు ఎన్నడూ లేని స్థాయిలో తొలి త్రైమాసిక మైన్డ్ మెటల్ ఉత్పత్తి నమోదవగా, కాపర్, ఫెర్రో క్రోమ్ విభాగాలు కూడా స్థిరమైన వృద్ధిని నమోదు చేసినట్లు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించిన వివరాల్లో తెలిపింది. జింక్ ఇండియా విభాగంలో మైన్డ్ మెటల్ ఉత్పత్తి 2.68 లక్షల టన్నులకు చేరుకుని గత ఏడాదితో పోలిస్తే 1 శాతం పెరిగింది. అమ్మకానికి వీలున్న లోహ ఉత్పత్తి 4 శాతం పెరిగి 2.60 లక్షల టన్నులకు చేరుకోగా, శుద్ధి చేసిన జింక్ ఉత్పత్తి 6 శాతం వృద్ధిని నమోదు చేసింది. వెండి ఉత్పత్తి మాత్రం 149 టన్నుల వద్ద గత ఏడాది స్థాయిలోనే కొనసాగింది.

చందేరియా, దరిబా ప్లాంట్లలో చేపట్టిన డీబాటిల్‌నెకింగ్ చర్యలతో ఉత్పత్తి సామర్థ్యం పెరగడం వల్ల శుద్ధి చేసిన లోహ ఉత్పత్తి మెరుగుపడిందని కంపెనీ పేర్కొంది. వేదాంతా అనుబంధ సంస్థ ఫాకోర్‌లో ఫెర్రో క్రోమ్ ఉత్పత్తి 4శాతం పెరిగి 29వేల టన్నులకు చేరింది. అదే సమయంలో ఖనిజ ఉత్పత్తి 41 శాతం పెరిగి రికార్డు స్థాయిలో 1.53లక్షల టన్నులకు చేరింది. కాపర్ ఇండియాలో విక్రయాలు3శాతం పెరిగి 53వేల టన్నులకు చేరాయి. గత ఎనిమిదేళ్లలో తొలి త్రైమాసికానికి ఇది అత్యధిక విక్రయాలుగా కంపెనీ పేర్కొంది. అంతర్జాతీయ జింక్ వ్యాపారంలో గామ్స్బర్గ్ ఫేజ్1 ఉత్పత్తి గత త్రైమాసికంతో పోలిస్తే 10 శాతం పెరిగిందని, ఫేజ్2 ఉత్పత్తిని ఈ ఏడాది ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. తొలి త్రైమాసికంలో జింక్ ఇండియా చరిత్రలోనే అత్యధిక మైన్డ్ మెటల్ ఉత్పత్తి నమోదు చేయ దంతో పాటు, ఫాకోర్ విభాగం కూడా ఇప్పటివరకు ఎన్నడూలేని స్థాయిలో త్రైమాసిక ఖనిజ ఉత్పత్తిని సాధించిందని వేదాంతా




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం ఆదివారం 05 జూలై 2026 I

# జనసేన పార్టీ నిర్మాణ సాధకుల సమాచార సేకరణ కమిటీ

## దరఖాస్తుల స్వీకరణ



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై4,(ప్రభాతవార్త)** అమలాపురం పార్లమెంట్ పరిధిలో జనసేన సారధుల నుండి దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుండి వందలాదిమంది జనసేన పార్టీ ఆశావాహులు కార్యక్రమం లో పాల్గొని తమ అభ్యర్థనలను అమలాపురం పార్లమెంటు పరిశీలకులు పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు కి అందజేశారు. అమలాపురం పట్టణంలోని సత్యనారాయణ గార్డెన్స్ లో ఉత్సాహంగా జరిగిన కార్యక్రమం ఉదయం నుండి సాయంత్రం 6 వరకు సందడిగా సాగింది. ఈ కార్యక్రమంలో గోదావరి జిల్లాల అభిమానం ఆప్యాయతలు వెల్లి విరిసాయి. జనసేన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో ఎన్నడూ లేని విధంగా కార్యకర్తల నుండే నాయకులు తయారు కావాలన్న దృఢ సంకల్పంతో చేపట్టిన జనసేన సారధుల కార్యక్రమం చాలా గొప్పదని నాయకులు, కార్యకర్తలు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమం జనసేన శ్రేణులు నే కాకుండా మొత్తం రాష్ట్ర ప్రజలలోను ఆసక్తిని రేకెత్తిస్తుందని పేర్కొన్నారు. రాజకీయాలు పారదర్శకంగా నిజాయితీగా ఉండాలన్నదే పవన్ కళ్యాణ్ సంకల్పమని పలువురు నాయకులు కార్యకర్తలు తెలిపారు. ఇక పార్టీ పరిశీలకుడుగా వచ్చిన పంచకర్ల రమేష్ బాబు ఓర్పు, నేర్పు, సమయస్ఫూర్తి,జనసేన పార్టీ పట్ల కార్యకర్తలు, నాయకులు పట్ల ఆయనకు గల అభిమానం వెలకట్టలేనిది అమలాపురం పార్లమెంటు పరిధిలోని పలువురు నాయకులు తెలిపారు.అలసట లేకుండా ఉదయం నుండి సాయంత్రం వరకు కార్యకర్తల నుండి దరఖాస్తులు స్వీకరించడమే కాకుండా అందరితోనూ ఆప్యాయంగా అభిమానంగా మాట్లాడి ప్రోత్సహించారని జనసేన నాయకులు చెప్పారు. జనసేన సైనికులకు పలు విధాలుగా సలహాలు సూచనలు ఇచ్చి ప్రోత్సహించారని వెల్లడించారు.మరోవైపు జనసేన నాయకులు కార్యకర్తలు కూడా భారీ ఎత్తున విచ్చేసి సమర్పించుకున్నారు. పార్టీ కోసం పనిచేసిన వారితోపాటు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న జనసైనికులు తమ అభ్యర్థనలను ఎమ్మెల్యే రమేష్ బాబు కి అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నిర్మాణ సాధకుల సేకరణ కమిటీ సభ్యులు సీనియర్ నాయకులు గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్,ఆర్డీఎస్ ప్రసాద్,గనిశెట్టి నాగలక్ష్మి, జనసేన పార్టీ సాదక్ ప్రతినిధులు చిక్కం సుధారాణి,గిడ్డి రత్నశ్రీ, సంపతి సత్యనారాయణ, వీరితోపాటు 21 మంది నిర్మాణ సాధకుల సమాచార సేకరణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 20 రోజుల తర్వాత ప్రారంభమైన పాపికొండల విహారయాత్ర



**దేవీపట్నం, జూలై 4 (ప్రభాతవార్త):** గోదావరి పరివాహక ప్రాంతంలోని పాపికొండల విహారయాత్ర ఎట్టకేలకు పునఃప్రారంభమైంది. గత 20 రోజులుగా నిలిచిపోయిన బోటు విహార సేవలకు సంబంధిత శాఖల అధికారులు అనుమతులు మంజూరు చేయడంతో శనివారం నుంచి పర్యాటకులను అనుమతించారు. దేవీపట్నం మండలం గండి పోచమ్మ ఘాట్ నుంచి పాపికొండల వైపు బోటు సేవలు తిరిగి ప్రారంభం కావడంతో పర్యాటకులు ఆనందం వ్యక్తం చేశారు. పర్యాటకుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అధికారులు అన్ని భద్రతా ప్రమాణాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. బోట్లలో లైఫ్ జాకెట్లు, ఇతర భద్రతా పరికరాలను అందుబాటులో ఉంచి ప్రయాణాలను నిర్వహిస్తున్నారు. తొలి రోజు 'జలవిహారి' బోటులో 85 మంది పర్యాటకులు పాపికొండల విహారయాత్రకు వెళ్లినట్లు ఇరిగేషన్ శాఖ ఏఈ భాస్కర్ తెలిపారు. విహారయాత్ర ప్రారంభం సందర్భంగా దేవీపట్నం పోలీస్ సిబ్బంది భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. విహారయాత్రల పునఃప్రారంభంతో స్థానిక పర్యాటక రంగానికి ఊతం లభించనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మంత్రి నారాయణ సమీక్ష




**రాజమహేంద్రవరం అర్బన్,జూలై4(ప్రభాతవార్త)** వచ్చే ఏడాది నిర్వహించే గోదావరి పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లపై తూర్పు గోదావరి జిల్లా అధికారులతో శనివారం నగరపాలక సంస్థ కార్యాలయం లో మంత్రి నారాయణ సమీక్షించారు గోదావరి పుష్కరాల కోసం సీఎం చంద్రబాబు 1500 కోట్లు మంజూరు చేశారని వీటిలో కేవలం రాజమహేంద్రవరంలో పుష్కరాల కోసమే రూ.580 కోట్లు పనులకు సీఎం అనుమతించారని తెలిపారు పుష్కరాలకు రాజమహేంద్రవరంలో కల్పించాల్సిన సదుపాయాలపై చర్చించి పనులు వెంటనే ప్రారంభించాలని సీఎం ఆదేశించారని అన్నారు ప్రస్తుతం ఉన్న నిధులతో తొలి దశ పనులు ప్రారంభించి రాజమహేంద్రవరం లో మురుగునీటి శుద్ధి కేంద్రాలను నిర్మించి గోదావరిలో మురుగునీరు కలవకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు రాజమహేంద్రవరంలో డ్రైనేజీ కాల్వల నిర్మాణం కోసం రూ.140 కోట్ల తో పనులు ప్రారంభిస్తామని అన్నారు రోడ్ల నిర్మాణం విస్తరణ ,లైటింగ్ పనులు చేయబడుతుంది చేపట్టి టీ డిఆర్ బాండ్లు జారీ చేసి, నగరంలో రోడ్లు విస్తరణ త్వరలో చేపడతామని తెలిపారు గోదావరి కాలుష్య నివారణకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నిధులు కేటాయిస్తామని తెలిపారు ఘాట్ల ఆధునికరణ,విస్తరణను ఇరిగేషన్ శాఖ నిధుల ద్వారా అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు.

## ఘనంగా విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై 4 (ప్రభాతవార్త):** స్థానిక నాగమల్లి తోట జంక్షన్లో మన్యం వీరుడు, స్వాతంత్ర సమరయోధుడు విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 129వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో జిల్లా కలెక్టర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎంపి సానా సతీష్ బాబు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, కౌడా చైర్మన్ తలాటం సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ, ప్రజాప్రతినిధులు, క్షత్రియ సమాజ పెద్దలు స్థానిక నాగమల్లితోట జంక్షన్ లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ,భారత స్వాతంత్ర్య సంగ్రామంలో వీరోచిత పోరాటాలతో తెల్లదొరల గుండెల్లో నిద్రపోయి, మన్యం ప్రజల హక్కుల కోసం ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నిస్వార్థ త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. అల్లూరి ఆదర్శంగా సమాజంలో ప్రతి పౌరుడికి హక్కులు కల్పించేందుకు, వెనుకబడిన, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాడు అడవులను అల్లూరి ఎలా సంరక్షించారో, నేటి తరం కూడా అదే స్ఫూర్తితో పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు. అల్లూరి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నేటి యువత దేశ సేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ, జిల్లా ప్రజలందరికీ అల్లూరి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ మాట్లాడుతూ, గిరిజనుల, ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మన్యం వీరుడు అల్లూరి దేశ స్వాతంత్ర్యానికి దిక్సూచిగా నిలిచారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అల్లూరి ఆశయాలకు కట్టుబడి ఉందన్నారు. అమరావతిలో అల్లూరి చరిత్రను భావితరాలకు తెలియజెప్పేలా భూమిని కేటాయించడం, అలాగే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం'గా నామకరణం చేయడం అల్లూరి పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. క్షత్రియ సామాజిక వర్గ సంక్షేమానికి, వారి సామాజిక సేవా కార్యక్రమాలకు ఈ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటోందని, రాజకీయంగా కూడా పెద్దపీట వేస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేసారు. దేశ ప్రజల స్వేచ్ఛ కోసం ప్రణాలర్పించిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు నిరుపమాన త్యాగాన్ని జాతి ఎన్నటికీ మరువదని ఎంపి సానా సతీష్ బాబు, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఎస్డిఓ వి. సతీష్ కుమార్ స్థానిక నాయకులు, క్షత్రియ అసోసియేషన్ ప్రతినిధులు, నగర ప్రముఖులు, యువత, విద్యార్థులూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేషన్ షాపుల్లో పురుగు పట్టిన బియ్యం పంపిణీ



**రామచంద్రపురం,జూలై 04(ప్రభాతవార్త):** రామచంద్రపురం పట్టణంలోని సగానికి పైగా రేషన్ దుకాణాల్లో గత నెల,ఈ నెల పంపిణీ చేసిన ఉచిత బియ్యంలో పెంకు పురుగులు కనిపిస్తున్నాయని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై డీలర్లను ప్రశ్నించగా,గోదాముల నుంచి వచ్చిన బియ్యాన్నే పంపిణీ చేస్తున్నామని సమాధానం చెబుతున్నట్లు లబ్ధిదారులు తెలిపారు. గోదాముల్లో సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం లేదా సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. పురుగులు పట్టిన బియ్యాన్ని ఎలా ప్రజలకు ఎలా వినియోగిస్తారని ప్రజలు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి,నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## నాగభూషణంకి పిత్రు వియోగం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై 4ప్రభాతవార్త** ముమ్మిడివరం నియోజకవర్గం చెయ్యేరు గ్రామం లో రాష్ట్ర ఆక్వా కార్యదర్శి త్సవటపల్లి నాగభూషణం తండ్రి వెంకటేశ్వర రావు స్వర్గస్తులైయ్యారు. పిత్రు వియోగం తో బాధపడుతున్న నాగబూషనంను ఆకుటుంబ సభ్యులను నాయకులు కల్వకొలను తాతాజీ, బాల అప్పలరాజు, మెడిద ప్రసాద్, సలాది బుచ్చిరామ్మూర్తి, రాయపురెడ్డి జానికిరామయ్య చెల్లి అశోక్,ఏడిద శ్రీను , శ్రీమన్నారాయణ తదితరులు పరామర్శించారు. వెంకటేశ్వర రావు మృతి కి సంతాపం ప్రకటించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## అమరవీరుడు అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళులు





**రంపచోడవరం. జూలై 4: ప్రభాతవార్త.** భారత స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ పాలకులపై ధైర్యంగా పోరాడి దేశానికి స్వేచ్ఛ సాధించడంలో కీలక పాత్ర పోషించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజును ప్రతి భారతీయుడు ఎప్పటికీ గుర్తుంచుకోవాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అన్నారు. శనివారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో అల్లూరి సీతారామరాజు 130వ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి కలెక్టర్ దినేష్ కుమార్, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్, డీఎఫ్ఓ శివకుమార్ గంగాల్, రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజనులను ఒక్కతాటిపైకి తెచ్చి, రంపచోడవరం, కృష్ణదేవిపేట, అడ్డతీగల, రాజవొమ్మంగి వంటి ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అత్యాధునిక ఆయుధాలతో ఉన్న బ్రిటిష్ సేనలను కూడా తన అసాధారణ ధైర్యం, వ్యూహాత్మక నాయకత్వంతో ఎదుర్కొన్నారని కొనియాడారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా గిరిజనుల సంక్షేమం కోసమే ఆయన పోరాడారని, వారిని తన కుటుంబ సభ్యుల్లా భావించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని చెప్పారు. అందుకే ఆయన "మన్యం వీరుడు"గా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. 1897 జూలై 4న మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన అల్లూరి సీతారామరాజు, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగించిన పోరాటంలో 1924 మే 7న వీరమరణం పొందారని తెలిపారు. ఆయన జీవితం చిన్నదైనా, దేశభక్తి, ధైర్యం, త్యాగం భారత చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతాయని అన్నారు. అల్లూరి సీతారామరాజు స్మారకార్థం ఒక జిల్లాకు ఆయన పేరును పెట్టడం గర్వకారణమని, ప్రతి పౌరుడు స్వాతంత్ర్య సమరయోధులను గుర్తు చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, ఏపీవో జనరల్ డి.ఎన్.వి. రమణ, సబ్ డీఎఫ్‌లు జే.వి. సుబ్బారెడ్డి, రవీంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ దాసరి రత్నాకర్ రావు, డీఈవో జి. శ్రీరామ్ మూర్తి, ఐసీడీఎస్ పీడీ కె. ఉమా, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, పీహెచ్ఓ నరేంద్ర కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు, మురళి, ఎస్.బి.వి. రెడ్డి, రాఘవరెడ్డి, డీఈలు భవాని, రమేష్, ఐటీడీఏ ఏఓ ఎర్రంశెట్టి రాజు, మేనేజర్ బి. రాజు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొని అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పించారు.

## యువతకు ఉద్యమ స్ఫూర్తి ప్రదాత అల్లూరి

### సామాజిక కార్యకర్త మేకల కృష్ణ




**శంఖవరం జూలై 4 ప్రభాతవార్త** నేటి సమాజంలో జరుగుతున్న అక్రమాలపై రాజ్యాంగబద్ధంగా యువత ఉద్యమించాలని, ఆ ఉద్యమానికి అల్లూరి సీతారామరాజు చేసిన స్వాతంత్ర్య సమరం స్ఫూర్తితో ముందుకు నడవాలని సామాజిక కార్యకర్త మేకల కృష్ణ అన్నారు. మండల కేంద్రం శంఖవరంలో అల్లూరి 129వ జయంతిని పురస్కరించుకుని స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలో గల అల్లూరి విగ్రహానికి శంఖవరం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ పగడాల మోహన సన్యాసిరావు (బాబ్జి), గునపర్తి అపురూప్, మాజీ ఉప సర్పంచ్ గుద్దాటి నాగేశ్వరరావు, బొమ్మిడి చిట్టిబాబు, రేలంగి దొంగబాబు, పడాల కృష్ణమూర్తి, పర్వత రామకృష్ణ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేకల కృష్ణ మాట్లాడుతూ శంఖవరం గ్రామ ప్రజలకు అల్లూరికి మంచి అనుబంధం ఉన్నదని, నాటి స్వాతంత్ర్య సమర పోరాట సమయంలో శంఖవరంలోని మెయిన్ ఎలిమెంటరీ స్కూలుకు చేరుకున్న అల్లూరిని గ్రామ ప్రజలు ఆదరించి, ఆయన ఉద్యమానికి సంఘీబావం తెలిపి, ఆయన అడుగుజాడల్లో నడిచారన్నారు. శంఖవరం గ్రామం నుండే కలెక్టర్ కు అల్లూరి మిరపకాయ టపాను నేను శంఖవరం గ్రామంలో ఉన్నానంటూ పంపించారన్నారు. నాటి అల్లూరి స్ఫూర్తితోనే యువత సమాజంలో కొందరు అక్రమార్కులు, అసాంఘిక శక్తులు చేస్తున్న అవినీతి, అక్రమాలపై రాజ్యాంగబద్ధంగా పోరాడాలన్నారు. కమిటి సభ్యుడు గుద్దాటి నాగేశ్వరరావు, గునపర్తి అపురూప్ మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తితో ప్రతీ ఒక్కరు సమాజ శ్రేయస్సుకు కార్యోన్ముఖులై సమ సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసారు. కార్యక్రమంలో రేలంగి వెంకటరమణ, జట్లా రాము, యిసరపు సింహాద్రి, కుర్రే మురళీ, అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

## అల్లూరి ప్రాణ త్యాగం చిరస్మరణీయం

### మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ టీమ్



**అమలాపురం కలెక్టరేట్, జూలై 4 ప్రభాతవార్త** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ టీమ్ స్థానిక క్షత్రియ కళ్యాణ మండపం వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి పూల మాలలు వేసి అంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ బ్రిటిష్ వారికి ఎదురెళ్లి సీతారామరాజు ప్రాణ త్యాగం దేశ ప్రజలు మరువలేరని, చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి, కార్యదర్శి గోటేటి లక్ష్మి, జోన్ చైర్పర్సన్ పుత్సా రాజేశ్వరి, కృష్ణ కామేశ్వర్, గోటేటి గంగాధరరావు, పేరి లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

## 108 లో ప్రసవం.. తల్లిబిడ్డ ఆసుపత్రికి తరలింపు



**రాజవొమ్మంగి, జూలై 04, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం లాగరాయి పి. హెచ్. సి నుండి గర్భిణీ వెలంపర్తి పావనిని శనివారం నర్సీపట్నం ఆసుపత్రికి 108 లో తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆడబిడ్డకు జన్మనివ్వడంతో 108 ఈ ఎం. టి.అర్జున్, ఆశ వర్కర్ అమ్మాజీ సేవలను అందించారు. శిశువు బొడ్డు తాడు చుట్టుకొని జన్మ నివ్వగా చాకచక్యంతో సేవలను అందించారు. తిరిగి రాజవొమ్మంగి పి. హెచ్. సి కి తీసుకొని వచ్చినట్లు పైలట్ మరిణిరాజు తెలిపారు

## రూ.73.50 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం



**రామచంద్రపురం,జూలై 04(ప్రభాతవార్త):** పట్టణ మున్సిపాలిటీ పరిధిలో రూ.73.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఐదు అభివృద్ధి పనులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్--రాజగోపాల్ సెంటర్ వరకు సెంట్రల్ డివైడర్ నిర్మాణంతో పాటు వివిధ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గత రెండేళ్లలో పట్టణాభివృద్ధికి రూ.50 కోట్లకుపైగా ఖర్చు చేశామని, మరో ఆరు నెలల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపడతామని మంత్రి తెలిపారు.పనులను నాణ్యతతో, గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం వంగవీటి మోహనరంగా 79వ జయంతి సందర్భంగా పట్నంలోని రంగా విగ్రహానికి మంత్రి వాసంశెట్టి సుభాష్ పూలమాల వేసి నివాళు లర్పించారు.ప్రజల కోసం పోరాడిన నాయకుడిగా మోహనరంగా సేవలు చిరస్మరణీయమని మంత్రి సుభాష్ పేర్కొన్నారు.

## కలియుగ వరదా.. కోనసీమ వాసా...

### భక్త జనసంద్రం... వాడపల్లి క్షేత్రం...

### స్వామివారి ఒక్కరోజు ఆదాయం, రూ,70, లక్షలు....

### భక్తుల సౌకర్యాల ఏర్పాట్లు పరిశీలించిన చైర్మన్ , ముదునూరి,డిప్యూటీ కమిషనర్ ఈఓ , నల్లం










**ఆత్రేయపురం, జూలై 04 (ప్రభాతవార్త).** ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని శనివారం వేలాది మంది భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.ఏడువారాల నోము ఆచరించే భక్తులతో మాడవీధులు కిక్కిరిసాయి. వేకువ జామున సుప్రభాత సేవతో ప్రారంభమైన దర్శన కార్యక్రమాలు... రాత్రి వరకు కొనసాగాయి.వృద్ధులు దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయడంతో పాటు, లొల్ల వంతెన నుంచి ఆలయం వరకు ఉచిత వాహన సౌకర్యం కల్పించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో క్యూలైన్లలో నిలబడి స్వామివారి దర్శన భాగ్యాన్ని పొందారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా ఏడు వారాల వెంకన్న వ్రతం ఆచరిస్తున్న భక్తులు అధిక సంఖ్యలో దర్శనానికి రావడం విశేషం. వారంతా అత్యంత భక్తి శ్రద్ధతో స్వామివారిని కనులారా వీక్షించి తరించారు. భక్తుల ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు ఎప్పటి కప్పుడు భక్తుల సౌకర్యాలపై ఆయనే స్వయంగా భక్తులను నేరుగా కలిసి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. శనివారం ఆలయానికి వచ్చిన భక్తులకు దర్శనానికి, ఇటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు అలాగే క్యూలైన్లు, మంచినీరు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు మెడికల్ క్యాంప్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్నదాన శాలలో అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. శ్రీ స్వామి వారి ఆలయంలో శనివారం మాడ వీధుల్లో ప్రదక్షిణలు చేస్తున్న సమయంలో ఓ భక్తుడు తన పర్సును జారవిడిచాడు. దీనిని గమనించిన ఆలయ సిబ్బంది వెంటనే పర్సును భద్రపరచి, అందులోని వివరాల ఆధారంగా సంబంధిత భక్తుడిని గుర్తించి అతనికి అప్పగించిన ఆలయ అధికారులు. స్వామిని దర్శించుకున్న తొంభైవేల మందికి పైగా స్వామివారిని దర్శించుకొన్నారని సుమారు ముప్పై అయిదు వేల మందికి పైగా అన్నప్రసాదం స్వీకరించారని ప్రత్యేక దర్శనాలు, ఇతర సేవల ద్వారా ఆలయానికి సుమారు రూ.70 లక్షల పైబడి ఆదాయం సమకూరినట్లు ఆయన తెలిపారు.. స్వామివారి సేవలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ కుమార్, మనోజ్, వర్మ, జూనియర్ అసిస్టెంట్ వై శ్రీనివాస్, వరప్రసాద్, గ్రామస్తులు ఏపుగంటి సుబ్బారావు, ఏపుగంటి వెంకటేష్ తదితరులు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంజీరా నాట్యాలయ , కాకినాడ , అమలాపురం వాస్తవ్యులు విద్యార్థులచే కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## వంగవీటికి ఎమ్మెల్సీ బొమ్మి ఘన నివాళులు




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై 4,ప్రభాతవార్త** దివంగత నేత వంగవీటి మోహనరంగా 79వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ గోడి గ్రామంలో క్యాంప్ కార్యాలయం నందు రంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వంగవీటి మోహనరంగా బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ప్రజానాయకుడని కొనియాడారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. నేటి యువత సామాజిక బాధ్యతతో ముందుకు సాగుతూ, ప్రజల కోసం సేవ చేసే తత్వాన్ని అలవర్చుకోవాలని, రంగా గారి సేవా భావాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు చెట్ల సత్యనారాయణ, బి ముఖేష్, బి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 602 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసిన కాకినాడ పోలీసులు :




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి జూలై 4 (ప్రభాతవార్త )** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ప్రత్యేక చొరవతో సి ఈ ఐ ఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ ) పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందించే కార్యక్రమాన్ని జిల్లా పోలీసులు విజయవంతంగా కొనసాగిస్తున్నారు. శనివారం నిర్వహించిన 12వ విడత మొబైల్ రికవరీ మేళాలో భాగంగా రూ.1,20,40,000 విలువైన 602 మొబైల్ ఫోన్లను వాటి యజమానులకు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ చేతుల మీదుగా అందజేశారు. సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా, జిల్లా ఐటీ కోర్ బృందం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఐ ఎం ట్రాకింగ్, జీపీస్ ఆధారిత ట్రేసింగ్, డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ నిఘా, డేటా విశ్లేషణ వంటి పద్ధతులను వినియోగించి ఈ మొబైల్ ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకుంది. ఇప్పటివరకు నిర్వహించిన 12 విడతల్లో మొత్తం 4,603 మొబైల్ ఫోన్లను రికవరీ చేయగా, వాటి మొత్తం విలువ రూ.7,68,67,000గా ఉంది. మొబైల్ రికవరీ విషయంలో రాష్ట్ర స్థాయిలో కాకినాడ జిల్లా విశేష ఫలితాలు సాధిస్తోందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్,మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. అలాగే సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు కాల్ చేయాలని లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ విజయవంతమైన మొబైల్ రికవరీలో కీలక పాత్ర పోషించిన జిల్లా ఐటీ కోర్ బృందం ఇన్‌స్పెక్టర్ డి. దుర్గా శేఖర్ రెడ్డి, ఐటీ కోర్ సిబ్బంది, డీసీఆర్‌బీ, పీసీఆర్, సంబంధిత డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు మరియు మొబైల్ రికవరీ బృంద సభ్యులను జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, తో పాటు అడిషనల్ ఎస్పీ (పరిపాలన) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎస్. శ్రీనివాసరావు, కాకినాడ ఎస్‌డీపీఓ పాటిల్ దేవరాజ్ మనీష్, ఐపీఎస్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీ డి. దుర్గా శేఖర్ రెడ్డి, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ ఎ. సన్యాసిరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీనివాస్ మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# వెదురు ఉత్పత్తులతో గిరిజన మహిళలకు ఆర్థికాభివృద్ధి

## -జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



**రంపచోడవరం, జూలై 4: ప్రభాతవార్త.** పోలవరం జిల్లాలో గిరిజన మహిళలు వెదురు ఉత్పత్తుల ద్వారా ఆర్థికంగా ఎదగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. శనివారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు వెదురు ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇవ్వడంతో పాటు మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని వన సంరక్షణ సమితుల పనితీరు, ఆదాయం, నిధుల వినియోగంపై వివరాలు సేకరించారు. ప్రతి కమిటీకి కేంద్ర ప్రభుత్వం రూ.15 లక్షలు కేటాయిస్తోందని, ఆ నిధులను మొక్కలు నాటి అభివృద్ధి చేసి గ్రామ అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. వెదురు ఉత్పత్తులపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించి, జఖీ= యాక్షన్ ప్లాన్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దేవరపల్లి గ్రామంలో అటవీ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యంత్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధికి డీఆర్డీఏ అధికారులు మరింత ప్రోత్సహించాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని ఆర్వో ప్లాంట్లను మూసివేస్తాం-ఎంపీడీవో మమత..



**అంబాజీపేట, జూలై 4, (ప్రభాతవార్త)** అనుమతులు, నిబంధనలు పాటించకుండా నిర్వహించే ఆర్వో ప్లాంట్ల పై శాఖాపరమైన చర్యలు తీసుకుని ప్లాంట్లను సీజ్ చేస్తామని ఎంపీడీఓ బి.మమత హెచ్చరించారు. అంబాజీపేటలో ఉన్న ఆర్వో ప్లాంట్లను ఎంపీడీఓ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మమత మాట్లాడుతూ ఆర్వో ప్లాంట్ నిర్వహించే వారి వద్ద అన్ని రకాల రిపోర్టులు, ప్రభుత్వ అనుమతి పొందిన సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆయా ప్లాంట్ల వద్ద పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్లాంట్లపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చిన వారిపై చర్యలు తప్పవన్నారు. అంతకుముందు ప్లాంట్కు సంబంధించి సర్టిఫికెట్లను పరిశీలించారు. నీటిని శుద్ధి చేసే యంత్రాలు ప్రభుత్వ అనుమతి పొందినవై ఉండాలని, నీటిని శుద్ధి చేసేందుకు అధిక మోతాదులో కెమికల్స్ వాడినా చట్టరీత్య నేరమని అటువంటి వారిని ఉపేక్షించబోమని డిప్యూటీ ఎంపీడీవో కంచి శ్రీనివాస్ తెలిపారు.వారి వెంట పంచాయతీ కార్యదర్శి కె.వి.వి సత్యనారాయణ,సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనం వంగవీటి రంగా జయంతి వేడుకలు



**రాజమహేంద్రవరం అర్బన్, జూలై4, (ప్రభాత వార్త)** ధవళేశ్వరం లో వంగవీటి మోహన రంగా 79వ జయంతి వేడుకలు ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు ఉదయం ధవలేశ్వరం గ్రామం గర్ల్స్ హై స్కూల్ వద్ద వంగవీటి రంగా విగ్రహం వద్ద రాధా రంగా మిత్రమండలి సభ్యులు మాజీ ఉపసర్పంచ్ మెండసత్తులు ఆధ్వర్యంలో వంగవీటి విగ్రహానికి పూలమాలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మెండసత్తులు మాట్లాడుతూ రంగా స్ఫూర్తి ఆశయాలను కొనసాగించే విధంగా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రంగా ఏ కులానికి చెందినవారు కాదని ఆయన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో యడ్ల వెంకటేష్,జేటి రామారావు,ఆళ్ల ఆనందరావు,సాధనాల శివ ,మెండ రాజేష్,ముత్యాలపోసికుమార్,శ్రీరంగం బాలరాజు,కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముద్దాల. అను,అడపా శ్రీను,మెండ. చినబాబు,ఏపీ ఎన్జీవో నాయకులు ఎన్.వి శ్రీనివాసరావు,గరగ శ్రీను,మేక సత్యనారాయణ. దూది సాయి,యడ్ల మహేష్, కిషోర్ నాయుడు,అడపా హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ వంగవీటి మోహన రంగ 79వ జయంతి-గొల్లపల్లి అమూల్య



**సఖినేటిపల్లి జూలై 04, ప్రభాత వార్త:** స్వర్గీయ వంగవీటి మోహన రంగ 79వ జయంతి సందర్భంగా మండలంలోని మోరిపోడు గ్రామంలో రంగా విగ్రహం వద్ద కుటమి శ్రేణులతో కలిసి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ గొల్లపల్లి అమూల్య నివాళులర్పించినారు. ఆమె మాట్లాడుచూ ప్రజల కోసం, కార్మిక సమాజం కోసం నిరంతరం పోరాడి వారికి అండగా నిలిచి ధైర్య సాహసాలు, ప్రజా సేవలో వారికి ఉన్న నిబద్ధత చిరస్మరణీయమైనవనీ. వారి ఆశయాలు, సేవా భావం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తూ సమాజానికి మార్గదర్శకంగా ఉంటాయని, పార్టీ నాయకులు వంగవీటి మోహన రంగ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భూపతిరాజు సాయిబాబా రాజు, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబు రాజు, మండల పార్టీ అధ్యక్షులు అడబాల సాయిబాబా, కాకి లక్ష్మణరావు, గోనిపాటి రాజు, రాపాక నవరత్నం, ముష్పర్తి నాని, బోణం చంటి, రాపాక మహేష్, కదలి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వంగవీటి మోహన్ రంగా 79వ.జయంతి



**మామిడికుదురు.జూలై 04(ప్రభాతవార్త)** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడి కుదురు మండలం బి.దొడ్డవరం గ్రామంలో శనివారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్ రంగా 79వ.జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అప్పన శ్రీ రామకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజలకు రంగా చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షులు నీతిపూడి బాల సత్యనారాయణ,పార్టీ మండల ఉపాధ్యక్షుడు బత్తుల సురేష్ బాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వాకపల్లి రాంబాబు,వానరాశి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## గంగవరం మండలంలో ఘనంగా రంగా 79వ జయంతి



**కె.గంగవరం, జూలై 4, (ప్రభాతవార్త):** కె గంగవరం మండలం లో వంగవీటి మోహన్ రంగా 79వ జయంతి అంగరంగ వైభవంగా ఆయన అభిమానులు నిర్వహించారు. గంగవరం, ఓడిముడి, సత్యవాడ, పామర్రు, కుందూరు, యర్రపోతవరం, బాలాంత్రం, మసకపల్లి,కోటిపల్లి, దంగేరు ఇలా మండలంలోని పలు గ్రామాల్లో ఆయన విగ్రహాలకు చిత్రపటాలకు పూలమాలలు వేసి, మిఠాయిలు చాక్లెట్లు కేకులు పంచిపెట్టారు. గంగవరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పేరాబత్తుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పెంటపాటి శ్రీను,సాధా వెంగళరావు, గంగాపత్తుల శ్రీనివాస్, కర్రి హరి,తుమ్మలపల్లి దుర్గారావు,పెంటపాటి ప్రసాద్, వీరబాబు,అభిమానులు, యువత కేక్ కట్ చేసి మిఠాయిలు చాక్లెట్లు పంచిపెట్టారు. ఇలా ఆయా గ్రామాల్లో ఆయన అభిమానులు 79వ జయంతి మహోత్సవాన్ని పండుగలా జరుపుకున్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే పునాది

### -వెలుగుబంటి రఘురామ్



**కడియం, జూలై 4 (ప్రభాతవార్త)** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్స్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం కడియం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడియం మండల టీడీపీ అధ్యక్షులు వెలుగుబంటి రఘురామ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. నేడు చేసే కృషి, చదువే రేపటి భవిష్యత్తుకు పునాది వేస్తుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా ప్రోత్సాహక పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు పల్లి ప్రసాద్, టీడీపీ నాయకులు జల్లి కృపారావు, తనికెళ్ల బల్లియ, రత్నకుమారి, హేమలత, కుమారి, కప్పల వెంకన్న, కాయల సత్యనారాయణ, పట్నాల శామ్యూల్, అయ్యప్ప,పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవరెడ్డి, ఉపాధ్యాయులు గంగాభవాని, శారద, వీరాజు, దాసరి శివతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఘనంగా అల్లూరి సీతారామరాజు 129వ జయంతి..



**అంబాజీపేట, జూలై 4, (ప్రభాతవార్త):** స్వాతంత్ర్య పోరాట విప్లవ యోధుడు,మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతిని ఆర్టీఐ కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల సెంటర్లో సీతారామరాజుచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గణపతి వీరరాఘవులు,ముత్యాల జమీల్, వీరిన గోపాలం, కొల్లూరి దివాకర్, మాచవరపు శివన్నారాయణ,ఉందుర్తి నాగబాబు,ఆదుర్తి నారాయణమూర్తి,చింతపల్లి వెంకటేశ్వరరావు, మాలే వెంకట దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం కడలి సాయిరామ్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

## పామర్రు లో రైతు అవగాహన కార్యక్రమం



**కె.గంగవరం, జూలై 4, (ప్రభాతవార్త):** కె గంగవరం మండలం పామర్రు గ్రామంలో శనివారం మండల వ్యవసాయ అధికారి సద్గురు మూర్తి ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారి జే మనోహర్ ముఖ్య అతిథిగా రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఏవో తెలిపారు. ఆత్మ వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సంతుల్య ఎరువుల వాడకం ద్వారా అధిక దిగుబడి పొందడానికి తీసుకోవాల్సిన సాగు చర్యలపై వివరించగా, పంట వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంటించరాదని వాటి వల్ల భూతాపం పెరిగి రైతులకు మేలు చేసే సూక్ష్మ క్రిములు నశిస్తాయని నేల ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. ఎరువులను సిఫారసు కు మించి వాడకుండా జీవ ఎరువుల పచ్చిరొట్ట పైర్లు వేసుకుని నేల ఆరోగ్యం బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని మనోహర్ కోరారు. రైతులందరూ తప్పనిసరిగా రసాయన ఎరువులతో పాటు పచ్చిరొట్ట ఎరువులు సమాంతరంగా వాడాలని వీటివల్ల భూసారం పెరిగి నీటి సామర్థ్యం పెరగడంతో ప్రధాన పోషకాలు అయినటువంటి నత్రజని భాస్వరం పొటాష్ ఎరువులు తగ్గించవచ్చని ఏవో సద్గురు మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సాదా వివి సత్యనారాయణ సొసైటీ సీఈవో శివ టిడిపి సీనియర్ నాయకులు దేవరపల్లి వెంకటేశ్వరరావు, హరిబాబు, శ్రీలక్ష్మి ,స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్టళ్లకు కాస్మోటిక్ కిట్ల పంపిణీకి రంగం సిద్ధం

### -గోడౌన్లో కిట్లను పరిశీలించిన జీసీసీ జీఎం విజయలక్ష్మి, మేనేజర్ బుచ్చిరాజు



**అడ్డతీగల, జులై 04, ప్రభాతవార్త** జీసీసీ పరిధిలోని ప్రభుత్వ హాస్టళ్లకు కాస్మోటిక్ కిట్ల పంపిణీకి అధికారులు సర్వం సిద్ధం చేశారు. జూన్, జూలై రెండు నెలలకు సంబంధించిన ఈ కిట్లను ఇప్పటికే కొన్ని హాస్టళ్లకు అందజేయగా, మరికొన్ని హాస్టళ్లకు పంపిణీ చేసేందుకు వీలుగా సిద్ధంగా ఉంచినట్లు జీసీసీ మేనేజర్ బుచ్చిరాజు తెలిపారు. శనివారం నాడు జీసీసీ జనరల్ మేనేజర్ (జీఎం) విజయలక్ష్మి, అడ్డతీగల జీసీసీ మేనేజర్ బుచ్చిరాజుతో కలిసి స్థానిక గోడౌన్లో నిల్వ ఉంచిన కాస్మోటిక్ కిట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కాస్మోటిక్ కిట్లను జీసీసీ పరిధిలోని మూడు మండలాల్లో గల ప్రభుత్వ హాస్టళ్లకు సరఫరా చేయడం జరుగుతుందని, విద్యార్థుల అవసరాల నిమిత్తం పంపిణీ ప్రక్రియను వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు.

## అల్లూరి శ్రీరామరాజు 129వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ



**అడ్డతీగల, జూలై 04 ప్రభాతవార్త** అడ్డతీగల మండలం పైడిపుట్ట గ్రామంలో విప్లవ వీరుడు అల్లూరి శ్రీరామరాజు 129వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మిస్తున్న అల్లూరి రచ్చబండ వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి జయంతి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం అడ్డతీగల ఆదివాసి భవనంలో జరిగిన సభలో అల్లూరి శ్రీరామరాజు స్వాతంత్ర్య ఉద్యమంలో చేసిన సేవలు, ఆదివాసీల హక్కుల కోసం చేసిన పోరాటాన్ని ప్రముఖులు స్మరించుకున్నారు.కార్యక్రమంలో ధన్వంతరి సహస్రాయ పీఠం అధినేత డాక్టర్ రవివర్మ, సంఘం గౌరవ అధ్యక్షుడు మంతెన వెంకట సత్యనారాయణరాజు, అధ్యక్షుడు సాగిన సత్యనారాయణరాజు, ప్రెసిడెంట్ వేటుకూరు కృష్ణంరాజు, కార్యదర్శి ఇళ్ల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు నాగార్జునరాజు, దంతులూరి సంతోష్ వర్మ, చోడిశెట్టి సుబ్బారావు, స్టార్ శ్రీను, అల్లూరి శ్రీరామరాజు, హర దీపక్, రాధమ్మ, పార్వతి తదితరులు, పైడిపుట్ట గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జనసేన బలోపేతానికి నాగబాబు ఏజెన్సీ పర్యటన

### -అభ్యర్థుల నుండి అర్జీలు స్వీకరణ



**రంపచోడవరం జులై 4 ప్రభాతవార్త.** జనసేన పార్టీ ఎమ్మెల్సీ నాగబాబు రంపచోడవరం పర్యటనలో భాగంగా పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండల బూత్ స్థాయి నుండి నియోజకవర్గ మరియు పార్లమెంట్ స్థాయి అభ్యర్థుల వరకు ఇన్చార్జీల నుండి అర్జీలు స్వీకరించారు. శనివారం స్థానిక ఆర్కా రెసిడెన్సిలో నిర్వహించిన సమావేశంలో జనసేన నాయకులు, కార్యకర్తలతో ఆయన చర్చలు జరిపారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, కూటమి ధర్మాన్ని గౌరవిస్తూ జనసేన పార్టీ కూటమితో కలిసి ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. కూటమి కొనసాగుతున్నంత కాలం జనసేన విడిగా పోటీ చేసే పరిస్థితి ఉండదని తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో ఎక్కడ పోటీ చేయాలన్నది కూటమి పెద్దలు నిర్ణయిస్తారని, ఆ నిర్ణయాల ప్రకారమే జనసేన అభ్యర్థులు పోటీలో ఉంటారని అన్నారు. జనసేన పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కట్టుబడి ఉన్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా పోలవరం జిల్లాలో స్వీకరించిన అర్జీలను పవన్ కళ్యాణ్ స్వయంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారని నాగబాబు వెల్లడించారు.

## ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి దర్శనంతో పులకించిన భక్త జనం.



**ఆత్రేయపురం, జూలై 04,(ప్రభాత వార్త)** అతి పురాతన పుణ్యక్షేత్రం ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి ఆలయం శనివారం భక్తులు పోటెత్తారు. ఐదు ప్రదిక్షణలు స్వామిగా పేరొందిన శ్రీ స్వామి వారిని దర్శించుకొని, మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం నిత్యాన్నదానంలో అన్నప్రసాదం స్వీకరించారు. ర్యాలి గ్రామస్థులు లలితా పారాయణదారులు శ్రీ లలితా సహస్రనామ, శ్రీ మణిద్వీప పారాయణలు చేశారు.శ్రీ స్వామి వారి సేవలో ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు లు ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. బెంగళూరు చెందిన మల్లాది వెంకట రవితేజ, శ్రీకృష్ణరేఖ దంపతులు శ్రీ స్వామి వారిని దర్శించుకుని శ్రీస్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ.5116/- వేలు విరాళంగా అందించారు. దాతలకు ఆలయ అర్చకులు వేదమంత్రాలతో శ్రీ స్వామివారి దర్శనం చేయించి వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు లు శ్రీ స్వామి వారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు.

## ఘనంగా అల్లూరి 129 వ జయంతి వేడుకలు...



**ఆత్రేయపురం, జూలై,04,(ప్రభాత వార్త)** స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను మండలంలోని ఆత్రేయపురం, తాడిపూడి, వెలిచేరు, ర్యాలి, లొల్ల గ్రామాల్లో నందు శనివారం ఘనంగా నిర్వహించారు. మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు లు అల్లూరి సీతారామరాజు 129 వై జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం కూసంపూడి మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శమని అన్నారు.ఆయన చూపిన దేశభక్తి, ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుటమి నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అల్లూరి జయంతి



**పెదపూడి.ప్రభాతవార్త** అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం గొల్లలమామిడాడలో మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు మురమళ్ళ వెంకటరమణ మాట్లాడుతూ దేశం కోసం జీవించడం గొప్పది దేశం కోసం ప్రాణ త్యాగం చేయడం మరింత గొప్పది అల్లూరి సీతారామరాజు జీవితం భారత స్వతంత్ర్య సమరంలో ధైర్యం త్యాగం దేశభక్తికి నిలువెత్తు నిదర్శనం అయిన ఆదర్శాలు నేటికీ యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓ బి సి మోర్చా వైస్ ప్రెసిడెంట్ కడిమి వీర వెంకట మురళీకృష్ణ, మండల ఓబిసి మోర్చా అధ్యక్షులు కేత హరిబాబు, మండల ఓ బి సి మోర్చా ప్రధాన కార్యదర్శి వట్టూరి కృష్ణ సుధాకర్, భీమన్న చత్రపతి శివాజీ, చింతా ఆదిలక్ష్మి, బిజెపి కార్యకర్తలు గ్రామ ప్రజలు ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

## సర్ కు అందరూ సహకరించాలి

### -ఎంఆర్ఓ: సీతాపతిరావు

**పెదపూడి.ప్రభాతవార్త** పెదపూడి మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాలు నందు అనపర్తి నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఎం రాజా రమేష్ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపీడీవో నరేంద్ర రెడ్డి, మండల తాసిల్దార్ సీతాపతి రావు, మండలానికి చెందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ వాటర్ జాబితా సవరణ కొరకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అఖిలపక్ష నాయకుతో ఈఆర్వో సవివరంగా ప్రస్తుతం జరుగుతున్న సర్ ప్రోగ్రాం గురించి వివరంగా చెప్పి రాజకీయ పార్టీలకు చెందిన బిఎల్ఈ లను సహకరించాలని కోరారు. ఓటర్ లిస్ట్ లో అనార్హులు ఎవరు ఉండకూడదని, అలాగే అర్హులు ఎవరు మిస్ అవ్వకుండా చూడాలని ఆయన రాజకీయపక్ష నాయకులను కోరారు. ప్రస్తుతం సర్ ప్రోగ్రాం లో పి ఎల్ వో లు, సూపర్వైజర్లు, ఏ ఈ ఆర్ ఓ లు చేస్తున్న పనులకు రాజకీయ పార్టీలకు చెందిన బి ఎల్ ఏ లు సహకరించాలని అందువల్ల సంపూర్ణమైన వాటర్ లిస్టులు తయారవుతాయని డ్రాఫ్ట్ పబ్లికేషన్ అయ్యాక ఏవైనా అభ్యంతరాలు ఉంటే అప్పుడు రెక్టిఫై చేసుకునే అవకాశం ఉందని వీఆర్వో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

## పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా వంగవీటి స్థానం పదిలం

### -వాడపాలెంలో నివాళులర్పించిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట,జూలై04,(ప్రభాతవార్త)** పేద ప్రజల గుండెల్లో దివంగత వంగవీటి మోహనరంగా స్థానం శాశ్వతంగా ఉంటుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు శనివారం వంగవీటి జయంతి సందర్భంగా వాడపాలెం సెంటర్లో ఉన్న వంగవీటి మోహన రంగా విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళు లర్పించారు బడుగు బలహీన వర్గాలకు ధైర్యాన్ని ఇచ్చిన నాయకుడు రంగా అన్నారు రాష్ట్ర రాజకీయాల్లో ఆయన స్థానం సుస్థిరంగా నమోదు చేసుకున్నారని కొనియాడారు ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారుఆవిడిలోమండల పరిధిలోని ఆవిడి గ్రామంలో వంగవీటి మోహన రంగా జయంతి సందర్భంగ ఆయన అభిమానులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు కృష్ణా జిల్లాకు రంగా నామకరణం చేయాలని ఈ సందర్భంగా రంగా అభిమానులు ప్రభుత్వాన్ని కోరారు కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దూళి సూరిబాబు జంగా నాగేశ్వరావు పడమట చిన్న ఎడ్ల నరేష్ ధూళి శేషారావు దాసరి వీరబాబు తదితరులు పాల్గొన్నారు

## కోటిపల్లి-నర్సాపురం రైల్వే మార్గాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి..రైల్వే సాధన సమితి



**మామిడికుదురు.జూలై 04(ప్రభాతవార్త)** మండలం లోని గోగన్నమఠం గ్రామానికి శనివారం విచ్చేసిన కేంద్ర ఉక్కు,భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మను కోనసీమ రైల్వే సాధన సమితి నాయకులు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు, సుబ్రహ్మణ్యం, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా కోటిపల్లి--నర్సాపురం రైల్వే లైన్ ను త్వరితగతిన పూర్తి చేయాలని వారు కేంద్ర మంత్రిని కోరుతూ వినతిపత్రం అందజేశారు.ఈ రైల్వే ప్రాజెక్టును రెండు విడతలుగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.మొదటి విడతలో నర్సాపురం నుంచి అమలాపురం వరకు, రెండో విడతలో కోటిపల్లి నుంచి అమలాపురం వరకు రైల్వే మార్గం నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.సాధన సమితి నాయకులు మాట్లాడుతూ నర్సాపురం వరకు మూడు రైళ్లను తీసుకురావడంలో కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. కోనసీమ ప్రాంత అభివృద్ధికి కోటిపల్లి--నర్సాపురం రైల్వే లైన్ అత్యంత కీలకమని,ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రజల రవాణా,వ్యాపార,ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని వారు మంత్రికి వివరించారు.

## యానాం అధికారులపై అఖిలపక్ష నాయకుల ఆగ్రహం



**తాళ్లరేవు జూలై 4 (ప్రభాతవార్త):** యానం ఎస్ టి పి ప్లాంట్ తూర్పు పేటలో ఏర్పాటు చేయడానికి యానం బి డబ్ల్యు డి అధికారులు ప్రయత్నాలు చేస్తుండగా తాళ్లరేవు మండల అఖిలపక్ష నాయకులు ఘటనా స్థలానికి చేరుకొని వారిని ఆ ప్రాంతం నుంచి వెళ్ళగొట్టారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు జక్కల ప్రసాద్ బాబు, ధూళిపూడి నాగేంద్రప్రసాద్, పిల్లి సత్తిబాబు విలేకరులతో మాట్లాడారు. కాకినాడ ఆర్డిఓ మల్లిబాబు ఎస్ టి పి ప్లాంట్ ఏర్పాటు చేయబోయే స్థలం వివాదాస్పదమైనదని ఈ స్థలం వివాదం హైకోర్టు పరిధిలో ఉందని కాకినాడ ఆర్డిఓ మల్లిబాబు శుక్రవారం తేల్చి చెప్పారన్నారు. ఇది ఇలా ఉండగా శనివారం యానం అధికారులు కాంట్రాక్టర్ సహాయంతో ఆ ప్రాంతంలో మరొక లారీ గ్రావెల్ వేయడాన్ని తప్పు పట్టారు. కోర్టు పరిధిలో ఉండగా ప్లాంట్ ఏర్పాటుకు కోసం గ్రావెల్ ఎలా వేస్తారని యానం అధికారులను మీడియా ద్వారా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు గంజా సూరిబాబు, వడ్లమూడి సతీష్, నిమ్మకాయల మూర్తి, ఆకుల వెంకన్న, బొంతు మోహన్, ధూళిపూడి నాయుడు, గోపాల్, కాళీ , ఎలిపే నాగేశ్వరరావు, తూర్పు పేట ప్రజలు, పాల్గొన్నారు.

## విప్లవ వీరుడు అల్లూరికి జయంతి వేడుకలు



**రాజవొమ్మంగి, జూలై 04, ప్రభాతవార్త** విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు 130 వ జయంతి వేడుకలు రాజవొమ్మంగి మండలంలో గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించారు. రాజవొమ్మంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అల్లూరి విగ్రహానికి దంతులూరి శివరామచంద్రరాజు, ఎంపిపి గోము వెంకటలక్ష్మి,లు భారీ గజమాలను వేసి అయన మన్య ప్రజల కోసం చేసిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో హెచ్.ఎం. ఆదిలక్ష్మి, డి. శివరామచంద్రరాజు, గోము వెంకటలక్ష్మి, చీడిపల్లి అప్పారావు, వెంకటేష్ రాజు, కనిగిరి దుర్గాప్రసాద్, నోరి దత్తాత్రేయ, బుంగా రాజ్ కుమార్, కృష్ణవర్మ మాష్టారు, గుప్త, పెరుమాళ్ళ రాజు, భాస్కర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమం సీతారామరాజు చిత్రపటానికి ఎంపిపి గోము వెంకటలక్ష్మి పూలమాలాలను వేశారు. ఏ. పి. ఓ శ్రీనివాస్, మండల పరిషత్, వెలుగు, పి. వి. రాంజీ సిబ్బంది పాల్గొన్నారు. రిటైడ్ ఎంప్లాయిస్ కార్యాలయం వద్ద కృష్ణవర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి, అరకు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు దంతులూరి శివరామచంద్రరాజులు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసారు. రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ లో అల్లూరి విగ్రహానికి సి. ఐ. సన్యాసి నాయుడు, ఎస్. ఐ. వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులను అర్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.చికిలింత పంచాయితీ దుర్గానగర్ గ్రామంలో అల్లూరి విగ్రహానికి ఉపాధ్యాయులు రమణ, సచివాలయ డి. ఏ సాగర్ పూలమాలాలను వేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు పాండవుల సత్యనారాయణ, పీసా ఉపాధ్యక్షులు పొత్తూరి రాంబాబు, బిత్తరి జయబాబు, కన్నూరి చిన వెంకటరమణ, కోసూరి బాలరాజు, ముర్ల నూకరాజు, మేలిన రాజబాబు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జీడిమామిడి తోటలు పరిరక్షణకు శిక్షణ



**రాజవొమ్మంగి, జూలై 04, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం శరభవరం శనివారం విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ( టాటా ట్రస్టు ) ఆధ్వర్యంలో గిరిజనుల జీవనోపాదులు మెరుగుదల దోహదపడే జీడిమామిడి తోటకు వచ్చే చీడపీడలు నివారణకు చేపట్టాల్సిన పనులపై ప్రోగ్రామ్ అసోసియేట్ నారాయణ రైతులకు వివరించారు. ముదుర జీడిమామిడి తోటల్లో చెట్ల కాండానికి సున్నం, జిగురు మిశ్రమాన్ని పూతగా పూయడం వల్ల తల్లి పురుగు చెట్లపై గుడ్లు పెట్టకుండా నివారణ చేయవచ్చునని అన్నారు. కాండం తొలిచే పురుగు నివారణ జరుగుతుందన్నారు. రైతులతో కలిసి సున్నం పూత పూయించారు. ఈకార్యక్రమంలో ప్రోగ్రామ్ అసోసియేట్ నారాయణ, సిఆర్పీ అనసూయ, రైతులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ఎల్ ఈ డి టీవీ బీరువా బహుకరణ



**కొత్తపేట, జూలై 4, (ప్రభాతవార్త)** కొత్తపేట మండలం లో మోడేకుర్రు గ్రామ చివర లైన్ పేట గ్రామస్తులైన కవల సోమరాజు పాఠశాలకు ఎల్ఈడి టీవీ బీరువా లను శనివారం బహుకరించారు సోమరాజు హైదరాబాద్ లో బిజినెస్ లో స్థిరపడ్డారు తన గ్రామం లోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల కు సుమారు 27000 రూపాయల విలువ చేసే ఎల్జి ఎల్ ఇ డి టీ వీ ఒక బీరువా బహుకరించారు ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖధికారి ఎమ్ హరి ప్రసాద్ విచ్చేసినారు ఈ కార్యక్రమం లో ఎస్ ఎం సి చైర్ పర్సన్ తరిట్ల వెంకట లక్ష్మి విద్యార్థుల తల్లి తండ్రులు గ్రామస్తులు కవల సత్యనారాయణ గన్నవరపు జోజి గన్నవరపు నరసింహ మూర్తి ఇతరులు పాల్గొన్నారు గౌరవ ఎం ఇ ఓ దాతలను అభినందించి ఘనంగా సత్కరించారు

మరిన్ని వార్తలు 6లో

## మార్కెట్ బాధితులకు రూ.2 లక్షల విరాళం




రామచంద్రపురం,జూలై 04(ప్రభాతవార్త): ద్రాక్షారామం మార్కెట్ అగ్నిప్రమాద బాధితుల సహాయార్థం ప్రముఖ వైద్యుడు,సత్య స్కాన్స్ అండ్ డయాగ్నస్టిక్స్ అధినేత డాక్టర్ కాద వెంకటరమణ రూ.2 లక్షల విరాళం అందించారు.విరాళం చెక్కును రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు అందజేశారు.బాధితులను ఆదుకునేందుకు మంత్రి సుభాష్ ఇచ్చిన పిలుపు మేరకు స్పందించి విరాళం అందించిన డాక్టర్ వెంకటరమణను మంత్రి అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అగ్నిప్రమాద బాధితుల పునరావాసానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని,మార్కెట్‌లో నూతన షెడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు గరికపాటి సూర్యనారాయణ,దంగేటి గౌరీశంకర్ పాల్గొన్నారు.

# 32 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన

## జిల్లా టిడిపి అధ్యక్షులుజ్యోతుల నవీన్



జగ్గంపేట జూలై 4 (ప్రభాతవార్త ) జగ్గంపేట నియోజకవర్గంలోని 70 మంది లబ్ధిదారులకు రూ. 32 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ శనివారం పంపిణీ చేశారు. స్థానిక రావులమ్మ నగర్ టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ చెక్కులు అందజేశారు. మండలాల వారీగా జగ్గంపేట మండలం 17 మంది కిర్లంపూడి మండలం11 మంది గోకవరం మండలం 23 మంది గండేపల్లి మండలం11 మంది ఇతరులు 2 మంది ఎల్‌ఓసీలు 6 మొత్తం 70 మందికి రూ. 32 లక్షల సహాయం అందించారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం అని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికే మొదటి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పవన్ కళ్యాణ్ ప్రజల సమస్యలపై చూపుతున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కులం, మతం, పార్టీ చూడకుండా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందేలా చూస్తున్నారని కొనియాడారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నిబద్ధత వల్లే పేదలకు సత్వర సహాయం అందుతోందని, ఇదే నిజమైన ప్రజా పాలన అని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, జగ్గంపేట, గోకవరం మండల టిడిపి అధ్యక్షులు జీను మణిబాబు, పిల్ల చంటిబాబు, రేఖ బుల్లి రాజు, జాస్తి వసంత్, పాలకుర్తి ఆదినారాయణ, య ల్లమిల్లి సీఎం, పురం శెట్టి శివాజీ, పులపర్తి బుజ్జి అధిక సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఘనంగా వంగవీటి మోహన రంగా జయంతి వేడుకలు



ఆత్రేయపురం, జూలై.04.(ప్రభాత వార్త) మండల పరిధిలో వాడపల్లి, తాడిపూడి, వెలిచేరు, ఉచ్చిలి, గ్రామాల్లో వంగవీటి మోహన రంగ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మండల టిడిపి అధ్యక్షులు కూనంపూడి రామకృష్ణంరాజు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఏపుగంటి వెంకటేష్,ముళ్ళపూడి భాస్కరరావు, తెలుగు యువత అధ్యక్షులు వెన్నా అనిల్ కుమార్ జుజ్జవరపు హరిబాబు, తోట రజని, సొసైటీ అధ్యక్షులు నాగిరెడ్డి సత్యనారాయణ లు పాల్గొని ఆ మహనీయుడికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం స్వీట్లు పంచారు.ఈ కార్యక్రమంలో తాడిపూడి గ్రామ టీడీపీ పార్టీ అధ్యక్షులు కూనంపూడి రమేష్ రాజు, కాపు నాయకులు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రంగా సేవలు స్ఫూర్తిదాయకం:పిల్లి సూర్యప్రకాష్



రామచంద్రపురం,జూలై 04(ప్రభాతవార్త): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్ రంగా 79వ జయంతి సందర్భంగా చప్పిడి వారి సావరంలోని రంగా విగ్రహానికి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతిగా రంగా సేవలందించారని,యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూర్య ప్రకాష్ పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి,కన్వీనర్ శ్రీధర్, మాజీ కౌన్సిలర్లు పెంటపాటి శ్రీనివాసరావు,పోతంశెట్టి గోపాలకృష్ణ,పాలపర్తి శ్వేతా పావని మధు,తోట అమ్మాజీ సూరిబాబు,పట్టణ మహిళా అధ్యక్షురాలు మల్లిడి సాయి లక్ష్మి,పట్టణ కాపు సంఘం కార్యదర్శి పిట్ట నాని,16వ వార్డు కార్యదర్శి గంటా దుర్గారావు,గుంటముక్కల రామకృష్ణ,సూరంపూడి ప్రసాద్,వాడపర్తి దుర్గా రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరంలో అల్లూరి త్యాగం చిరస్మరణీయం: గిరిజాల బాబు



కడియం ,జూలై 4 (ప్రభాతవార్త) భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో బ్రిటిష్ పాలనకు ఎదురొడ్డి గిరిజనుల హక్కుల కోసం సాహసోపేతంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు దేశానికి స్ఫూర్తి ప్రదాత అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల బాబు అన్నారు.అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా శనివారం కడియంలో ఆయన విగ్రహానికి గిరిజాల బాబు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వేచ్ఛ, ఆత్మగౌరవం కోసం అల్లూరి సాగించిన పోరాటం భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. దేశభక్తి, త్యాగనిరతి, ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన అల్లూరి ఆశయాలు నేటి యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పున్నమరాజు వీర్రాజు, దొడ్డ బుజ్జి, కడియం గణేష్, మైపాల వాసు, కొత్తపల్లి బాలాజీ, మందపల్లి రాజ్ కమల్ తదితరులు పాల్గొని అల్లూరి సీతారామరాజుకు ఘనంగా నివాళులర్పించారు.

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పరిశీలన..

### -జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్..



ప్రత్తిపాడు, జూలై 4 (ప్రభాతవార్త) ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా శనివారం మండలంలో ప్రత్తిపాడు, లంపకలోవ గ్రామాల్లో జరుగుతున్న సవరణ పనులను నియోజకవర్గ నోడల్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి డి. తిప్పే నాయక్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఎం. సూర్యప్రభ, ఆర్ ఐ గోపాలకృష్ణ, వీఆర్వో మల్లికాసులు,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

## మహిళా చట్టాలు.. గంజాయి వల్ల నష్టాలపై అవగాహన



రాజవొమ్మంగి, జూలై 04. ప్రభాతవార్త రాజవొమ్మంగిలో శనివారం వారపు సంత సందు రాజవొమ్మంగి ఎస్. ఐ. వెంకట్రావు ఆధ్వర్యంలో సి. ఐ. సన్యాసినాయుడు మహిళా చట్టాలు, గంజాయి వల్ల వచ్చే నష్టాలపై సంతకు వచ్చిన వారికి అవగాహన కల్పించారు. శక్తి యాప్ ఉపయోగాలను వివరించారు. గంజాయి సాగు, అమ్మడం, రవాణా, సహకరించడం కూడా నేరమని సి. ఐ. సన్యాసినాయుడు తెలిపారు. గంజాయితో పట్టుబడితే కుటుంబాలు చిన్నాభిన్నంతో బాటు ఆగ్రామానికి చెడ్డపేరు వస్తుందన్నారు. ఆన్ లైన్ ఫోన్లుకు స్పందించి ఓ టి. పి లు చెప్పరాదని అన్నారు. గంజాయి సమాచారం చెప్పేవారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. పశువులను రాత్రి వేళల్లో వదిలి వేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో ఎస్. ఐ. వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు

### -విప్లవ వీరుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పిసిసి మెంబర్ ధరణాలకోట శ్రీను



ప్రత్తిపాడు, జులై 4 (ప్రభాతవార్త) ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రంలో మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడులోని అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో పిసిసి మెంబర్, డిసిసి ఉపాధ్యక్షులు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధరణాలకోట శ్రీను మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మన్యం ప్రజలను ఏకం చేసి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహోన్నత వ్యక్తి అల్లూరి అని కొనియాడారు. ఆయన పోరాట పటిమ, దేశభక్తి నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొప్పన కోటేశ్వరావు, కందిమల్ల శామ్యూల్, ఏనుగుపల్లి రాంబాబు, ఈరుగుల చక్రంతో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రంగా ఆశయాలు చిరస్మరణీయం..

### -జేగురుపాడులో ఘనంగా 79వ జయంతి వేడుకలు



కడియం: జూలై 4 (ప్రభాతవార్త)ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా 79వ జయంతిని కడియం మండలం, జేగురుపాడు గ్రామంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా చిత్రపటానికి నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చివరి శ్వాస వరకు పోరాడిన ధీశాలి వంగవీటి మోహనరంగా అని కొనియాడారు. కుల, మతాలకు అతీతంగా ప్రజల మన్ననలు పొందిన ఆయన ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి సూర్య రామకృష్ణ, పాతూరు రాజేష్, కర్రీ చిన్నబాబు, కంబాబత్తుల సూరి కుమార్, రంకిరెడ్డి చిట్టయ్య, గోనం నాగేశ్వరరావు,వనమాలి బాలాజీ,చిక్కాల వంశీ, కర్రీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


## జగ్గంపేటలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు

### -నివాళులు అర్పించిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు :



జగ్గంపేట జూలై 4 (ప్రభాతవార్త ) జగ్గంపేట స్థానిక గోకవరం రోడ్డులోని క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అప్పలరాజు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు అంటే తెలుగు జాతి పౌరుషానికి ప్రతీక. కేవలం 27 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ పాలకుల గుండెల్లో నిద్రలేకుండా చేసిన ధీశాలి. తుపాకీకి విల్లంబులతో సమాధానం చెప్పిన యోధుడు. అడవి బిడ్డల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం ప్రాణాలర్పించిన త్యాగమూర్తి. ఆయన పోరాట స్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకం. మన్యం ప్రజల విముక్తి కోసం సాగించిన రంప ఉద్యమం భారత స్వాతంత్ర్య చరిత్రలో సువర్ణ అధ్యాయం." అలాగే ఆర్థికంగా వెనుకబడిన క్షత్రియ కుటుంబాలను ఆదుకునేందుకు జగ్గంపేట క్షత్రియ పరిషత్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఎస్వీఎస్ అప్పలరాజు స్పష్టం చేశారు. సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమల రాజు మురళి రాజు, పాకలపాటి రవి వర్మ, చిట్టిబాబు మాస్టారు రాజు, సత్తిబాబు రాజు, దంతులూరి కృష్ణంరాజు, మంతెన శంకుబాబు రాజు, దాట్ల కృష్ణంరాజు, గొట్టిముక్కల రఘురామరాజు, మంతెన శ్రీహర్ష రాజుజగ్గంపేట క్షత్రియ పరిషత్ సభ్యులు, పలువురు ప్రముఖులు, స్థానిక పెద్దలు పాల్గొని అల్లూరికి నివాళులర్పించారు.

## రంపచోడవరం ఎస్.టి. కమిషన్ కార్యాలయంలో మహనీయులకు ఘన నివాళులు.



రంపచోడవరం జులై 4 ప్రభాతవార్త. అల్లూరి సీతారామరాజు జయంతి, పింగళి వెంకయ్య వర్ధంతి, స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్.టి. కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి రంపచోడవరం ఎస్.టి. కమిషన్ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు గిరిజనుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన మహావీరుడని, పింగళి వెంకయ్య జాతీయ పతాక రూపకర్తగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. స్వామి వివేకానంద యువతకు ఆత్మవిశ్వాసం, దేశభక్తి, సేవాభావం నేర్పిన మహనీయుడని కొనియాడారు. ఈ ముగ్గురు మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టి దేశాభివృద్ధి, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గిరిజన నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## 'నో అడ్మిషన్' ప్రధానోపాధ్యాయుడికి సత్కారం



యు.కొత్తపల్లి, జూలై 4(ప్రభాతవార్త) మూలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాలలో భారీగా చేరికలు పెరగడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు 'నో అడ్మిషన్' బోర్డు పెట్టడంతో యావత్ మండలంతో పాటు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి వెళ్ళింది. తన సామాజిక మాధ్యమంలో మూలపేట జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడిని, ఉపాధ్యాయ సిబ్బంది ప్రశంసించారు. దీంతో ఉపాధ్యాయులకు దక్కిన గౌరవం, ప్రశంసలు అన్నీ ఇన్నీ కావు. శనివారం జనసేన పార్టీ మండల అధ్యక్షులు రావు అక్షయ్ ఆధ్వర్యంలో పలువురు జనసేన నాయకులు ప్రధానోపాధ్యాయుడు, శ్రీనివాసరావును ఉపాధ్యాయ సిబ్బందిని శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పాఠశాలకు, విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులు, సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మూలపేట జనసేన పార్టీ ఇంచార్జ్ రామిశెట్టి రాంబాబు, జనసేన నాయకులు కాకాడ శ్రీనివాస్, సిద్ధి నాగు, కోడా చిన్నబాబు, సిద్ధి మురళి, మేరుగు రాజారావు కింతాడ చిన్నిబాబు, వీర మహిళలు మాజీ ఎంపీటీసీ ముప్పిడి అప్పయ్యమ్మ, అమలదాసు లలిత తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మిడివరంలో ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంత్యుత్సవాలు



ముమ్మిడివరం జులై 4 (ప్రభాతవార్త )ముమ్మిడివరం మండలంలోని పలు గ్రామాల్లో మన్యం వీరుడు స్వతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతోత్సవాలు ఘనంగా నిర్వహించారు చిన్న కొత్తలంక గ్రామంలో ముమ్మిడివరం మండల తెలుగు యువత అధ్యక్షులు పి రవివర్మ అధ్యక్షతన భారీకే కట్ చేశారు ఈ సందర్భంగా రవివర్మ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు విజయనగరం జిల్లాలోని ప్రస్తుతం విశాఖపట్నం జిల్లాగా పాండ్రంగి గ్రామంలో 1897 వ సంవత్సరం జులై 4వ తేదీన జన్మించారని చిన్నతనం నుంచే ఆయనకు వేదాంతం జ్యోతిష్యం ఆయుర్వేదం మరియు గుర్రపు స్వారీ వంటి విద్యల్లో మంచి పట్టు ఉండేదని సాధువుల జీవనశైలి పట్ల ఆకర్షితులై మన్యం అడవి ప్రాంతంలోని తిరుగుతూ అక్కడి గిరిజనుల కష్టాలు గుర్తించి వారికి సహాయ సహకారంగా ఉండేవారు అన్నారు గిరిజనుల హక్కుల కోసం మన్యంప్రాంతరక్షణ కోసం ప్రాణాలు తెగించి పోరాడినందుకుగాను ప్రజలు ఆయన గుండెలో పెట్టుకుని మన్యం వీరుడు అని పిలుచు కున్నారు బ్రిటిష్ వారు బ్రిటిష్ సైన్యంతో అత్యాధునిక తుపాకులతో వస్తే రాజు గారి సైన్యం కేవలం బలంబులు సాంప్రదాయ అటవీ ఆయుధాలతోనే వ్యూహాలు పని బ్రిటిష్ సైన్యాన్ని సైతం గడగడలాడించారు అల్లూరిని పట్టుకోవటానికి బ్రిటిష్ ప్రభుత్వం రోధర్ ఫర్డ్ అనే క్రూరమైన బ్రిటిష్ అధికారిని నియమించి అమాయక గిరిజనులను బ్రిటీ సైన్యం చిత్రహింసలు చేసి హింసిస్తున్న క్రమాన్ని చూసి అల్లూరి సీతారామరాజు గారు స్వయంగా లొంగు పోవాలని నిర్ణయించుకున్నారు 1924 వ సంవత్సరం మే 7వ తేదీన చింతపల్లి అడవుల్లో సీతారామరాజు గారిని బ్రిటిష్ సైన్యం బంధించి తుపాకులతో కాల్చి చంపారు. ఆయన చివరి క్షణంలో కూడా బ్రిటిష్ తుపాకులకుకూడా భయపడకుండా గుండెలను ఎదురు పెట్టి నిలబడిన అద్భుతమైన ధైర్శాలి అయిన ఆయన భౌతికంగా మన మధ్యన లేకపోయినా ఆయనే మనకు ఇచ్చిన స్ఫూర్తి ఆలోచన విధానం ఆయన జీవిత చరిత్ర చదివితేనే ఒళ్ళు పులకరించే అంత గొప్ప వీరత్వం మన కళ్ళ ముందు ఎదురు తిరుగుతూనే ఉందని పత్సమట్ల రవివర్మ పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ముదునూరి పద్మనాభ రాజు పెద్దిరెడ్డి గోపాలకృష్ణ వనచర్ల వెంకటేశ్వరరావు పెద్దిరెడ్డి సుబ్రహ్మణ్యం పొత్తూరి కాశి విశ్వనాథ్ రాజు పొత్తూరి సత్యనారాయణ రాజు పొత్తూరి అమ్మిరాజు గొల్లపల్లి ధర్మారావు పచ్చమట్ల ఉదయభాస్కర వర్మ పొత్తూరి గణపతి వర్మ చైతన్య వర్మ గ్రామ సచివాలయ సిబ్బందితో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు

## నిత్యం విద్యుత్ అంతరాయలతో సతమతం..!

### - ఇబ్బందులు పడుతున్న కూనవరం, వి ఆర్ పురం మండల ప్రజలు - సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్



కూనవరం, జులై 4, ప్రభాతవార్త : కూనవరం మండలంలో తరచూ విద్యుత్ అంతరాయాలతో కూనవరం, వి. ఆర్ పురం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీ మర్త శ్రీ రామ్మూర్తి భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు ఇటువంటివి సంభవించ లేనప్పటికీ గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని అన్నారు.విద్యుత్ కోతల కారణంగా విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతుందన్నారు. చిన్న వ్యాపారులు, రైతులు, సాధారణ వినియోగదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగునీటి సరఫరా, గృహ అవసరాలు, విద్యుత్‌పై ఆధారపడిన ఇతర పనులు సైతం నిలిచిపోతున్నాయన్నారు.ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేయడం సరైంది కాదని స్థానికులు అభిప్రాయపడ్డారు . కింద స్థాయి సిబ్బంది రాత్రి పగలు కష్ట పడి పని చేసినా ఎక్కడో ఒక చోట సమస్య తలెత్తుతుందన్నారు. ఈ సమస్య పై సంబంధిత విద్యుత్ శాఖ ఉన్నత అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ అంతరాయాలకు గల కారణాలను వెల్లడించాలన్నారు. విద్యుత్ అధికారులు నిర్లక్ష్య వైఖరిని విడనాడి నిరంతర విద్యుత్ సరఫరా అందేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, నాగమణి, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, ఎంపీటీసీ అమ్మాజి, మాజీ ప్రజా ప్రతినిధులు బొగ్గా వెంకమ్మ, తాళ్లూరి శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, తెల్లం తమ్మయ్య, మడెం బాబురావు, నానుపల్లి హరిబాబు, శ్రీరాములు, లక్ష్మయ్య కన్నయ్య, ధర్మయ్య, దన్నూరి శ్రీనివాసరావు, భీస్మారావు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## మన్యం వీరుడికి ఘన నివాళి



సీతానగరం, జూలై 04, (ప్రభాతవార్త) :మండలంలోని చినకొండేపూడి గ్రామంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి వైకాపా అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మన్యం గిరిజనులను సంఘటితం చేసి బ్రిటిష్ పాలనను గడగడలాడించిన విప్లవ వీరుడు సీతారామరాజు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, చల్లమళ్ళ సుజీరాజు, గంటా శ్రీనివాసరావు, చేకూరి నాని, తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లి నిరాకరణ.. యువతి ఆత్మహత్య

### -వరుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన కడియం పోలీసులు




కడియం జూలై 4 ప్రభాతవార్త కడియం మండలం జక్కంపూడి నగర్‌లో వివాహం ఖరారైన యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కడియం సీఐ ఏ. వెంకటేశ్వరరావు తెలిపారు.సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. జక్కంపూడి నగర్‌కు చెందిన కేశనకుర్తి సత్యనారాయణ (59)కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె కేశనకుర్తి ఉమాదేవి (25) బి.టెక్ పూర్తి చేసి అవివాహితగా ఉంది. ధవలేశ్వరం గ్రామానికి చెందిన గొర్రెల నాగ సుబ్రహ్మణ్యం 2022లో ఆమెకు పరిచయమయ్యాడు. అనంతరం ఇరు కుటుంబాల పెద్దలు చర్చించి 2026 మార్చిలో వివాహానికి అంగీకరించగా, జూన్ 24న వివాహం జరిపించాలని నిర్ణయించారు.అయితే నాగ సుబ్రహ్మణ్యం ఉమాదేవిని మానసికంగా వేధిస్తూ, ఆమె చనిపోతేనే తనకు మనశ్శాంతి ఉంటుందని, ఆత్మహత్య చేసుకుంటే తన సమస్యలన్నీ తీరిపోతాయని పదేపదే చెప్పి వేధించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని సీఐ తెలిపారు. పెద్దల జోక్యంతో మరోసారి వివాహానికి అంగీకరించిన సుబ్రహ్మణ్యం, ముందుగా నిర్ణయించిన ముహూర్తం దాటిపోవడంతో జూలై 8వ తేదీ తెల్లవారుజామున 1.28 గంటలకు కొత్త ముహూర్తం నిర్ణయించినప్పటికీ, మళ్లీ వివాహానికి నిరాకరించినట్లు వెల్లడించారు.దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఉమాదేవి జూలై 3వ తేదీ రాత్రి సుమారు 10.30 గంటలకు తన ఇంటి పడకగదిలో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.మృతురాలి తండ్రి కేశనకుర్తి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు గొర్రెల నాగ సుబ్రహ్మణ్యంపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కడియం సీఐ ఏ. వెంకటేశ్వరరావు తెలిపారు.

## వాడపల్లి వెంకన్న సన్నిధిలో ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ ప్రత్యేక పూజలు.



ఆత్రేయపురం, జూలై, 04,(ప్రభాత వార్త). ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రముఖ సినీ దర్శకుడు హరీష్ శంకర్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజల్లో నిర్వహించారు .అనంతరం వేద పండితులు వేద ఆచర్వచనం అందించి శ్రీ స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కత్తిపూడి లో ఘనంగా వంగవీటి 79వ జయంతి వేడుకలు



శంఖవరం జులై 4 ప్రభాతవార్త శంఖవరం మండల కత్తిపూడి లో కీ.శే. వంగవీటి మోహన రంగా 79వ జయంతి వేడుకలను కాపు యువత సభ్యులు ఘనంగా నిర్వహించారు. కత్తిపూడి కాంప్లెక్స్ వద్ద గల వంగవీటి విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువత సభ్యులు మాట్లాడుతూ వంగవీటి ఒక్క కులానికో, మతానికో ప్రతినిధి కాదని, ఆయన బడుగు, బలహీన వర్గాలు, పేదల అణచివేతలను అడ్డుకుని, వారికి అండగా నిలిచిన ఆపద్బాంధవుడన్నారు. అటువంటి మహనీయుని స్ఫూర్తితో ప్రతీ ఒక్కరు పేదలకు అండగా నిలిచి, వారి శ్రేయస్సుకు కృషి చేయాలన్నారు. నేటి రాజకీయాల్లో వంగవీటి లాంటి నేత నేడు మనకు లేకపోవడం ఎంతో తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో కాపు యువత సభ్యులు రంగా అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా వంగవీటి రంగా జయంతి వేడుకలు



యు.కొత్తపల్లి, జూలై 4(ప్రభాతవార్త) :దివంగత వంగవీటి మోహనరంగా 79వ జయంతి సందర్భంగా శనివారం మండల కేంద్రం కొత్తపల్లిలో ఉన్న విగ్రహానికి యువత భారీ స్థాయిలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేకును కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా రంగా చేసిన సేవలను కొనియాడారు. ప్రజలు మెచ్చిన నాయకుడు రంగ అన్నారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలంటూ కొనియాడారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps